


# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు




గొడ్డలి పార్టీతో ఉత్తరాంధ్ర అభివృద్ధిపై వేటుపడిందని, ప్రజా ప్రభుత్వంలో ఉత్తరాంధ్ర నుంచి వలసలు వెళ్లకుండా ఉత్తరాంధ్రకే వలసలు వచ్చేలా సంకల్పం తీసుకున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఉత్తరాంధ్రతోపాటు రాయలసీమ, కోస్తా జిల్లాల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. రోజుకు ఓ డ్రామాతో వచ్చే వారితో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మళ్లీ రాష్ట్రంలో వైకుంఠపాళి వద్దని హెచ్చరించారు. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలోని తామ్రపల్లిలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. ప్రజావేదిక సభలో పాల్గొని ముఖ్యమంత్రి ప్రసంగించారు.

# వలసలు రివర్స్!



- భారీ పెట్టుబడులతో ఉత్తరాంధ్రకే వలసలు
- మూడేళ్లలో నేరడి బ్యారేజ్ పూర్తి
- స్వచ్ఛాంధ్ర కోసం ఆపరేషన్ క్లీన్ స్వీప్
- స్వచ్ఛపథంతో రహదారుల శుభ్రం
- స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో సీఎం చంద్రబాబు
- జిల్లాలోనూ పరిమిత కాన్వాయ్‌తోనే పర్యటన

- వివరాలు 2 లో..



26కు అటూ ఇటుగా

## కేరళకు రుతుపవనాలు

**వాతావరణ శాఖ కీలక ప్రకటన**

దేశవ్యాప్తంగా రైతులు ఎదురు చూస్తున్న నైరుతి రుతుపవనాల రాకపై వాతావరణ శాఖ కీలక ప్రకటన చేసింది. సాధారణంగా మే 26 ప్రాంతంలో కేరళను తాకే నైరుతి రుతుపవనాలు ఈసారి నాలుగురోజుల ముందుగానో లేదా నాలుగురోజుల ఆలస్యంగానో కేరళలో ప్రవేశించే అవకాశ ముందని ఐఎండీ వెల్లడించింది.

8

## అంపశయ్యనుంచి అభివృద్ధి పథంలోకి...



- కూటమి రాకతో చేనేతకు స్వర్ణయుగం ప్రారంభం
- చేనేత రంగ అభివృద్ధికి నూతన టెక్స్‌టైల్స్ పాలసీ
- నేతన్నలకు వ్యక్తిగత లబ్ధి కలిగేలా పథకాలు అమలు
- లక్షకుపైగా నేతన్నల కుటుంబాల్లో ఉచిత విద్యుత్ వెలుగులు
- 15 శాతం సబ్సిడీకే నూలు... 90 శాతం సబ్సిడీతో ఆధునిక పనిముట్లు
- చేనేత సహకార సంఘాలకు విడతల వారీగా బకాయిల చెల్లింపు
- రాష్ట్రవ్యాప్తంగా క్లస్టర్లు, మెగా టెక్స్‌టైల్స్ పార్కుల ఏర్పాటు
- చేనేత వస్త్రాల అమ్మకాలు పెంచేలా ఒప్పందాలు
- ఆప్కో షోరూముల్లో పెరిగిన అమ్మకాలు... ఇళ్ల ముంగిటకే చేనేత వస్త్రాలు
- లోకేష్ చొరవతో మంగళగిరి చేనేతకు అంతర్జాతీయస్థాయి గుర్తింపు
- నేతన్నలు కాలరెగరేసేలా కూటమి పాలన

4

## ఆక్వా ప్రయోజనాల పరిరక్షణకు చర్యలు

- రైతులకు ప్రయోజనం చేకూరేలా నిర్ణయం తీసుకోవాలి
- ఇటీవల కేంద్రానికి లేఖ రాసిన సీఎం చంద్రబాబు
- మరోమారు కేంద్రానికి విజ్ఞప్తి చేయనున్న రాష్ట్ర ప్రభుత్వం

5



ప్లాస్టిక్ భూతాన్ని తరిమి...

**భావితరాలకు ఆరోగ్యాన్నిద్దాం!**

రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

9

## నా దేశం.. నా బాధ్యతగా పొదుపు




- ఇంధన వినియోగాన్ని తగ్గిద్దాం
- జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు
- పాలకొల్లులో రూ.5.15 కోట్ల పనులకు శ్రీకారం

- వివరాలు 8 లో..

## మూడుకు 30వేలు.. నాలుగుకు 40వేలు!

- పిల్లలే సంపద పేరిట త్వరలో కొత్త కార్యక్రమం
- జనాభా పెరుగుదలకు ఏపీ ప్రభుత్వం ప్రోత్సాహకాలు
- పాపులేషన్ మేనేజ్మెంట్ పాలసీపై సీఎం చంద్రబాబు ప్రకటన



దేశ ప్రగతిలో పిల్లలే అసలైన సంపద అని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. జనాభా తగ్గుదల ఆందోళన కలిగిస్తోందని, జనాభా తగ్గుదల రేటును అరికట్టేందుకు ప్రత్యేకంగా కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పిల్లలే సంపద పేరుతో త్వరలో కొత్త కార్యక్రమం చేపడతామని శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో జరిగిన స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ప్రకటించారు.

- వివరాలు 3 లో..



## సౌర విద్యుదుత్పత్తికి ప్రోత్సాహం

- పెద్దఎత్తున సూర్యఘర్ కార్యక్రమం
- ఇంధన పొదుపు కీలకం
- మంత్రి గొట్టిపాటి రవికుమార్

- వివరాలు 7 లో..



## పచ్చదనం, పరిశుభ్రత అందరి బాధ్యత

- మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి
- స్వయంగా డస్ట్ బిన్‌తో చెత్త సేకరణ

- వివరాలు 5 లో..



## స్వచ్ఛత పాటిద్దాం.. ఇందన పొదుపు చేద్దాం

- ప్రతి మూడో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర
- మచిలీపట్నంలో మంత్రి కొల్లు

- వివరాలు 8 లో..





# వలసలు రివర్స్!

- భారీ పెట్టుబడులతో ఉత్తరాంధ్రకే వలసలు
- మూడేళ్లలో నేరడి బ్యారేజ్ పూర్తి
- స్వచ్ఛాంధ్ర కోసం ఆపరేషన్ క్లీన్ స్వీప్
- స్వచ్ఛపథంతో రహదారుల శుభ్రం
- స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో సీఎం చంద్రబాబు
- జిల్లాలోనూ పరిమిత కాన్వాయ్‌తోనే పర్యటన



నరసన్నపేట (చైతన్య రథం): గొడ్డలి పార్టీతో ఉత్తరాంధ్ర అభివృద్ధిపై వేటుపడిందని, ప్రజా ప్రభుత్వంలో ఉత్తరాంధ్ర నుంచి వలసలు వెళ్లకుండా ఉత్తరాంధ్రకే వలసలు వచ్చేలా సంకల్పం తీసుకున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఉత్తరాంధ్రతోపాటు రాయలసీమ, కోస్తా జిల్లాల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. రోజుకు ఓ డ్రామాతో వచ్చే వారితో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మళ్లీ రాష్ట్రంలో వైకుంఠపాళి వద్దని హెచ్చరించారు. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలోని తామ్రపల్లిలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. ప్రజావేదిక సభలో పాల్గొని ముఖ్యమంత్రి ప్రసంగించారు. "రాష్ట్రం పరిశుభ్రంగా ఉండాలనే సంకల్పంతోనే స్వచ్ఛాంధ్ర కార్యక్రమం చేపట్టాం. స్వచ్ఛపథం కార్యక్రమంలో భాగంగా గ్రామీణ అర్బన్ ప్రాంతాల్లోని రహదారులను శుభ్రపరిచేలా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. ప్రతినెలా 1న పేదల సేవలో కార్యక్రమంలో పాల్గొని



అర్హులకు స్వయంగా పింఛన్లు అందించడం ద్వారా ఎంతో ఆనందం కలుగుతోంది. పేదరికంలేని సమాజం, ప్రజల జీవన ప్రమాణాలు పెంచాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. జనాభా తగ్గుదల ఆందోళన కలిగిస్తోంది. పిల్లలే సంపద అని పిలుపునిస్తున్నాను. అందుకే మూడు, నాలుగో సంతానానికి ప్రోత్సాహకం అందించేలా నిర్ణయం తీసుకుంటున్నాం. మూడో సంతానానికి 30 వేలు, నాలుగో సంతానానికి రూ.40 వేలు ప్రోత్సాహకం ఇస్తాం. అంగన్వాడీలను బలోపేతం చేస్తున్నాం. తల్లికి వందనం కింద రూ.15 వేలు ఆర్థిక సాయం చేస్తున్నాం. రీ సర్వే ద్వారా భూముల రికార్డులు ప్రక్షాళన చేస్తున్నాం. ఎవరూ ట్యాంపరింగ్ చేసే అవకాశం లేకుండా ఆధునిక టెక్నాలజీని వినియోగించి పట్టదారు పాస్ పుస్తకాలను ముద్రించి అందిస్తున్నాం. 2027 మార్చినాటికి రాష్ట్రంలో ఎక్కడా భూతగాదాలు లేకుండా చేసే బాధ్యత తీసుకుంటామని" ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

## సగర్వంగా స్వచ్ఛతవైపు అడుగులు

"17 నెలలుగా మనం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించుకుంటున్నాం. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ఒక ఉద్యమంలా చేస్తున్నాం. పరిసరాలు, పరిశుభ్రత విషయంలో మార్పు కనిపిస్తోంది. మన ఆలోచనలు స్వచ్ఛంగా ఉంటే మన అలవాట్లు మారుతాయి. అలవాట్లు మారితే సమాజం మారుతుంది. సమాజం మారితేనే స్వచ్ఛాంధ్ర సాకారం అవుతుంది. 2047 నాటికి స్వర్ణాంధ్ర సాధన లక్ష్యంతో పనిచేస్తున్నాం. ప్రస్తుతం మన తలసరి ఆదాయం రూ.3 లక్షలు. దీన్ని రాబోయే 22 ఏళ్లలో రూ.54 లక్షలు చేయాలనే దిశగా ముందుకెళ్తున్నాం. పేదలను ఆర్థికంగా ఆదుకునేందుకు పీ4 తీసుకొచ్చాం. పైన ఉండే 10 శాతం మంది కింద ఉండే 20 శాతం మందిని ఆర్థికంగా పైకి తీసుకు రావాలి. 2047 నాటికి మనదేశం ప్రపంచంలోనే నెంబర్ వన్ గా నిలుస్తుంది. ఆ దిశగా ప్రదాని మోదీ ముందుకెళుతున్నారని" సీఎం చంద్రబాబు అన్నారు.

## జూన్‌నాటికి 100 శాతం చెత్త శుభ్రం

"ప్రజా ప్రభుత్వం వచ్చాక 86 లక్షల మెట్రిక్ టన్నుల లెగసీ వేస్ట్ క్లియర్ చేశాం. ఈ 23 నెలల్లో 121 లక్షల టన్నుల చెత్త తొలగించాం. జూన్‌కల్లా వందశాతం పూర్తవుతుంది. డోర్ టు డోర్ కలెక్షన్ ద్వారా ప్రతీ రోజూ పట్టణాల్లో 7,527 టన్నులు, గ్రామాల్లో 1,430 టన్నుల చెత్తను సేకరిస్తున్నాం. రూ.1,254 కోట్లతో 6 వేస్ట్ టూ ఎనర్జీ ప్రాజెక్టులు, 6 సీబీజీ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నాం. చెత్త ప్రాసెసింగ్ కోసం రూ.603 కోట్లతో 107 ఇంటిగ్రేటెడ్ ప్లాంట్లు సిద్ధం చేస్తున్నాం. ఇవి అక్టోబర్‌నాటికి అందుబాటులోకి వస్తే డంపింగ్ యార్డ్ అనేదే ఉండదు. నెట్ జీరో క్యాంపస్‌లో భాగంగా హాస్టళ్ల నుంచి వ్యర్థాలు లేకుండా ప్రణాళిక చేశాం. ప్రభుత్వ కార్యాలయాలపై సోలార్ విద్యుదుత్పత్తి, కిచెన్ గార్డెన్స్, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్, కంపోస్టింగ్, వాటర్ టెస్ట్ కిట్స్, ముస్తాబువంటివి అమలుచేస్తున్నాం. ప్రతీ నెలా 10, 20 తేదీల్లో ఈ-వ్యర్థాలు సేకరిస్తున్నాం. చెత్త సేకరణకు 200 ఈ-ఆటోలు వినియోగిస్తున్నాం. ఈ నెలాఖరు కల్లా కొత్తగా 5,000 పుష్ కార్ట్స్, 12,000 ట్రై సైకిళ్లు తెస్తాం. రాష్ట్రంలో ప్రస్తుతం 31.33 శాతం గ్రీన్ కవర్ ఉంది. 2030 నాటికి 37 శాతానికి, 2047 కల్లా 50 శాతానికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. 633 స్వచ్ఛ రథాలతో రోజుకు 125 టన్నుల పొడి చెత్త సేకరిస్తున్నాం. ఇప్పటికి 47 లక్షల కేజీల చెత్తను సేకరించి రూ.8 కోట్ల విలువైన నిత్యావసరాలు ఇచ్చారు. కొత్తగా గ్రీన్ షాప్స్‌ను ప్రారంభించాం. ప్రజలే అక్కడికి వెళ్లి ప్లాస్టిక్, ఐరన్‌వంటి వ్యర్థాలను ఇచ్చి... వస్తువులు పొందవచ్చు. వావ్ పేరుతో పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. నెల్లూరు, అనకాపల్లి, చిత్తూరులలో సర్క్యులర్ ఎకానమీ పార్కులు నిర్మిస్తున్నాం. నేటినుంచి 50 ప్లాస్టిక్ వ్యర్థ యూనిట్లు వస్తుండగా మరో 210 యూనిట్లు జూన్‌కి అందుబాటులోకి తెస్తామని" ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు.

## రాష్ట్రానికి మరిన్ని అవార్డులు రావాలి

"మన ఇల్లే కాదు. చుట్టూ ఉన్న పరిసరాలు, మన రహదారులను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలి. గతంలో నేను పాదయాత్ర చేసినప్పుడు గ్రామాలు, పట్టణాల్లో ఊరి చివర్లో ఎక్కడ చూసినా చెత్తా-చెదారం కనిపించేది. అప్పుడే రహదారులను పరిశుభ్రంగా మార్చాలని నిర్ణయించుకున్నాను. అందుకే స్వచ్ఛపథం పేరిట ఇప్పుడు కార్యక్రమం చేపడుతున్నాం. రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో మురుగునీరు వ్యర్థాలు పొంగిపొర్లకుండా మ్యాజిక్ డ్రైన్లను నిర్మిస్తున్నాం. రాష్ట్రంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను కూడా మనం వాడకుండా నిషేధం విధించుకోవాల్సిన అవసరం ఉంది. అత్యుత్తమ విధానాలను అనుసరించటం ద్వారా రాష్ట్రంలోని పంచాయితీలకు జాతీయస్థాయి అవార్డులు వచ్చాయి. కందులవారిపల్లె, చిత్తూరు జిల్లా, కాణిపాకం ఇలా వేర్వేరు పంచాయితీలు అత్యుత్తమ పనితీరు కనబరచడం ప్రభుత్వం చేస్తోన్న కృషికి దక్కిన ఫలితంగా భావిస్తున్నాను. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నిర్వహించే ఈ శాఖలో జాతీయస్థాయిలో 8 అవార్డులు వచ్చాయి. మరిన్ని అవార్డులను రాష్ట్రంలోని గ్రామాలు, పట్టణాలు దక్కించుకోవాలని కోరుతున్నాను. ఇవాల్టినుంచి ఆపరేషన్ క్లీన్ స్వీప్ రాష్ట్రంలో ప్రారంభమవుతుంది. నెలరోజులపాటు ఈ ప్రత్యేక డ్రైవ్ చేపడతాం. నాలుగు వారాలపాటు అధికారులు, ప్రజాప్రతినిధులు కూడా కార్యక్రమంలో పాల్గొనాలి. మున్సిపాలిటీలు కూడా స్వచ్ఛతా అవార్డులు దక్కించుకుంటాయని ఆకాంక్షిస్తున్నానని" ముఖ్యమంత్రి తెలిపారు.

## అధికారం అంటే విధ్వంసం కాదు


"శ్రీకాకుళంనుంచి అనంతపురం వరకూ అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం. 23 నెలల్లో రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు కుదిరాయి. ప్రతి ఒప్పందం కార్యరూపం దాల్చుతోంది. వీటి ద్వారా రానున్న రోజుల్లో 24 లక్షల ఉద్యోగాలు వస్తాయి. నిన్ననే పుట్టపర్తిలో డిఫెన్స్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసుకున్నాం. కేవలం 36 రోజుల్లో అనుమతులు తెచ్చి, భూములు ఇచ్చి దేశం గర్వించే డిఫెన్స్ ప్రాజెక్టును సాధించడం మన ప్రభుత్వ సామర్థ్యానికి నిదర్శనం. అధికారం అంటే విధ్వంసం కాదు. ప్రజల జీవితాలు మార్చే అవకాశమని నమ్ముతున్నాం. అధికారం అంటే విశాఖకు గూగుల్ తేవడం, అమరావతికి క్వాంటం తేవడం, సీమకు డిఫెన్స్ ప్రాజెక్టు తేవడం. ఇకపై ఉత్తరాంధ్రనుంచి వలసలు కాదు.. ఉత్తరాంధ్రకే వలస వస్తారు. దేశంలో ఎక్కడికి పోయినా శ్రీకాకుళం కాలనీ ఉంటుంది. పోర్టులు, ఎయిర్ పోర్టులు, ఐటీ కంపెనీలు, డాటా సెంటర్లతో ఉత్తరాంధ్ర దశ మారుతుంది. సాగునీటి ప్రాజెక్టులతో దిశ మారుతుంది. దాదాపు రూ.లక్ష కోట్లతో

- (మిగతా వివరాలు 3లో)

## పిల్లలే సంపద పేరిట
# త్వరలో కొత్త కార్యక్రమం

- **జనాభా పెరుగుదలకు ఏపీ ప్రభుత్వం ప్రోత్సాహకాలు**
- **పాపులేషన్ మేనేజ్మెంట్ పాలసీపై సీఎం చంద్రబాబు ప్రకటన**

అమరావతి (చైతన్య రథం): దేశ ప్రగతిలో పిల్లలే అసలైన సంపద అని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. జనాభా తగ్గుదల ఆందోళన కలిగిస్తోందని, జనాభా తగ్గుదల రేటును అరికట్టేందుకు ప్రత్యేకంగా కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పిల్లలే సంపద పేరుతో త్వరలో కొత్త కార్యక్రమం చేపడతామని శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో జరిగిన స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ప్రకటించారు. పాపులేషన్ మేనేజ్మెంట్ ద్వారా జనాభాను దేశానికి సంపదగా మార్చే ప్రయత్నం చేస్తున్నామని సీఎం స్పష్టం చేశారు. మూడో సంతానానికి రూ.30 వేలు, నాలుగో సంతానానికి రూ.40 వేలు ప్రోత్సాహకంగా అందిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. చాలామంది ఒక బిడ్డతోనే సరిపెట్టుకుంటున్నారని ఈ కారణంగా చాలా దేశాల్లో జనాభా తగ్గి వృద్ధుల సంఖ్య పెరుగుతోందని అన్నారు. దీనివల్ల ఆయా దేశాల్లో ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటోందని స్పష్టం చేశారు. గతంలో కుటుంబ నియంత్రణ అమలుపై విస్తృతంగా పనిచేశామని.. ఇప్పుడు మారిన పరిస్థితుల రీత్యా పిల్లలే సంపద అని పిలుపునిస్తున్నానని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. పాపులేషన్ మేనేజ్మెంట్ పాలసీ ద్వారా జననాల రేటును పెంచేలా చర్యలు చేపడతామని సీఎం స్పష్టం చేశారు.



స్త్రీశిశు సంక్షేమ శాఖ ద్వారా తల్లులకు, పిల్లలకు పౌష్టికాహారం అందించేలా ఆంగన్వాడీ కేంద్రాలను కూడా బలోపేతం చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే తల్లికి వందనం పథకం కింద రూ.15 వేలు ఆర్థిక సాయం కూడా అందిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు.

## బుల్లెట్‌పై సీఎం చంద్రబాబు

*నరసన్నపేట (చైతన్య రథం): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీకాకుళం జిల్లా నర్సన్నపేటలో పర్యటించారు. 'స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజావేదిక సమీపంలోని స్టాళ్లను సీఎం చంద్రబాబు పరిశీలించారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో 'స్వర ఆర్ట్ గ్యాలరీ'లో గిరిజనులు ప్రత్యేకంగా రూపొందించిన ఓవర్కోట్ను ఆయన కొనుగోలు చేసి ధరించారు. అనంతరం శ్రీకాకుళం జిల్లాలో పోలీసులు ఏర్పాటు చేసిన 'హెల్మెట్ బ్యాంక్'ను సందర్శించారు. పోలీసులను అభినందించిన సీఎం.. హెల్మెట్ ధరించి బుల్లెట్ వాహనం ఎక్కారు. ఆయనవెంట కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, ఏపీ మంత్రి అచ్చెన్నాయుడు, అధికారులు ఉన్నారు.*



## కార్మికుల దుర్మరణం కలచివేసింది

**విచారం వ్యక్తం చేసి మంత్రి లోకేష్**

అమరావతి (చైతన్య రథం): కాకినాడ రూరల్ కొవ్వూరు బ్రిడ్జివద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు ఉపాధి హామీ కార్మికులు దుర్మరణం పాలవడం కలచివేసిందని ఐటీ మంత్రి నారా లోకేష్ విచారం వ్యక్తం చేశారు.

ఉపాధి పనులకు వెళ్తూ ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని ఆందోళన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్నివిధాల అండగా ఉంటుందని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్టు ఎక్స్ ట్వీట్‌లో పేర్కొన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు మంత్రి లోకేష్ ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

# వలసలు రివర్స్!




*(2వ పేజీ తరువాయి)*

రిలయన్స్ కూడా డేటా సెంటర్ ఏర్పాటుకు ముందుకు వచ్చింది. టీసీఎస్, కాగ్నిజెంట్‌వంటి ఐటీ కంపెనీలతోపాటు ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్, రెన్యూపవర్ గ్రీన్‌ఎనర్జీ వంటి ప్రముఖ కంపెనీలు ఉత్తరాంధ్రలో అడుగుపెట్టాయి. జూలైలో భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభించుకుంటున్నాం. శ్రీకాకుళం జిల్లాకు మరో ఎయిర్ పోర్టు తీసుకువస్తాం. పలాసలో కొత్త ఎయిర్ పోర్ట్‌ను కూడా త్వరలో నిర్మాణం చేపడ తాం. మూలపేట పోర్టు ఉత్తరాంధ్రకే అడ్వాంటేజ్ అవుతుంది. ఈఏడాదిలోనే మూలపేట పోర్టును ప్రారం భిస్తాం"అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టంచేశారు.

### శ్రీకాకుళం జిల్లాను అభివృద్ధి చేస్తాం

"రాష్ట్రంలో ఎక్కువ జాతీయ రహదారి, సముద్ర తీరం, నీరు, తెలివైన ప్రజలు ఉండే జిల్లా శ్రీకాకుళం. కానీ అభివృద్ధిలో వెనుకుంది. శ్రీకాకుళం జిల్లాను అభివృద్ధిచేస్తాం. ఉత్తరాంధ్ర ఇన్ఫ్రా ప్రాజెక్టులతోపాటు సాగునీటి ప్రాజెక్టులపైనా దృష్టిపెట్టాం. ఉత్తరాంధ్రలో ఏ ప్రాజెక్టును ఎప్పటికల్లా పూర్తి చేయాలో ఇరిగేషన్ క్యాలెండర్ ఇచ్చాం. మద్దువలస స్టేజ్-2 జనవరి 2027, హిరమండలం ఎత్తిపోతల పథకం ఏప్రిల్ 2027, వంశధార ఫేజ్-2 స్టేజ్-2 (హిరమండలం రిజర్వాయర్) జూలై 2027, తోటపల్లి డిస్ట్రిబ్యూటరీస్ జూలై 2027, జంఝావతి రిజర్వాయర్ ప్రాజెక్ట్ డిసెంబర్ 2027నాటికి పూర్తి చేయాలన్న లక్ష్యంతో పనులు చేస్తున్నాం. ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక నేరడి బ్యారేజ్‌కు అడ్డంకులు తొలగి కేంద్రంనుంచి అనుమతులు సాధించాం. నవంబర్‌లో శంకుస్థాపన చేస్తాం. రాబోయే మూడేళ్లలో నేరేడి ప్రాజెక్టు పూర్తిచేస్తామని" ముఖ్యమంత్రి తెలిపారు.



### గొడ్డలిపార్టీతో అప్రమత్తంగా ఉండాలి

"ప్రపంచంలో తెలుగువారు అగ్రస్థానంలో ఉండాలని, దేశంలో ఏపీ నెంబర్ వన్ స్టేట్ కావాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. ప్రజలంతా ఆలోచించాలి. 23 నెలల క్రితం వరకు ఉత్తరాంధ్రలో ఏమీలేవు.నాటి పాలనలో ఎక్కడ చూసినా ప్రభుత్వ టెర్రరిజం, కబ్జాలు, బెది రింపులు, కేసులు,అరాచకాలే. అచ్చెన్నాయుడు లాంటి నేతల్ని అక్రమ కేసుల్లో ఇరికించి అరెస్ట్ చేశారు. గడిచిన ఐదేళ్లలో ప్రజల్లో అశాంతి, అలజడి, అభద్రత నెలకొంది. ఎవరి ఆస్తి ఎప్పుడు కబ్జా చేస్తారో తెలీని పరిస్థితి. అనేక వనరులున్నప్పటికీ గొడ్డలి పార్టీతో ఉత్తరాంధ్ర అభివృద్ధికి వేటుపడింది. అన్నింటినీ సరిచేసి ఏపీకి మళ్లీ బ్రాండ్ క్రియేట్ చేశాం. గొడ్డలి పార్టీ నాయకులు కులాలు, మతాలు, ప్రాంతాలు మధ్య చిచ్చు పెడతారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారంతో వ్యక్తిత్వ హననం చేస్తున్నారు. నేషనల్ క్రైమ్ బ్యూరో నివేదిక ప్రకారం దేశంలో ఫేక్ న్యూస్ ప్రచారం చేసే రాష్ట్రాల్లో ఏపీ 2వ స్థానంలో ఉందంటే గొడ్డలి పార్టీనే కారణం. పంపకాల్లో తేడాలు వస్తే సొంత వాళ్లను చంపేసి మళ్లీ మాపై బురద వేస్తారు. సొంత బాబాయ్‌ని చంపి ఆ నేరం నాపై మోపారు. గొడ్డలి ప్లస్ అంటూ కొత్త నాటకాలతో వస్తారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఏదైనా ఒక పిలుపునిస్తే పాటించడంలో ఉత్తరాంధ్ర వాళ్లు ముందుంటారు. హుద్ హుద్ సమయంలో దీపావళి టపాసులు వద్దు అని చెపితే... చిన్న క్రాకర్ కూడా కాల్చలేదు. అదీ మీ నిబద్ధత" అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.



### ప్రధాని సూచనలు పాటిద్దాం

"యుద్ధ ప్రభావం కారణంగా ప్రధాని మోదీ చేసిన సూచనలను బాధ్యతగల పౌరులుగా అందరం పాటించి దేశానికి సహకరిద్దాం. వర్క్ ఫ్రం హోం అలవాటు చేసుకుని వీలైనంతవరకూ ఇంట్లో నుంచే పనిచేద్దాం. బంగారం కొనడం తగ్గిద్దాం. పబ్లిక్ ట్రాన్స్ పోర్ట్‌లోనే ప్రయాణిద్దాం. వంట నూనెల వాడకం తగ్గిద్దాం. ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహిద్దాం. మేడిన్ ఆంధ్రా, మేడిన్ ఇండియా బ్రాండ్లను కొనుగోలు చేద్దాం. టూరిజం కోసం విదేశీ పర్యటనలకంటే ఏపీలోని పర్యాటక ప్రాంతాలకు వెళ్ళాలి" అని ముఖ్యమంత్రి ప్రజలకు పిలుపునిచ్చారు. జిల్లా పర్యటనలో పొదుపు చర్యల్లో భాగంగా సీఎం నాలుగు వాహనాల కాన్వాయ్‌లో మాత్రమే ప్రయాణించారు. శ్రీకాకుళం జిల్లా, నరసన్నపేట నియోజకవర్గ అభివృద్ధి నివేదికను సీఎం చంద్రబాబు ప్రజలకు చదివి వినిపించారు. వివిధ శాఖల పనితీరును ప్రజలకు వివరించారు. నియోజకవర్గ పరిధిలోని రాజులచెరువు ఆధునీకరణకు నిధులు మంజూరు చేస్తామని, ఎన్‌హెచ్ 5నుంచి నరసన్నపేట పట్టణ పరిధిలో రూ.15 కోట్లు వ్యయంతో రహదారి నిర్మాణం చేపడతామని, కింజరాపు ఎర్రన్నాయుడు చిల్డ్రన్ పార్క్ ఏర్పాటు చేస్తామని, శ్రీముఖ లింగం ఆలయ ఉత్సవాలను ప్రభుత్వం తరపున అధికారికంగా నిర్వహిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు. అనంతరం ప్రజావేదిక వద్ద ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం తిలకించారు. అక్కడ సీతంపేట ఐటీడిఏ ఆధ్వర్యంలో గిరిజనులు ప్రత్యేకంగా తయారు చేసిన సవర ఆర్ట్ ఓవర్ కోటును ముఖ్యమంత్రి ధరించారు. పోలీసులు ఏర్పాటు చేసిన హెల్మెట్ బ్యాంక్‌ను చూసి సీఎం అభినందించారు. హెల్మెట్ ధరించి అక్కడే ఉన్న బుల్లెట్ వాహనం అధిరోహించారు. కార్యక్రమంలో మంత్రులు అచ్చెన్నాయుడు, కొండపల్లి శ్రీనివాస్, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# అంపశయ్యనుంచి అభివృద్ధి పథంలోకి...



- కూటమి రాకతో చేనేతకు స్వర్ణయుగం ప్రారంభం
- చేనేత రంగ అభివృద్ధికి నూతన టెక్స్‌టైల్స్ పాలసీ
- నేతన్నలకు వ్యక్తిగత లబ్ధి కలిగేలా పథకాలు అమలు
- లక్షకుపైగా నేతన్నల కుటుంబాల్లో ఉచిత విద్యుత్ వెలుగులు
- 15శాతం సబ్సిడీకే నూలు... 90 శాతం సబ్సిడీతో ఆధునిక పనిముట్లు
- చేనేత సహకార సంఘాలకు విడతల వారీగా బకాయిల చెల్లింపు
- రాష్ట్రవ్యాప్తంగా క్లస్టర్లు, మెగా టెక్స్‌టైల్స్ పార్కుల ఏర్పాటు
- చేనేత వస్త్రాల అమ్మకాలు పెంచేలా ఒప్పందాలు
- ఆప్కో షోరూముల్లో పెరిగిన అమ్మకాలు... ఇళ్ల ముంగిటకే చేనేత వస్త్రాలు
- లోకేష్ చొరవతో మంగళగిరి చేనేతకు అంతర్జాతీయస్థాయి గుర్తింపు
- నేతన్నలు కాలరెగరేసేలా కూటమి పాలన

అమరావతి (చైతన్య రథం): కూటమి ప్రభుత్వం రాక నిస్తేజంలో కూరుకుపోయిన నేతన్నకు భరోసానిచ్చింది. గత రెండేళ్ల కాలంలో చేనేత రంగ అభివృద్ధికి, నేతన్నల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యలతో అంపశయ్యపై ఉన్న చేనేత పరిశ్రమ అభివృద్ధి పథంలోకి పయనించసాగింది. ఒకవైపు నూతన టెక్స్‌టైల్స్ పాలసీ, మరోవైపు వ్యక్తిగత లబ్ధి పొందేలా పథకాల అమలు, ఇంకోవైపు చేనేత సహకార సంఘాల బలోపేతానికి చర్యలతో డీలా పడిన చేనేత రంగానికి కూటమి ప్రభుత్వం జవసత్వాలు నింపింది. నేను కూలీని కాదు కళాకారుడిని అని నేతన్నలు కాలరెగరేసేలా కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపింది, ఆత్మగౌరవాన్ని ఇచ్చింది. చేనేత రంగాన్ని ఆదుకున్న ఎన్టీఆర్ స్ఫూర్తితో పాలన సాగిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు సైతం నేతన్నలకు లబ్ధి కలిగేలా ఎన్నో నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇక మంత్రి నారా లోకేష్ తీసుకున్న చొరవతో మంగళగిరి చేనేతకు అంతర్జాతీయ గుర్తింపు, గౌరవం దక్కింది.

## చేనేతకు పథకాలతో చేయూత...

2024లో సీఎం చంద్రబాబు నేతృత్వంలో ఏర్పడిన ఎన్డీయే ప్రభుత్వం చేనేతలకు అండగా నిలిచింది. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కింద 92,724 మంది నేతన్నలకు రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెన్షన్ పెంచారు. చేనేతలకు త్రిఫ్ట్ కింద ప్రభుత్వ వాటాను 8 నుంచి 16 శాతానికి పెంచారు. ఈ పథకం కింద 2024-25లో రూ.5 కోట్లు, 2025-26లోనూ మరో రూ.5 కోట్లు కేటాయించారు. త్రిఫ్ట్ పథకం ద్వారా 5,726 మందికి లబ్ధి కలిగింది. రెండేళ్లలో రూ.65.35 కోట్ల మేర ముద్ర రుణాలను 6,808 మందికి అందజేశారు. జాతీయ చేనేత అభివృద్ధి కార్యక్రమం (ఎన్.హెచ్.డి.పి) పథకం ద్వారా చిన్న క్లస్టర్ అభివృద్ధి కార్యక్రమాలకు రూ.10.44 కోట్లను వెచ్చించగా, 7,500 మంది చేనేతలకు లబ్ధి కలిగింది. రూ.175 కోట్లతో ముడి పదార్థాల సరఫరా పథకం ద్వారా నూలు కొనుగోలుపై 15శాతం సబ్సిడీ అందజేశారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా చేనేత ఉత్పత్తుల 5శాతం జీఎస్టీ రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారు. స్వయం సహాయక సంఘాల్లో ఉన్న చేనేత మహిళలకు రూ.10 వేలు విలువ చేసే నూలును అందజేస్తున్నారు. 2024 ఏప్రిల్ నుంచి 109 ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు రూ.78.73 కోట్ల నగదు పరపతి సౌకర్యం కల్పించారు. ఆధునిక పనిముట్ల కొనుగోలుకు 90 శాతం వరకు సబ్సిడీతో పాటు క్యాష్ క్రెడిట్ పథకం కింద సహకార సంఘాలకు బ్యాంకు రుణాలు అందజేస్తున్నారు.

## నేతన్నల కుటుంబాల్లో 'ఉచిత' వెలుగులు

గత ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు స్వయంగా నేతన్నల కష్టాలను తెలుసుకుని, ఉచిత విద్యుత్ అందజేస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటకు కట్టుబడుతూ, మగ్గం నేతన్నలకు 200 యూనిట్లు, మరమగ్గం నేతన్నలకు 500 యూనిట్ల విద్యుత్‌ను ఉచితంగా అందిస్తున్నారు. ఇందుకోసం ఏడాదికి రూ.150 కోట్లను చంద్రబాబు ప్రభుత్వం వెచ్చిస్తోంది. సుమారు 1.04 లక్షల కుటుంబాలకు ఉచిత విద్యుత్ పథకం ద్వారా లబ్ధి కలుగనుంది. పథకం ద్వారా ఏడాదికి మగ్గం నేతన్నలకు రూ.8,640లు, మరమగ్గం నేతన్నలకు రూ.21,600లు ఆదా అవుతోంది.

## ఇళ్ల ముంగిటకే చేనేత వస్త్రాలు

నేటితరం అభిరుచులకు అనుగుణంగా చేనేత వస్త్రాల తయారీలో 5 జిల్లాల్లో నైపుణ్య అభివృద్ధి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు. కలంకారి చీరలు, పెన్ కలంకారి చీరలు, దుపట్టాలు, డిజిటల్ ప్రింటెడ్ చీరలు, క్రోచెట్ లేస్ చీరల తయారీలో శిక్షణ అందజేశారు. ఆప్కో షోరూముల్లో రెడీమేడ్ చేనేత వస్త్రాలను అమ్మకాలు ప్రారంభించారు. వెల్క్రో ధోవతులు, కాటన్ రెడీమేడ్ పెళ్లికూతురి ధోవతులు, మోడీ జాకెట్లు, సిల్క్ పెళ్లికూతురి సెట్లు, కొత్త డిజైన్లతో రెడీమేడ్ షర్టులు, లినెన్ షర్టుల సహా వందకు పైగా డిజైన్లతో చేనేత రెడీమేడ్ వస్త్రాలను అమ్మకాలు చేస్తున్నారు. మారిన అభిరుచుల నేపథ్యంలో యువత, మహిళలు చేనేత వస్త్రాల కొనుగోలుకు పెద్ద సంఖ్యలో ముందుకొస్తున్నారు. ఆన్‌లైన్‌లోనూ చేనేత రెడీమేడ్ దుస్తులు, ఇతర వస్త్రాలను విక్రయిస్తున్నారు. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా 40 ఆప్కో షోరూమ్స్ ద్వారా 6,770 ఉత్పత్తులను అమ్మకాలకు పెట్టారు. ఈ-కామర్స్ అమ్మకాలతో నేరుగా వినియోగదారుల ఇళ్లకే వస్త్రాలను డోర్ డెలివరీ చేస్తున్నారు. ఆప్కో పేరిట సొంత వెబ్‌సైటును అందుబాటులోకి తీసుకొచ్చారు. చేనేత వస్త్రాలపై సోషల్ మీడియాలోనూ విస్తృత ప్రచారం చేస్తూ, నేటి తరానికి నేతన్నలను కూటమి ప్రభుత్వం మరింత దగ్గర చేస్తోంది.

## మెగా క్లస్టర్లు, టెక్స్‌టైల్స్ పార్కుల ఏర్పాటు

చేనేతలకు 365 రోజులూ పని కల్పించేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నూతన టెక్స్‌టైల్స్ పాలసీని అమలు చేసి, ఈ పాలసీ ద్వారా చేనేత రంగంలో రూ.10,000 కోట్ల పెట్టుబడులు సేకరించాలని, 1.51లక్షల మందికి ఉపాధి కల్పించాలని లక్ష్యంగా పెట్టుకుంది. దీనిలో భాగంగా జాతీయ హ్యాండ్‌లూమ్ అభివృద్ధి ప్రోగ్రామ్ కింద 10 క్లస్టర్లు ఏర్పాటుచేసింది. రాయదుర్గం,హిందూపురం,బ్రాండెక్స్ టెక్స్‌టైల్స్ పార్కుల అభివృద్ధితో పాటు ఎమ్మిగనూరు టెక్స్‌టైల్స్ పార్క్ కూడా నిర్మించనుంది. శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరంలో మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్‌ను రూ.38.31కోట్లతో ఏర్పాటు చేయనుంది. మంగళగిరిలో చేనేత పార్క్ ఏర్పాటు చేయనుంది. పిఠాపురంలో మౌలిక సదుపాయాల కల్పనకు స్పెషల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించనున్నారు. 9,120 మంది చేనేత కార్మికులకు ప్రయోజనం చేకూర్చేలా రూ.15.11 కోట్లతో ఈ ప్రాజెక్టును నిర్మించనున్నారు. రూ.172 కోట్లతో విశాఖపట్నంలోని మధురవాడలో యూనిటీ మాల్‌ను నిర్మిస్తున్నారు. అమరావతిలో శాఖమూరులో చేనేత, హస్తకళల మ్యూజియం నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నారు.

## చేనేత వస్త్రాల విక్రయాలకు ఒప్పందాలు

చేనేత ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించడానికి కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. ఒకవైపు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఎగ్జిబిషన్లు నిర్వహిస్తూనే, మరింత మార్కెటింగ్ సౌకర్యాలు పెంచే ప్రణాళికల్లో భాగంగా పలుఒప్పందాలు చేసుకుంది. టాటా తనేరియా, ఆదిత్య బిర్లా గ్రూప్, తమిళనాడుకు చెందిన కో-ఆప్టెక్స్, ఏపీ హస్తకళల కార్పొరేషన్ తోనూ ఆప్కో ఒప్పందం చేసుకుంది. చేనేత వస్త్రాల అమ్మకాలు పెంచడానికి ఈ ఒప్పందాలు ఎంతగానో ఉపకరించనున్నాయి.

## చేనేతకు లోకేష్ దంపతుల ప్రమోషన్

ఏపీ చేనేతకు... ప్రత్యేకించి మంగళగిరి చేనేత వస్త్రాలకు మంత్రి నారా లోకేష్ దంపతులే బ్రాండ్ అంబాసిడర్లుగా మారారు.లోకేష్, బ్రాహ్మణిలు ఏ శుభ కార్యానికి వెళ్లినా చేనేత వస్త్రాలనే బహుకరిస్తున్నారు. ఇక బ్రాహ్మణి వివిధ సందర్భాల్లో మంగళగిరి చేనేత వస్త్రాలు ధరిస్తూ ప్రమోట్ చేస్తున్నారు. మరోవైపు లోకేష్ తాను కలిసే ప్రతినిధులకు... తనను కలవడానికి వచ్చే వారికి చేనేత శాలువాతో సత్కరిస్తున్నారు, చేనేత వస్త్రాలను బహుకరిస్తున్నారు. ప్రధానిని కలిసిన ప్రతిసందర్భంలోనూ లోకేష్ చేనేతవస్త్రాలతో ఆయన్ను సత్కరిస్తారు. తాజాగా ప్రజాప్రతినిధుల కుటుంబాలకు ఇచ్చిన ఆత్మీయ విందులోనూ మంగళగిరి చీరలను నారా లోకేష్ బహుకరించారు. ఇక మంగళగిరిలో నేతన్నల కోసం వీవర్ శాల ఏర్పాటు చేశారు. ఈ వీవర్ శాలలో చేనేత రంగానికి నైపుణ్యాభివృద్ధి, అత్యాధునిక టూల్స్ అందుబాటులోకి తెచ్చి చేనేత రంగాన్ని ప్రోత్సహిస్తున్నారు.

## ఆప్కోలో అమ్మకాలు పెరుగుదల

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆప్కో షోరూమ్‌ల బలోపేతానికి చర్యలు తీసుకుంది. అమ్మకాలు పెంచేలా సిబ్బందికి ప్రత్యేక శిక్షణ అందజేసింది. సాంకేతికతకు పెద్దపీట వేస్తూ, డిజిటల్ అమ్మకాలు ప్రారంభించింది. చీరలు,దుప్పట్లు, తువ్వాళ్లతోపాటు చేనేత రెడీమేడ్ దుస్తులను అమ్మకానికి పెట్టారు. పుట్టపర్తి, ఎమ్మిగనూరు, ప్రొద్దుటూరు, టెక్కలి, అనకాపల్లిలో అయిదు కొత్త షోరూమ్‌లు ప్రారంభించింది. ప్రభుత్వం తీసుకున్న చర్యలతో రెండేళ్లలో రూ.188.01 కోట్ల మేర అమ్మకాలు జరగడం విశేషం. చేనేత సహకార సంఘాలకు విడతల వారీగా ఆప్కో బకాయిలు చెల్లిస్తూ వస్తోంది.

## చేనేత రంగానికి అవార్డుల వెల్లువ

రాష్ట్రంలో చేనేత రంగ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం రెండేళ్లలో తీసుకున్న చర్యలు సత్ఫలితాలు వస్తున్నాయి. వన్ డిస్ట్రిక్ట్ - వన్ ప్రొడక్ట్ కింద పలు చేనేత వస్త్రాల గుర్తింపునకు ప్రత్యేకచర్యలు చేపట్టింది. 2024 సంవత్సరానికి గాను పది ఓడీ-ఓపీ అవార్డులను ఏపీ సొంతం చేసుకుంది. వాటిలో ఏడు అవార్డులు చేనేత, జౌళి శాఖకు చెందినవే కావడం విశేషం. ఆప్కోలో చేపట్టిన డిజిటలైజేషన్‌కు గానూ స్కోచ్ అవార్డు సొంతమైంది.

### నేతన్నలకు 365 రోజులూ ఉపాధే లక్ష్యం: మంత్రి సవిత

గడచిన రెండేళ్ల కాలంలో చేనేత రంగానికి ఊపిరిపోసేలా కూటమి ప్రభుత్వం చాలా చర్యలు తీసుకుందని చేనేత,జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత అన్నారు. చేనేత కార్మికులకు గౌరవ జీవనం కల్పించడమే కూటమి ప్రభుత్వలక్ష్యమని చెప్పారు. సగం ధరకే చీర, దోవతి నినాదంతో ఆనాడు అన్న ఎన్టీఆర్ చేనేత రంగానికి ఊపిరిపోస్తే, నేడు సీఎం చంద్రబాబు నేతన్నలకు ఆర్థిక మేలు కలుగజేసేలా పథకాలు రూపొందిస్తున్నారని మంత్రి చెప్పారు. ముఖ్యంగా చేనేత వస్త్రాలకు మార్కెటింగ్ కల్పించేలా కూటమి ప్రభుత్వం ఒప్పందాలు చేసుకుందని మంత్రి వివరించారు. గత నెల ఒకటో తేదీ నుంచి అమలు చేస్తున్న ఉచిత విద్యుత్‌పథకంతో నేతన్న కుటుంబాలకు మరింత లబ్ధి కలుగుతోందని చెప్పారు. చేనేతలకు 365రోజులపాటు పని కల్పించడమే సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రధాన లక్ష్యమన్నారు. ఆ లక్ష్యం దిశగా వడివడిగా అడుగులు వేస్తూ ముందుకు సాగుతున్నామని మంత్రి సవిత చెప్పారు.





# వీధి కుక్కలకు స్టెరిలైజేషన్ పూర్తిచేయాలి

- పట్టణాలకు దూరంగా ఫుడ్ షెల్టర్లు
- బాలుడికి మెరుగైన వైద్యం అందించాలి
- పురపాలక మంత్రి పొంగూరు నారాయణ

అమరావతి(చైతన్యరథం): మున్సిపల్ కమిషనర్లు, ఉన్నతాధికారులతో శనివారం మంత్రి పొంగూరు నారాయణ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి సురేష్‌కుమార్, డైరెక్టర్ సంపత్‌కుమార్ పాల్గొన్నారు. విశాఖలో బాలుడిని కుక్క కరిచిన ఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వీధి కుక్కలకు స్టెరిలైజేషన్‌ను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.



బాలుడికి మెరుగైన వైద్యం అందేలా చూడాలని విశాఖ మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు. సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం పట్టణాలకు దూరంగా కుక్కలకు ఫుడ్ షెల్టర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. రాష్ట్రంలో ఉన్న 3.2 లక్షల వీధి కుక్కలకు గాను ఇప్పటివరకూ 1.8 లక్షల కుక్కలకు శస్త్రచికిత్సలు పూర్తయినట్లు  అధికారులు వివరించారు. స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వేగంగా శస్త్రచికిత్సలు చేయించాలని మంత్రి సూచించారు.

# ఎందుకంత దిగజారుడు!

- పెట్రో ధరలపై వైసీపీది అబద్ధపు ప్రచారం
- పెట్రో ధరల పెంపుపై విపక్షాల విమర్శలు అర్థరహితం
- సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆగ్రహం

సర్వేపల్లి (చైతన్య రథం): దేశంలో ఏపీలోనే పెట్రో ధరలు ఎక్కువని వైసీపీ నేతలు మాట్లాడటం విడ్డూరంగా ఉందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి వ్యాఖ్యానించారు. 2024 జూన్‌లో ముఖ్యమంత్రిగా జగన్‌రెడ్డి దిగిపోయిన రోజుకు ఉన్న ధరలే ఈ రోజుకీ కొనసాగుతున్న విషయం వైసీపీ గ్రహించాలని హితవు పలికారు. వైసీపీ అబద్ధపు ప్రచారాలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. "కూటమి ప్రభుత్వం వచ్చి రెండేళ్లయినా ఆ ధరల్లో ఒక్క పైసా కూడా పెంచలేదు.



ప్రస్తుత సంక్షోభ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా పెట్రోలుపై 3.2 శాతం, డీజిల్‌పై 3.4 శాతం ధరలు పెంచింది. ఆ మూడుశాతం తప్ప రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి అదనపు భారం వేయలేదు. దేశంలోనే ఏపీలో ఎక్కువ ధర ఉండేందుకు కారణం జగన్మోహన్‌రెడ్డే. కేంద్ర ప్రభుత్వాన్ని కూడా కొన్ని ప్రతిపక్ష పార్టీలు విమర్శించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను. పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా ఆయిల్ సంక్షోభం నెలకొంది. ఒక్కో దేశం గరిష్టంగా పెట్రోలుపై 89.7 శాతం, డీజిల్ పై 112 శాతం వరకు ధరలు పెంచాయి. మలేషియాలో పెట్రోలుపై 56.3 శాతం, డీజిల్‌పై 71.2 శాతం, యూఏఈలో 52.4 శాతం, 86.1 శాతం, అమెరికాలో 44.5 శాతం, 48.1 శాతం, న్యూజిలాండ్‌లో 30.7 శాతం, 88.6 శాతం ధరలు పెంచారు. అన్ని దేశాలకంటే తక్కువగా భారత్‌లోని నరేంద్ర మోడీ ప్రభుత్వం పెట్రోలుపై కేవలం 3.2, డీజిల్‌పై 3.4 శాతం మాత్రమే ధరలు పెంచింది. ఇలాంటి వాస్తవాలను కూడా ప్రతిపక్ష పార్టీలు గుర్తించలేని దుస్థితిలో ఉండటం దురదృష్టకరం" అని దుయ్యబట్టారు.

# ఆక్వా ప్రయోజనాల పరిరక్షణకు చర్యలు

- రైతులకు ప్రయోజనం చేకూరేలా నిర్ణయం తీసుకోవాలి
- ఇటీవల కేంద్రానికి లేఖ రాసిన సీఎం చంద్రబాబు
- మరోమారు కేంద్రానికి విజ్ఞప్తి చేయనున్న రాష్ట్ర ప్రభుత్వం



అమరావతి (చైతన్య రథం): రొయ్యల ఫీడ్ ధరల పెంపు అంశంపై ఆక్వా రైతులు, ఫీడ్ తయారీ సంస్థలు, శాస్త్రవేత్తలు, ప్రాసెసర్లు, సంబంధిత శాఖల అధికారులతో రాష్ట్ర ప్రభుత్వం కీలక సమావేశం నిర్వహించింది. ఏపీ సచివాలయంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఫీడ్ ధరల పెంపు ప్రభావం, ఆక్వా రంగ భవిష్యత్తు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు తదితర అంశాలపై విస్తృత చర్చ జరిగింది. సమావేశంలో ఫిషరీస్ కమిషనర్ రాష్ట్రంలో ప్రస్తుత ఆక్వా పరిస్థితులు, రొయ్యల ఉత్పత్తి, ఫీడ్ వినియోగం, ప్రస్తుతం ఉన్న ఫీడ్ ధరలు మరియు ఫీడ్ తయారీ సంస్థలు కోరుతున్న ధరల పెంపుపై వివరించారు. మరోవైపు రైతులు ప్రస్తుత ధరలను కొనసాగించాలని కోరిన విషయాన్ని కూడా ప్రస్తావించారు. సిబా శాస్త్రవేత్తలు జనవరి 2026 నుంచి మే 2026 వరకు సోయా, ఫిష్ మీల్, ఫిష్ ఆయిల్ వంటి ప్రధాన ముడి పదార్థాల ధరలు భారీగా పెరిగినట్లు వివరించారు. ఈ పెరుగుదల కారణంగా ఫీడ్ తయారీ వ్యయం సగటున కిలోకు రూ.31.03 వరకు పెరిగిందని వెల్లడించారు. ప్రత్యామ్నాయ ముడి పదార్థాల వినియోగంపై కూడా సూచనలు చేశారు. ఫీడ్ తయారీ సంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ జనవరి నుంచి ఏప్రిల్ 2026 మధ్య ప్రధాన ముడి పదార్థాల ధరలు 20 శాతం కంటే ఎక్కువగా పెరిగాయని తెలిపారు. ఫిష్ మీల్ ధర మెట్రిక్ టన్నుకు రూ.1.55 లక్షల నుంచి రూ.2.40 లక్షలకు, ఫిష్ ఆయిల్ రూ.2.80 లక్షల నుంచి రూ.4.40 లక్షలకు, సోయా లెసితిన్ రూ.68 వేల నుంచి రూ.1.10 లక్షలకు, కోలెస్టరాల్ రూ.2.71 లక్షల నుంచి రూ.6.50 లక్షలకు పెరిగినట్లు వివరించారు. ఈ ముడి పదార్థాల ధరల పెరుగుదల వల్ల ఒక్కో మెట్రిక్ టన్ను ఫీడ్ తయారీలో సుమారు రూ.25,115 అదనపు భారం పడుతోందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో రొయ్యల ఫీడ్ ధరలను కిలోకు రూ.25 నుంచి రూ.31 వరకు పెంచాల్సిన అవసరం ఉందని తెలిపారు. లేకపోతే ఫీడ్ తయారీ యూనిట్లు కొనసాగించడం కష్టమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

అయితే రైతు ప్రతినిధులు దీనిపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ముడి పదార్థాల ధరలు పెరిగినప్పుడు మాత్రమే ఫీడ్ ధరలు పెంచుతున్న కంపెనీలు, ధరలు తగ్గినప్పుడు మాత్రం రైతులకు లాభం చేకూర్చడం లేదని విమర్శించారు. ఫీడ్ తయారీ సంస్థలు, ప్రాసెసర్లు, ఎగుమతిదారులు ఒకే వ్యాపార వర్గంగా వ్యవహరిస్తూ రైతులపై అదనపు భారం మోపుతున్నారని ఆరోపించారు. రైతులు వేసవి పంట పూర్తయ్యే వరకు కనీసం రెండు నెలలపాటు ప్రస్తుత ఫీడ్ ధరలను కొనసాగించాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే ఏపీఎస్ఏడీఏ లైసెన్స్ కలిగిన అన్ని ఆక్వా ఫారాలకు యూనిట్‌కు రూ.1.50 చొప్పున రాయితీ విద్యుత్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దీని ద్వారా సుమారు 12,500 ఆక్వా కనెక్షన్లకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఫిష్ మీల్ ఎగుమతులపై కేంద్రం ఇస్తున్న ప్రోత్సాహకాలు, సోయా దిగుమతులపై నిషేధం వంటి అంశాలను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. ఈ మేరకు కొద్దిరోజుల క్రితం ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్రానికి లేఖ రాశారు. రైతుల ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకుని మరోసారి కేంద్రాన్ని విజ్ఞప్తి చేయనున్నారు. అలాగే కోళ్ల ఫీడ్ ధరల విధానాన్ని అనుసరించి ప్రతి నెలా ముడి పదార్థాల ధరల ఆధారంగా రొయ్యల ఫీడ్ ధరలను నిర్ణయించే విధానాన్ని తీసుకురావాలని నిర్ణయించారు. రొయ్యల కొనుగోలు ధరలను కూడా 15 రోజుల గడువుతో నిర్ణయించే విధానాన్ని అమలు చేయాలని సమావేశంలో అభిప్రాయపడారు. రైతులు అపోహలు, తప్పుడు ప్రచారాలకు గురికాకుండా సరైన సమయంలో పంట కోత చేపట్టేందుకు ఈ నిర్ణయాలు దోహదపడతాయని అధికారులకు తెలిపారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ముఖ్యమంత్రికి నివేదించి తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి తెలిపారు. ఈ సమావేశంలో ఫిషరీస్ కమిషనర్ రామశంకర్ నాయక్, ఏపీఎస్ఏడీఏ కో-వీసీ అనం వెంకటరమణారెడ్డి, ఓఎస్‌డీ పోలినాయుడు, సీఐబీఏ చెన్నై, సీఐఎఫ్ఏ విజయవాడ శాస్త్రవేత్తలు, ఎస్ఐఎఫ్‌టి కాకినాడ ప్రిన్సిపాల్, ఫిషరీస్ యూనివర్సిటీ డీన్, ఎంపెడా ప్రతినిధులు, ఆక్వా రైతు సంఘాలు, ఆక్వా అడ్వైజరీ కమిటీ సభ్యులు, ఏపీఎస్ఏడీఏ డైరెక్టర్లు, రొయ్యల ఫీడ్ తయారీ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## సంజామల ప్రభుత్వాస్పత్రి ఆకస్మిక తనిఖీ



*స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా సంజామల ప్రభుత్వ ఆసుపత్రిని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి పరిసరాలు, వార్డులను ప్రత్యేకంగా పరిశీలించిన మంత్రి.. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రిలో రోగుల*



*వార్డులో అపరిశుభ్రంగా చెత్త పేరుకుపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన మంత్రి, స్వయంగా ఆయనే క్షేత్రంలోకి దిగి చెత్తను క్లీన్ చేశారు. అనారోగ్యం బారిన పడిన ప్రజలు ఆరోగ్యం కోసం వచ్చే ఆసుపత్రిని.. మరింత పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులకు మంత్రి జనార్దన్‌రెడ్డి సూచించారు.*

# పచ్చదనం, పరిశుభ్రత అందరి బాధ్యత



- మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి
- స్వయంగా డస్ట్ బిన్‌తో చెత్త సేకరణ

కొండపి(చైతన్యరథం): గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రతకు కూటమి ప్రభుత్వం అధికప్రాధాన్యం ఇస్తోందని సాంఘికసంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి పేర్కొన్నారు. శనివారం సింగరాయకొండ మండలం పాత సింగరా యకొండలో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఆయనపాల్గొన్నారు. స్వయంగా డస్ట్ బిన్‌తో చెత్త సేకరించి పరిసరాలు శుభ్రపరిచారు. అనంతరం నిర్వహించిన సభలో స్వచ్ఛతపై ప్రజల చేత మంత్రి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత సమాజంలోని ప్రతిఒక్కరి బాధ్యత. మన ఇల్లు, మన వీధి, మన గ్రామం, మన మండలం, మన జిల్లా, మన రాష్ట్రం అనే నినాదంతో ప్రతిఒక్కరూ పరిశుభ్రత పాటించాలని పిలుపునిచ్చారు. యుద్ధ ప్రభావం నేపథ్యంలో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు పిలుపు మేరకు ప్రజలంతా పొదుపు చర్యలు పాటించాలి. పొదుపు చర్యల్లో భాగంగానే సీఎం చంద్రబాబు మహానాడు రద్దు చేశారు. పొదుపు చర్యలు ప్రజలంతా పాటించాలని పిలుపునిచ్చారు. అనంతరం సింగరా యకొండలో వరాహ లక్ష్మీనరసింహస్వామి, వీరాంజనేయ స్వామిలను దర్శించుకున్నారు.

చైతన్యరథం

## ◆ మార్గదర్శిగా..

ప్రధాని మోదీ పిలుపు మేరకు జిల్లా పర్యటనల్లోనూ సీఎం చంద్రబాబు నాయుడు ఇంధన పొదుపు చర్యలను వీడలేదు. జెడ్ ప్లస్ -1 క్యాటగిరీ కాన్వాయ్‌ను 4 వాహనాలకే పరిమితం చేసుకున్న సీఎం .. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో పరిమిత కాన్వాయ్‌తోనే పర్యటించారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి హాజరయ్యేందుకు తామ్రపల్లికి నాలుగు వాహనాల కాన్వాయ్‌తోనే ప్రయాణించడం సీఎం చంద్రబాబు నిబద్ధతకు నిలువుటద్దమైంది. ఇప్పటికే అమరావతి సచివాలయం సహా ఇతర అధికారిక కార్యక్రమాలకు నాలుగు వాహనాల శ్రేణితోనే ప్రయాణిస్తోన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, భారత్ కోసం ప్రధాని పిలుపును అనుసరించి.. ఇంధన పొదుపు చర్యల్లో భాగం కావాలని తన ఆచరణతో చెప్పకనే చెప్పారు చంద్రబాబు











శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం అనంతరం ప్రజావేదిక సమీపంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు తిలకించించారు. ఐటీడీఏల ఆధ్వర్యంలో సవర ఆర్ట్ గ్యాలరీవద్ద గిరిజనులు ప్రత్యేకంగా తయారు చేసిన ఓవర్ కోటును ముఖ్యమంత్రి కొనుగోలు చేసి ధరించారు. సముద్ర తీరప్రాంతాల్లో పెంచే సీవీడ్ సాగుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మత్స్యకారులకు మరింత ఆదాయం వచ్చేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం శ్రీకాకుళం జిల్లాలో పోలీసులు ఏర్పాటు చేసిన వినూత్న కార్యక్రమం హెల్మెట్ బ్యాంక్‌ను చూసి సీఎం అభినందించారు. హెల్మెట్ ధరించి బుల్లెట్ వాహనాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు అధిరోహించారు.








ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సరసన్నపేటలో సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ కేంద్రాన్ని సందర్శించారు. స్వచ్ఛరథం డ్రైవర్ నవగపు ప్రసాద్‌రావు మండలంలో ఇంటింటికీ వెళ్లి వ్యర్థాల సేకరిస్తున్న విధానాన్ని సీఎంకు వివరించారు. అనంతరం సార్టింగ్ కన్వేయర్ సిస్టమ్‌వద్ద అక్కడ పనిచేస్తున్న సిబ్బందితో మాట్లాడిన ముఖ్యమంత్రి.. వ్యర్థాల వర్గీకరణ ప్రక్రియను పరిశీలించారు. గతంలో నేరుగా చేతులతోనే వ్యర్థాలను వర్గీకరించేవారమని, ఇప్పుడు యంత్రాలరాకతో వర్గీకరణ సామర్థ్యం పెరిగిందని సీఎం చంద్రబాబుకు వారు వివరించారు. ప్రాసెస్ చేసిన ప్లాస్టిక్ వ్యర్థాలనుంచి తయారైన ఉత్పత్తులను ముఖ్యమంత్రి చంద్రబాబు పరిశీలించారు.



# సౌర విద్యుదుత్పత్తికి ప్రోత్సాహం

- పెద్దఎత్తున సూర్యఘర్ కార్యక్రమం
- ఇంధన పొదుపు కీలకం
- మంత్రి గొట్టిపాటి రవికుమార్

మంగళగిరి(చైతన్యరథం): ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ఇంధన పొదుపు మీద ప్రత్యేకమైన దృష్టి సారించినట్లు మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ఖర్చులు తగ్గించుకోవాలని, పగటిపూట మన ఇంటిపైనే సౌరశక్తి ద్వారా విద్యుత్‌ను తయారుచేసుకుని వినియోగించుకోవాలని సీఎం చెప్పారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 6 లక్షల కనెక్షన్లు, ఒక్కో ఇంటిపైన 2కిలోవాట్లు ఉచితంగా పేదలకు ఇవ్వాలని చాలా పెద్దఎత్తున సూర్యఘర్ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. ప్రధాని దేశవ్యాప్తంగా కోటి కనెక్షన్లు పెడితే.. ఒక్క ఏపీలోనే 20 లక్షల కనెక్షన్లు ఇవ్వాలని టార్గెట్ పెట్టుకున్నామని చెప్పారు. ఇంధన పొదుపు అనేది చాలా ముఖ్యమైన అంశంగా ముఖ్యమంత్రి ముందుకువెళుతున్నారని పేర్కొన్నారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్ లాంటి శిలాజ ఇంధనాలను భారతదేశం నిత్యం బయటి దేశాల నుంచి దిగుమతి చేసుకోవలసిన పరిస్థితి ఉందని తెలిపారు. సౌరశక్తి, గాలి ద్వారా ఇలా ప్రత్యామ్నాయ పద్ధతుల నుంచి విద్యుత్ ఉత్పత్తి చేయాలని సీఎం చెప్పారన్నారు. ప్రతి ఇంటిపై 2 కిలోవాట్లకు రూ.60 వేలు, 3 కిలోవాట్లకు రూ.78 వేలు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోందన్నారు. అదనంగా ఇంకో రూ.20 వేలు కలిపి ఇవ్వాలని ముఖ్యమంత్రి తెలిపినట్లు చెప్పారు. ఎస్సీ, ఎస్టీలకు 2 కిలోవాట్లకు మొత్తం రూ.1.25 లక్షల సబ్సిడీని ప్రభుత్వమే ఇవ్వాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు చెప్పారు. రాబోయే రోజు ల్లో ఇంధన




పొదుపు చాలా కీలకం కానుంది. పగటి పూట లభ్యమయ్యే గాలి, వెలుతురును విద్యుత్‌గా మార్చుకుని ఇంధన పొదుపు చర్యలను ప్రభుత్వం పెద్దఎత్తున ప్రోత్సహిస్తోందని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లోనూ సోలార్ విద్యుత్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సోలార్ ద్వారా వంట చేసుకునే విధానాన్ని ప్రోత్సహిస్తున్నామని వివరించారు.

కాలుష్య నివారణ చర్యల్లో భాగంగా సంప్రదాయేతర ఇంధన వనరులకు ప్రాధాన్యం ఇస్తూ విద్యుత్ ఛార్జీలు మరింత తగ్గించే దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ఆస్పత్రులపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసి దాని ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసి.. ప్రజలపై భారం పడకుండా ఉండేలా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. విద్యుత్ ఉత్పత్తి పెంచి ప్రజలపై భారం పడకుండా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అందులో భాగంగానే తమ ప్రొటోకాల్ వాహనాలను తగ్గిస్తున్నామ న్నారు. సీఎం చంద్రబాబు సలహాలు, సూచనల మేరకు క్లీన్ ఎనర్జీ ఇచ్చే దిశగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు.

# మహిళా కూలీలు చనిపోవడం బాధాకరం

- మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం
- ప్రభుత్వం తరపున పరిహారం అందజేస్తాం
- కాకినాడ ఘటనపై డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్



అమరావతి(చైతన్యరథం): కాకినాడ రూరల్ మండల పరిధిలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో నలుగురు మహిళా ఉపాధి హామీ శ్రామికులు మృతిచెందడం బాధాకరమని అన్నారు. చీడిగ గ్రామానికి చెందిన ఆరుగురు మహిళా శ్రామికులు రోడ్డు దాటుతుండగా టిప్పర్ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగినట్టు అధికారులు చెప్పారని డిప్యూటీ సీఎం తెలిపారు. పని ప్రదేశంలో ఇలాంటి విషాదకర ఘటన జరగడం తీవ్రంగా కలచి వేసిందని



పేర్కొన్నారు. మృతిచెందిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కాకినాడ జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించినట్లు వెల్లడించారు. బాధితులు పూర్తిగా కోలుకునే వరకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని చెప్పారు. మృతిచెందిన శ్రామికుల కుటుంబాలకు కూటమి ప్రభుత్వం పెంచిన పరిహారం రూ.4 లక్షలను త్వరితగతిన అందజేస్తామని తెలిపారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.2 లక్షల సహాయంతో పాటు పీఎం సురక్ష యోజన, పీఎం జీవన్ జ్యోతి యోజన కింద లభించే బీమా మొత్తాన్ని కూడా అందిస్తామని పేర్కొన్నారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా రహదారుల పక్కన జరుగుతున్న ఉపాధి పనుల వద్ద భద్రతా చర్యలు కట్టుదిట్టం చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా జాతీయ రహదారులు, బైపాస్ రోడ్లు, ట్రాఫిక్ అధికంగా ఉండే ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి వాహనాల వేగ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

# ప్రధాని పిలుపుతోనే ఆన్‌లైన్‌లో మహానాడు

- టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహణ
- నిత్యావసరాల ధరల నియంత్రణకు కమిటీ
- అధిక రేట్లకు విక్రయిస్తే కఠిన చర్యలు
- ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర




మచిలీపట్నం(చైతన్యరథం): పొదుపు చర్యలు పాటించాలంటూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపుతో టీడీపీ మహానాడు కార్యక్రమాన్ని ఆన్‌లైన్ ద్వారా నిర్వహించాలని పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. నెల్లూరులో జరగాల్సిన మహానాడు కార్యక్రమాన్ని మంగళగిరి లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పొలిట్‌బ్యూరో సభ్యులు, తదితర ముఖ్య నాయకుల సమక్షంలో ఈ కార్యక్రమం జరుగుతుం దని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజకవర్గాలలో క్లస్టర్స్ వారీగా స్క్రీన్లు ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు. మహానాడు ఉద్దేశాలు, నిర్ణయాలను పార్టీ నాయకులు, కార్యకర్తలకు తెలియ చేస్తామన్నారు. యుద్ధ ప్రభావం వల్ల దేశవ్యాప్తంగా నెలకొన్న విపత్కర పరిస్థితుల నేపథ్యంలో పార్టీ ఈ నిర్ణయం తీసుకుందని తెలిపా రు. నిత్యావసర సరకులు అధిక రేట్లకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. దీన్ని కట్టడి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు. ఇందుకోసం సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా ఓ కమిటీని నియమించినట్లు చెప్పారు. ఈ కమిటీకి పౌరసర ఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ నేతృత్వం వహిస్తున్నారని తెలిపారు. కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయించే వారిపై కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేకమైన మానిటరింగ్ జరుగుతోందని పేర్కొన్నారు.

# ఢిల్లీ వీధుల్లో సైకిల్‌పై ఎంపీ కలిశెట్టి ప్రయాణం



విజయనగరం / ఢిల్లీ (చైతన్యరథం): దేశంలో పెరుగుతున్న ఇంధన అవసరాలను గుర్తించి ప్రధాని నరేంద్ర మోదీ ఇంధనం పొదుపు చేయాలని సూచించిన సంగతి తెలిసిందే. ప్రధాని పిలుపు వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు తమ కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్యను తగ్గించుకున్నారు. అలానే పలువురు ప్రజాప్రతినిధులు కూడా ఇంధన పొదుపు పాటిస్తున్నారు. ఈ నేపథ్యంలో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పేరు సోషల్ మీడియాలో మార్మోగుతోంది. ఇంధన పొదుపు గురించి మోదీ చెప్పక ముందే అప్పలనాయుడు గతంలోనే ఈ ఆచరణను జీవితంలో భాగం చేసుకున్నారు. దీంతో ఈయన 'సైకిల్ ఎంపీ'గా ఇప్పుడు ట్రెండింగ్‌లో నిలిచారు. పార్లమెంట్ సమావేశాలకు రోజూ సైకిల్‌పైనే వెళ్లడం ద్వారా ఆయన అప్పుడే ఒక స్పష్టమైన సందేశాన్ని దేశానికి ఇచ్చారు. అధికార హోదా ఉన్నప్పటికీ ఆడంబరాలకు దూరంగా ఉంటూ, సాధారణ ప్రజల మాదిరిగానే ప్రయాణించడం ఆయన ప్రత్యేకతగా నిలిచింది. పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలు.. మరోవైపు రోజురోజుకీ పెరుగుతున్న కాలుష్యం నేపథ్యంలో సైకిల్ ప్రయాణమే ఉత్తమ ప్రత్యామ్నాయమని ఆయన ఆచరణతో చాటిచెప్పారు. ఇటీవల సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఆయన ఫొటోలు, వీడియోలు నెటిజన్లను ఆకట్టుకుంటున్నాయి. 'ఇది పబ్లిసిటీ స్టంట్' అని విమర్శించిన వారికి కూడా ఏళ్లుగా నిరంతరం అదే జీవనశైలిని కొనసాగిస్తూ తన పనితీరుతోనే సమాధానం ఇచ్చారంటూ పలువురు ప్రశంసిస్తున్నారు. 'మోదీ చెప్పకముందే ఇంధన పొదుపు మొదలుపెట్టిన నేత', 'నిజమైన ప్రజాప్రతినిధి', 'పర్యావరణ హిత రాజకీయ నాయకుడు' అంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. విజయనగరం నేల నుంచే నిరాడంబరతకు చిరునామాగా నిలిచిన కలిశెట్టి అప్పలనాయుడు, ఇప్పుడు దేశ రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నారు. అధికారంలో ఉన్నా అహంకారం లేకుండా, ప్రజలకు ఆదర్శంగా నిలవొచ్చని ఆయన నిరూపిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణపై చర్చలు మాటల్లోనే పరిమితమవుతున్న ఈ కాలంలో, సైకిల్‌పై పార్లమెంట్‌కు వెళ్లే ఎంపీగా కలిశెట్టి అప్పలనాయుడు చూపిస్తున్న నిబద్ధతకు సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. 'విజయనగరం గడ్డ అంటే ఇదే.. నిరాడంబరతకు అడ్డా' అంటూ తెలుగు రాష్ట్రాల నెటిజన్లు గర్వంగా పోస్టులు పెడుతున్నారు. 'ఇంధనం ఆదా చేయాలి అంటే ముందుగా అలవాట్లు మారాలి.. నాయకులే ఆదర్శంగా నిలవాలి' అనే సందేశాన్ని తన జీవనశైలితోనే చెబుతున్న కలిశెట్టి అప్పలనాయుడు బాటలో ఇతర ప్రజాప్రతినిధులు నడవాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# నా దేశం.. నా బాధ్యతగా పొదుపు పాటిద్దాం

- ఇందన వినియోగాన్ని తగ్గిద్దాం
- జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు
- పాలకొల్లులో రూ.5.15కోట్లతో పనులకు శ్రీకారం



పాలకొల్లు(చైతన్యరథం): ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన "నా దేశం- నా బాధ్యత" పిలుపు మేరకు తాను కూడా పొదుపును పాటిస్తున్నట్లు జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ప్రజలందరూ ఇంధన వినియోగాన్ని తగ్గించి వారానికి ఒకరోజు "నో వెహికల్ దే" పాటించాలని పిలుపునిచ్చారు. పాలకొల్లు మండలంలోని పలు గ్రామాల్లో శనివారం రూ.5.15 కోట్లతో పలు అభివృద్ధి పనులకు కూటమి నాయకులతో కలిసి శంకుస్థాపనలు చేశారు. మండు టెండను లెక్క చేయకుండా పలు గ్రామాల్లో ఎలక్ట్రికల్ మోటార్‌సై కిల్‌పై పర్యటిస్తూ ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. పాలకొల్లు మండలంలోని లంకలకోడేరు, దగ్గులూరు, బల్లిపాడు, జొన్నల గరువు, శివదేవుని చిక్కాల, తిల్లపూడి గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. లంకలకోడేరు గ్రామంలో రూ.40 లక్షలతో చినపేట చర్చ్ వద్ద రాపాక ఛానల్‌పై సీసీ వాల్, పైప్ కల్వర్ట్ నిర్మాణ పనులకు శంకుస్థాపన, దగ్గులూరు గ్రామ పరిధిలో రూ. 7.60 లక్షలతో యర్రల కోడు మైనర్ డ్రైన్‌పై గ్రావెల్ రోడ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన, బల్లిపాడు గ్రామ పరిధి గోపాల స్వామి గుడి సమీపంలో రూ.1.60 కోట్లతో రాపాక ఛానల్‌పై సీసీ వాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన, శివదేవునిచిక్కాల గ్రామ పరిధిలో జెడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలో రూ.49.50 లక్షలతో రాపాక ఛానల్‌పై సీసీ వాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. రూ.91.80 లక్షలతో తాగునీటి పనులు, మైక్రో ఫిల్టర్ ప్రారం భోత్సవం, రూ.22.50 లక్షలతో విలేజ్ హెల్త్ క్లినిక్ ప్రారంభోత్సవం, రూ.44.90 లక్షలతో జొన్నల గరువు బస్ స్టాండ్ సమీపంలో నెంబర్ 2 బ్రాంచ్ ఛానల్‌పై గ్రావెల్ రోడ్ నిర్మాణ పనులకు శంఖుస్థాపన, రూ.55 లక్షలతో జొన్నలగరువు వద్ద తాగునీటి పనులు ప్రారంభోత్సవం, తిళ్ళపూడి రోడ్ ఇటుకల బట్టి సమీపంలో రూ.50 లక్షలతో వంతెన, గ్రావెల్ రోడ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన, తిళ్ళపూడి గ్రామ పరిధిలోని భగ్గేశ్వరం మురుగు కాలువపై రూ.43.50 లక్షలతో గ్రావెల్ రోడ్ పనులకు శంకుస్థాపనలు చేశారు. తిల్లపూడి గ్రామంలో జరిగిన బహిరంగ సభలో మాట్లాడారు. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో రైతాం గం కంట కన్నీరు రాగా..నేడు కూటమి ప్రభుత్వంలో వారి కుటుం బాల్లో ఆనందం కనిపిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, ఏఎంసీ చైర్మన్ కోడి విజయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛత పాటిద్దాం.. ఇందన పొదుపు చేద్దాం

- ప్రతి మూడో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర
- మచిలీపట్నంలో మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం(చైతన్యరథం): మన పరిసరాలను కాపా డుకునే బాధ్యత మనందరిదని గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఇంధన పొదుపు కార్యక్రమంలో భాగంగా జగన్నాథపురంలోని తన నివాసం నుంచి ఎలక్ట్రిక్ సైకిల్‌పై పలు ప్రాంతాల్లో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావుతో కలిసి పర్యటించారు. రైతుబజార్ వద్ద వినియోగదారులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకు న్నారు. మార్కెట్‌లో వ్యాపారుల నుంచి కూరగాయలు కొనుగోలు చేశారు. వారితో కాసేపు సరదాగా మాట్లాడారు. మార్కెట్లో ప్లాస్టిక్ బ్యాగుల నిషేధానికి సహకరించాలని సూచించారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద ప్రయాణికులతో మాట్లాడారు. ప్రతిఒక్కరూ ఇంధన పొదుపులో భాగంగా ప్రజా రవాణా లేదా ఎలక్ట్రిక్ వాహనాలు, పబ్లిక్ రవాణా వినియోగించాలని సూచించారు. రైతు బజార్ వద్ద చెత్తను శుభ్రం చేశారు. మచిలీపట్నంలోని రైతుబజార్ వద్ద స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావుతో కలిసి పాల్గొన్నారు. తమ పరిసరాలను తామే శుభ్రం చేసుకుంటామని ప్రమాణం చేయించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ పరిశుభ్రమైన రాష్ట్రాన్ని సాధించే లక్ష్యంతో ప్రతినెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమానికి ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారు. మనం కూడా మన పరిసరాల పరిశుభ్రత బాధ్యత తీసుకోవాలి. ఇప్పటికే రాష్ట్రంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాం. జూన్‌లో వర్షాలు పడే నాటికి ప్రతిఒక్కరూ ఒక మొక్క నాటి వాటిని సంరక్షణ బాధ్యతను కూడా తీసుకోవాలని సూచిం చారు. అవసరమైతే స్వచ్ఛాంధ్ర కమిటీలు ఏర్పాటు చేసి మొక్కల సంరక్షణ బాధ్యతలు చూసుకోవాలని సూచించారు. వచ్చే ఆది వారం మంగినపూడి బీచ్‌కు వెళ్లి అక్కడి చెత్త మొత్తాన్ని శుభ్రం చేయబోతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు గొర్రెపాటి గోపీచంద్, విద్యాసాగర్, కన్వీనర్ సుశీల్, మరకాని పరబ్రహ్మం, అల్లూరి సోమశేఖర్, మార్కెటింగ్ యార్డ్ చైర్మన్ కుంచే నాని, బాబా ప్రసాద్, బోస్, స్వామి, మురళీకృష్ణ, రత్నాకర్ పాల్గొన్నారు.




# 26న కేరళను తాకనున్న రుతుపవనాలు

## వాతావరణ శాఖ కీలక ప్రకటన



విశాఖపట్నం(చైతన్యరథం): దేశవ్యాప్తంగా రైతులు ఎదురు చూస్తున్న నైరుతి రుతుపవనాల రాకపై వాతావరణ శాఖ కీలక ప్రకటన చేసింది. సాధారణంగా మే 26 ప్రాంతంలో కేరళను తాకే నైరుతి రుతుపవనాలు ఈసారి నాలుగురోజుల ముందుగానో లేదా నాలుగురోజుల ఆలస్యంగానో కేరళలో ప్రవేశించే అవకాశ ముం దని ఐఎండీ అధికారులు తెలిపారు. ఇప్పటికే రుతుపవనాలు అండమాన్ ప్రాంతంలోకి ప్రవేశించగా, క్రమంగా మరిన్ని ప్రాంతాలకు విస్తరించే పరిస్థితులు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. వచ్చే మూడు నుంచి నాలుగు రోజుల్లో ఆగ్నేయ అరేబియా సముద్రం, నైరుతి-ఆగ్నేయ బంగాళాఖాతం, అండమాన్ దీవులు, అండమాన్ సముద్ర ప్రాంతాల్లో నైరుతి రుతుపవనాలు మరింత బలపడే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది. అలాగే తూర్పు మధ్య బంగాళాఖాతంలోని కొన్ని ప్రాంతాల్లోకి కూడా రుతు పవనాలు విస్తరించే సూచనలు ఉన్నట్లు తెలిపింది. ఇక మరోవైపు పశ్చిమ, మధ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం ప్రభావం కొనసాగుతూనే ఉంది. దీనికి తోడు ఉత్తర తమిళనాడు ప్రాంతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడటం వల్ల అక్కడక్కడా వర్షా లు కురిసే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ వాతావరణ పరిస్థితుల ప్రభావంతో తమిళనాడులో పలుచోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉండగా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో మాత్రం ఎక్కువ ప్రాంతాల్లో పొడి వాతావరణమే కొన సాగనుందని వాతావరణ శాఖ తెలిపింది. రైతులు మాత్రం నైరుతి రుతుపవనాల రాకపై ఆశగా ఎదురు చూస్తున్నారు.

చైతన్యరథం

# ప్లాస్టిక్ భూతాన్ని తరిమి...
# భావితరాలకు ఆరోగ్యాన్నిద్దాం!

## రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



పెనుకొండ/ శ్రీసత్యసాయి (చైతన్య రథం): మన ఇంటినుంచి, మన గ్రామంనుంచి ప్లాస్టిక్ భూతాన్ని తరిమేద్దామని, కాలుష్యాన్ని నివారించి, భావితరాలకు ఆస్తులే కాదు ఆరోగ్యాన్ని కూడా ఇద్దామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, ప్లాస్టిక్ కవర్లను, వస్తువుల వాడాకానికి దూరంగా ఉండాలని అన్నారు. చెత్త మీద పన్ను రద్దు చేసి, అదే చెత్తతో సంపద సృష్టిస్తున్న ఘనత సీఎం చంద్రబాబునాయుడిదన్నారు. పెనుకొండ పట్టణంలోని గాంధీ సర్కిల్ లో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. స్వచ్ఛంధ్ర -స్వర్ణాంధ్ర కోసం సీఎం చంద్రబాబునాయుడు రేయింబవళ్లు కృషి చేస్తున్నారన్నారు. ప్రజల ఆరోగ్యానికి, గ్రామాల్లో పరిశుభ్రతకు సీఎం చంద్రబాబు ప్రాధాన్యమిస్తూ స్వచ్ఛంధ్ర -స్వర్ణాంధ్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ప్లాస్టిక్ వినియోగంతో అటు ఆరోగ్యం, ఇటు పర్యావరణం తీవ్రంగా దెబ్బతింటోందన్నారు. ఇళ్లోకి, గ్రామాల్లోకి ప్లాస్టిక్ కవర్లు, ఇతర వస్తువులు రాకుండా చేయడంలో మహిళలే కీలకమన్నారు. మన భావితరాలకు ఆస్తులతో ఆరోగ్యాన్ని కూడా ఇవ్వాలని పిలుపునిచ్చారు. గత పాలకులు చెత్త మీద పన్ను వేసి, ప్రజలపై ఆర్థిక భారంగా మోపారన్నారు. సీఎం చంద్రబాబునాయుడు అధికారంలోకి రాగానే చెత్త పన్ను రద్దు చేసి, అదే చెత్త ద్వారా సంపద సృష్టిస్తున్నారన్నారు. చెత్తతో వర్మీ కంపోస్ట్, ఇతర సేంద్రీయ ఎరువులను తయారు చేస్తున్నారన్నారు. స్వచ్ఛ రథాల ద్వారా ప్లాస్టిక్, ఇనుము, ఇతర వ్యర్థాలు సేకరించి, ప్రజలకు నిత్యావసర సరుకులు అందజేస్తున్నారన్నారని మంత్రి సవిత తెలిపారు. ప్రజలంతా ప్లాస్టిక్ నివారణకు సహకరించాలని పిలుపునిచ్చారు. ప్రతి షాపు వద్ద మున్సిపల్ అధికారులు ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను తెలిపే ప్లేక్సీలు, స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని మంత్రి సవిత ఆదేశించారు.

### ప్రకృతి వ్యవసాయంతో మేలు

క్యాన్సర్, ఇతర దీర్ఘకాలిక రోగాలతో మనుషుల ప్రాణాల పోవడంలో ప్లాస్టిక్ తో పాటు అతిగా ఎరువుల వాడకం కూడా కారణమని మంత్రి సవిత తెలిపారు. ప్రకృతి వ్యవసాయంతో పర్యావరణ పరిరక్షణతో పాటు ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు కలుగుతుందన్నారు. ప్రభుత్వం సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సాహిస్తోందన్నారు. సేంద్రీయ ఉత్పత్తులకు మార్కెట్ మంచి డిమాండ్ ఉందని, తద్వారా అధిక లాభాలు ఆర్జించాలని ఆకాంక్షించారు. జంక్ ఫుడ్ కారణంగా క్యాన్సర్ వ్యాపిస్తోందని, తల్లిదండ్రులు తమ బిడ్డలను ఇటువంటి ఆహార పదార్థాలకు దూరంగా ఉంచాలని మంత్రి సవిత సూచించారు. చెత్తను ఎక్కడి పడితే అక్కడ పడేయకుండా, ఇంటికి వచ్చే పారిశుధ్య కార్మికులకు తడి, పొడి చెత్త వేర్వేరుగా ఇవ్వాలన్నారు. స్వచ్ఛ పెనుకొండ బాధ్యత పట్టణ ప్రజలందరిదీనని స్పష్టంచేశారు. అనంతరం గాంధీ సర్కిల్ లో మానవ హారంగా ఏర్పడి, ప్రతిజ్ఞ నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ వాడకానికి దూరంగా ఉంటామని మానవ హారంలో పాల్గొన్నవారితో మంత్రి సవిత ప్రతిజ్ఞ చేయించారు.

### నడిచి... రోడ్డుపై చెత్త ఏరివేసి...

నా దేశం -నా బాధ్యత కింద ప్రతి ఒక్కరూ పొదుపు మంత్రం పాటించాలని పిలుపునిచ్చిన సీఎం చంద్రబాబు మాటలను మంత్రి తూచ తప్పకుండా పాటించారు. పెనుకొండ పట్టణంలోని గాంధీ సర్కిల్ లో నిర్వహించిన స్వచ్ఛంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో మంత్రి సవిత తన క్యాంపు కార్యాలయం నుంచి నడుచుకుంటూ వెళ్లి పాల్గొన్నారు. ఎటువంటి వాహన శ్రేణిని వినియోగించకుండా, మంత్రి సవిత ఈ కార్యక్రమంలో పాల్గోనడంపై సర్వత్రా అభినందనలు వ్యక్తమయ్యాయి. అంతకుముందు పట్టణంలోని షాపులు, తోపుడు బండ్ల వద్దకు గుడ్డతో తయారు చేసిన క్యారీ బ్యాగ్ లను అందజేశారు. ప్లాస్టిక్ కవర్లకు బదులు కాటన్ వస్త్రాలతో తయారు చేసిన క్యారీ బ్యాగులివ్వాలని సూచించారు. అనంతరం షాపుల ఎదుట పడివున్న చెత్తను మంత్రి సవిత స్వయంగా తీసి, డస్ట్ బిన్ లో వేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కారు వదిలి ఆర్టీసీ బస్సు ఎక్కిన వీరంకి

## ఇంధన పొదుపు పాటిస్తున్న టీడీపీ నేతలు




కృష్ణా జిల్లా (చైతన్యరథం): ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుకు అనూహ్యస్పందన లభిస్తుంది. ఫలితంగా తెలుగుదేశం పార్టీ నేతలు తమ వాహనాలను వదిలి ఆర్టీసీ బస్సులు ఎక్కుతున్నారు. అందులో భాగంగానే తెలుగుదేశం పార్టీ కృష్ణాజిల్లా అధ్యక్షులు రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి తన ప్రయాణాన్ని ఆర్టీసీ బస్సులో సాగించారు. కృష్ణాజిల్లా మచిలీపట్నంలో జరిగే కార్యక్రమాలకు హాజరయ్యేందుకు ఆయన విజయవాడ నుంచి మచిలీపట్నంకు ఆర్టీసీ బస్సులో వచ్చారు. అక్కడి నుండి కాలినడకన తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి చేరుకుని అక్కడ మీడియా సమావేశంలో పాల్గొనారు. ఆ తర్వాత జిల్లా మంత్రి కొల్లు రవీంద్రని ఆర్ అండ్ బి అతిథి గృహంలో కలసి వివిధ సమస్యలపై చర్చించడం జరిగింది. తదనంతరం మచిలీపట్నంలో నిర్మాణంలో ఉన్న కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయ పనులను పరిశీలించారు. తిరిగి ఆర్టీసీ బస్సులోని ఇంటికి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షోభ పరిస్థితుల్లో దేశ ప్రధాని నరేంద్ర మోడీ పిలుపును అందరూ గౌరవించాలని కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ యువ నేత నారా లోకేష్ ఇప్పటికే రాష్ట్ర ప్రజలకు ఈ సంకేతాలు ఇచ్చారన్నారు. అందులో భాగంగానే తాను ఈరోజు బస్సు ప్రయాణాన్ని చేపట్టానన్నారు.

# కర్నూలులో వైసీపీ నేతల భూ కబ్జాలు ఎరుకే

- మీసాలు తిప్పే వారికి బుద్ధి చెప్పక తప్పదు
- వారు అదుపులో ఉండాలని హెచ్చరిస్తున్నాం
- కులమతాలకు అతీతంగా సేవా కార్యక్రమాలు
- బురదజల్లాలనుకుంటే చూస్తూ ఊరుకోం
- మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్



కర్నూలు(చైతన్యరథం): మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. తన పుట్టినరోజు సందర్భంగా కర్నూలులో 60 మంది జంటలకు సామూహిక వివాహాలు జరిపించారు. నూతన వధూవరులను ఆశీర్వదించి నగదు చెక్కులు పంపిణీ చేశారు. సామూహిక వివాహ కార్యక్రమం అనంతరం మాజీ ఎంపీ వెంకటేశ్ మీడి యాతో మాట్లాడారు. ఈ సందర్భంగా వైసీపీ యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డిపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాయలసీమలో మీసాలు తిప్పిన పెద్దపెద్ద వాళ్లు చివరికి వాటిని దించి మా దగ్గరికి వచ్చారు. మీసాలు తిప్పే వారికి బుద్ధి చెప్పక తప్పదు. మీరు 100 మందిని తెస్తే మేము 1000 మంది తెస్తాం. సేవా కార్యక్రమాలకు కోట్లు ఖర్చు చేస్తున్నాం, మా కోసం ఖర్చు పెట్టలేమా? మీరు రెచ్చిపోతే మా కార్యకర్తలు సరైన రీతిలో బుద్ధి చెబుతారు. మీరు అదుపులో ఉండాలని హెచ్చరిస్తున్నాం. మాకు నీతులు చెప్పే నాయకులు కర్నూలులో ఎన్నో భూములు కబ్జా చేశారు. ఆ భూములను మేము రక్షించాం. కులమతాలకు అతీ తంగా సేవా కార్యక్రమాలు చేస్తున్నాం. అలాంటి మాపై బురద జల్లాలని చూస్తే చూస్తూ ఊరుకోమని అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి టీజీ భరత్ కూడా పాల్గొన్నారు. ఇటీవల కర్నూలులో టీడీపీ పోలింగ్ బూత్ ఇన్‌ఛార్జ్ సునీల్‌పై హత్యాయత్నం జరిగింది. తమ నేతపై హత్యాయత్నం జరగడంపై మంత్రి టీజీ భరత్ ఆగ్రహించారు. ఈ క్రమంలో బాలు అనే వైసీపీ కార్యకర్తను పోలీసులు విచారించారు. దీనిపై స్పందించిన సిద్ధార్థరెడ్డి అవినీతి ఆరోపణలు చేయడంతో వివాదం మొదలైంది.

# సౌదీలో ఘనంగా మహానాడు

- గల్ఫ్‌నుంచి విజయవాడకు నేరుగా విమాన సౌకర్యం
- ఎన్ఆర్ఐ టీడీపీ నిర్వహించిన మహానాడులో తీర్మానం
- సఫ్వాలో అట్టహాసంగా సాగిన మహానాడు-2026
- ఏపీనుంచి హాజరైన పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్
- గల్ఫ్‌లో తెలుగు ప్రజల ఐక్యత చాటిన మహానాడు
- ప్రత్యేక అభినందనలు తెలిపిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా




తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలు, తెలుగు జాతి ఆత్మగౌరవం, ఎన్ఆర్ఐ తెలుగు ప్రజల ఐక్యతను ప్రతిబింబించేలా ఎన్ఆర్ఐ టీడీపీ ఆధ్వర్యంలో "మహానాడు 2026".. సౌదీ అరేబియాలోని సఫ్వాలో ఉదయం 9నుంచి సాయంత్రం 4:30 వరకు ఘనంగా సాగింది. సౌదీ అరేబియాలో తెలుగు ప్రజలను ఒకే వేదికపైకి తీసుకొచ్చిన మహానాడు మహోత్సవం రాజకీయ, సాంస్కృతిక, సామాజిక అంశాలపై విస్తృత చర్చలకు వేదికైంది. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ దంపతులు, టీడీపీ నాయకులు రాజేష్ మహాసేన, ఖలీద్ సైపుల్లా పాల్గొని ప్రసంగించారు. అనివార్య కారణాలతో హాజరుకాలేకపోయిన రాధాకృష్ణ.. తన అమూల్యమైన సందేశాన్ని వీడియోద్వారా పంపించారు. అదేవిధంగా జుబైల్ టీమ్ తరపున ముగ్గురు, రియాద్ టీమ్ తరపున ముగ్గురు, హాజరైన సభ్యులనుంచి ముగ్గురు ప్రతినిధులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఎన్ఆర్ఐ టీడీపీ గల్ఫ్ కౌన్సిల్ అధ్యక్షుడు (సౌదీ అరేబియా, కువైట్, బహ్రెయిన్, యూఏఈ, ఖతార్, ఒమాన్) రాధాకృష్ణ రవి కార్యక్రమానికి మార్గనిర్దేశనం చేశారు. ఎన్ఆర్ఐ టీడీపీ సౌదీ అరేబియా అధ్యక్షుడు ఖలీద్ సైపుల్లా కార్యక్రమ నిర్వహణను విజయవంతంగా సమన్వయం చేశారు. సంస్థ నిర్వహణలో ఉపాధ్యక్షులు భరద్వాజ్ మదాల, ప్రధాన కార్యదర్శి అడబాల భాస్కర్ రావు, సోషల్ మీడియా కోఆర్డినేటర్ సారథి నాయుడు వడ్లమూడి, చంద్రశేఖర్ ఎం కీలక పాత్ర పోషించారు. జుబైల్ కోఆర్డినేటర్ కొగంటి శ్రీనివాసరావు, రియాద్ కోఆర్డినేటర్లు జాని షేక్, రాజశేఖర్ సూరపనేని, దమ్మాం కోఆర్డినేటర్ జకీర్ మహ్మద్, ఖోబర్ కోఆర్డినేటర్ మహేశ్వర్‌రెడ్డి, జెడ్డా కోఆర్డినేటర్ కె. శివరామకృష్ణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమం ఉదయం ప్రారంభమైన సంగీత విభావరిలో ప్రముఖ గాయకులు రఘు కుంచె, మాళవిక తమ గాన ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరించారు. అనంతరం అతిథుల పరిచయం, వీడియో ప్రదర్శనలు, జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. రియాద్, జుబైల్ టీమ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు, జానపద నృత్యాలు, స్కిట్లు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.

మధ్యాహ్నం జరిగిన మహానాడు తీర్మానాల సమావేశంలో ఎన్ఆర్ఐ సంక్షేమం, సామాజిక అభివృద్ధి, తెలుగు సంస్కృతి పరిరక్షణ, పార్టీ బలోపేతంపై ముఖ్య తీర్మానాలు ఆమోదించారు. అనంతరం అతిథుల ప్రసంగాలు, సన్మాన కార్యక్రమం, సమూహ ఫోటో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. తెలుగు ప్రజల ఐక్యత, సేవాభావం, తెలుగుదేశం ఆశయాలను ప్రపంచవ్యాప్తంగా ప్రతిబింబించిన మహానాడు కార్యక్రమం అత్యంత విజయవంతంగా ముగిసిందని నిర్వాహకులు తెలిపారు.

సౌదీ అరేబియాలో తెలుగుదేశం గల్ఫ్ కౌన్సిల్ ఇచ్చిన పిలుపునకు తెలుగు ప్రవాసీ లోకం కదిలివచ్చింది. శుక్రవారం సౌదీ అరేబియాలోని దమ్మాంలో ఎన్నారై తెలుగుదేశం పార్టీ సౌదీ శాఖ అట్టహాసంగా నిర్వహించిన మహానాడుకు దేశంలోని సదూర ఎడారి ప్రాంతాల నుండి పార్టీ అభిమానులు ఉత్సహాంతో కదం తొక్కుతూ చేరుకున్నారు. 1700 కిలోమీటర్ల దూర ప్రాంతాల నుండి కూడ పార్టీ అభిమానులు హాజరయ్యారు. గల్ఫ్ కౌన్సిల్ అధ్యక్షుడు రావి రాధాకృష్ణా నేతృత్వంలో జరిగిన కార్యక్రమం పార్టీ కార్యక్రమం కంటె ఎక్కువగా తెలుగు కుటుంబాల ఆత్మీయ కలయికగా జరిగింది. తెలుగుదేశం పార్టీకి బలమైన కంచుకోటగా భావించే రియాద్ నుండి ప్రత్యేక బస్సుల్లో మహిళలు, చిన్నారులు సైతం 500 కిలోమీటర్ల దూరం దమ్మాంలోని సభావేదికకు చేరుకోన్నారు. పార్టీ నాయకుడు వడ్లమూడి సారథినాయుడు ఆధ్వర్యంలో సుప్రభాతం పూజకు లేచినట్లుగా తెల్లవారు జామున 4 గంటలకు లేచి దమ్మాంకు బయలుదేరారు. పారిశ్రామిక నగరం జుబైల్ నుండి పార్టీ అభిమానులు కూడా చురుక్కుగా పాల్గోన్నారు. జోర్డాన్ సరిహద్దులోని తబూక్ నుండి 1700 కిలోమీటర్ల దూరం ప్రయాణించి వచ్చిన రోహన్ కుమార్, 1200 కిలోమీటర్ల దూరంలోని జెద్దా నుండి వచ్చిన శివరామకృష్ణలు తెలుగుదేశం మీద ఉన్న అభిమానానికి తార్కాణంగా నిలిచారు. పెద్ద సంఖ్యలో వచ్చిన పార్టీ కార్యకర్తలకు రియాధ్ తెలుగుదేశం బృందం సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను ఆకట్టుకున్నాయి. గత రెండు రోజులుగా నిద్రాహారాలు లేకుండా కార్యక్రమ నిర్వహణలో నిమగ్నమైనప్పటికి జానీ బాషా, రాజశేఖర్, ఖాలీద్ సైఫుల్లా, కోగంటి శ్రీనివాస రావు, భరద్వాజ్, చంద్రశేఖర్, భానుప్రకాశ్, చెన్నుపాటి నరేష్, గడ్డం శిల్పా, మండవ అక్షితలు వచ్చిన కార్యకర్తలను అప్యాయతంగా పలకరించి స్వాగతించారు. అతిథ్య రెస్టారెంట్ వడ్డించిన సంప్రదాయక తెలుగు వంటకాల రుచులను సభికులు ఆస్వాదించారు. పార్టీ ప్రతినిధులు రంజిత్, సత్తిబాబు, ముజ్జమ్మీల్, సతీశ్ తదితరులు భోజనాలను వడ్డించారు. విజయవాడ విమాశ్రాయానికి సౌదీ అరేబియా మరియు ఇతర గల్ఫ్ దేశాల నుండి నేరుగా విమాన సౌకర్యం కల్పించాలని, ఇందుకు ప్రతి ఒక్క ప్రవాసాంధ్రుడు తమ బాధ్యతగా గల్ఫ్‌లోని ఎయిర్ లైన్స్‌ను ఒప్పించాలని తెలుగుదేశం పార్టీ సౌదీ అరేబియా అధ్యక్షుడు ఖాలీద్ సైఫుల్లా చేసిన సూచనకు మహానాడు తీర్మానంగా ఆమోదించింది.

## ప్రత్యేక అభినందనలు తెలిపిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

గల్ఫ్ కౌన్సిల్ అధ్యక్షుడు రావి రాధాకృష్ణా నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమం పార్టీ కార్యక్రమం కంటె ఎక్కువగా తెలుగు కుటుంబాల ఆత్మీయ కలయికగా జరిగిందని, విజయవాడ నుండి ప్రత్యేకంగా వచ్చిన పెనమలూరు శాసన సభ్యుడు బోడె ప్రసాద్



మరియు తెలుగు దేశం పార్టీ నాయకుడు మహాసేన రాజేశ్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలవడంపై రాష్ట్ర పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ప్రత్యేకంగా తన అభినందనలు తెలిపారు. సౌదీ అరేబియాలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలను పార్టీ అధ్యక్షుడు ప్రత్యేకంగా కొనియాడారు. మహానాడును విజయవంతం చేయడంపై ఎన్ఆర్ఐ ప్రతినిధులకు రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రత్యేక వీడియో కాల్ ద్వారా శుభాకాంక్షలు తెలియజేశారు. చిత్తూరు జిల్లా పలమనేరు శాసనసభ్యుడు యన్. అమర్నాథ్ రెడ్డి, పార్టీ నాయకుడు సుఖవాసిలు కూడ వీడియో కాల్ ద్వారా తమ అభిప్రాయాలను ఎన్ఆర్ఐ సభ్యులతో పంచుకున్నారు. తెలుగు గడ్డపై వారికున్న మమకారాన్ని మహానాడు రూపంలో ఆవిష్కరించారని నేతలు కీర్తించారు.



## వైసీపీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి వెబ్‌ల్యాండ్ నుంచి

# భూమి తొలగించారు

- గ్రీవెన్స్‌లో మార్కాపురం వాసి ఫిర్యాదు
- సీఐ అండతో వైసీపీ నాయకుల దౌర్జన్యం... న్యాయం చేయాలని వినతి
- విజయవాడలో వడ్డీ వ్యాపారి దౌర్జన్యం... అప్పు పూర్తిగా చెల్లించినా వేధింపులు
- పుట్టింటి వారు పెట్టిన బంగారంపై అన్నయ్య కన్ను.. పెళ్లికని తీసుకెళ్లి రెండేళ్లుగా తిప్పుతున్న వైనం
- అర్జీలు స్వీకరించిన విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఏపీ లేబర్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ వెంకట శివుడు యాదవ్
- సమస్యల పరిష్కారానికి నేతల కృషి



మంగళగిరి (చైతన్యరథం): మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో శనివారం ప్రజా వినతుల పరిష్కార వేదిక నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి విచ్చేసిన వారి నుంచి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఏపీ లేబర్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ వెంకట శివుడు యాదవ్ వినతులు స్వీకరించి వాటి పరిష్కారానికి కృషి చేశారు. మార్కాపురానికి చెందిన పేరూరి శ్రీనివాసులు అర్జీ... గోగులదిన్నె రెవెన్యూ పరిధిలోని సర్వే నెం.54/1 (1.00 ఎకరం), 55/2 (1.76 ఎకరాలు), 55/1 (0.62 సెంట్లు)ల్లో మొత్తం 3.42 ఎకరాల భూమిని 2005 సంవత్సరం నుంచి నేనే స్వయంగా ఎంతో కష్టపడి సాగు చేసుకుంటున్నాను. ఆ పంట ఆధారంగానే నా కుటుంబం జీవిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీకి చెందిన స్థానిక నాయకులు రాజకీయ కక్షలను మనసులో పెట్టుకుని అధికారులపై ఒత్తిడి తెచ్చారు. జాయింట్ కలెక్టర్ కోర్టులో కనీసం నా వాదన గానీ, వివరణ గానీ వినకుండా... కేవలం అప్పటి వైసీపీ వారు చెప్పిన తప్పుడు మాటలను నమ్మి అధికారులు ఆ భూమిని అన్యాయంగా ఆన్‌లైన్ (వెబ్ ల్యాండ్) రికార్డుల నుంచి రద్దు చేశారు. వారిపై చర్యలు తీసుకుని ఈ భూమి వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణ జరిపించి అక్రమంగా తొలగించిన ఆన్‌లైన్ రికార్డులను పునరుద్ధరించాలని అభ్యర్ధించాడు.

వైఎస్సార్ కడప జిల్లా రాజంపేటకు చెందిన అనూరాధ విజ్ఞప్తి... మేమే కష్టపడి పని చేసుకునేవాళ్లం. మా అబ్బాయి విషయంలో జరిగిన ఒక చిన్న పొరపాటును ఆసరాగా చేసుకుని స్థానిక వైసీపీ నాయకులు, పోలీసులు కలిసి మమ్మల్ని వేధిస్తున్నారు. ఇద్దరు పిల్లల తల్లి అయిన ఒక మహిళ ఆమె ఇష్టపూర్వకంగానే మా అబ్బాయితో వెళ్ళిపోయింది. ఆ తర్వాత మా అబ్బాయి బెంగళూరులో ఉన్నానని మాకు ఫోన్ చేసి చెప్పాడు. తెలిసో తెలియకో తప్పు చేశామని, ప్రస్తుతం నేను తిరుపతి వైపు వెళ్తున్నానని కూడా తెలిపాడు. అయితే విషయాన్ని రాజంపేట సీఐ నాగార్జున తీవ్రంగా మార్చేస్తున్నారు. మా అబ్బాయిపై దాడి చేసిన రాజశేఖర్, శాంతి, విజయ్, వినోద్, వినయ్‌రెడ్డిలను వదిలేశారు. వైసీపీకి చెందిన జాబీర్ అనే వ్యక్తిని చాంబర్‌లోకి పిలిపించుకుని అతని ముందే మమ్మల్ని నీచంగా తిట్టారు. సీఐ నిష్పక్షపాతంగా వ్యవహరించకుండా రాజకీయ కక్షతో మా అబ్బాయి పైన, మా కుటుంబం పైన లేనిపోని కిడ్నాప్ కేసులు, మర్డర్ కేసులు పెట్టి అందరినీ జైలుకు పంపిస్తానని బెదిరిస్తున్నారు. మా అబ్బాయిని ఇరకాటంలో పెట్టాలని చూస్తున్నారు. మేము తెలుగుదేశం పార్టీ వాళ్లమనే ఒకే ఒక్క కారణంతో వైసీపీ నాయకులతో చేతులు కలిపి పోలీసులు మమ్మల్ని సాధిస్తున్నారు.

ఎన్టీఆర్ జిల్లా విజయవాడకు చెందిన రాజేశ్వరి వినతి... నా భర్త చనిపోవడంతో కుటుంబ ఖర్చుల నిమిత్తం పాయకాపురానికి చెందిన ఇ.రాధ వద్ద విడతల వారీగా మొత్తం రూ.3లక్షలు అప్పుగా తీసుకున్నాను. ఆ తర్వాత కొన్ని రోజులకు అప్పు మొత్తాన్ని వడ్డీతో సహా పూర్తిగా తీర్చివేశాను. అయినా రాధ, ఆమె మనుషులు నా పైనా, నా కుటుంబంపైన కక్షగట్టారు. ఇంకా డబ్బులు ఇవ్వాలని దౌర్జన్యానికి దిగుతున్నారు. అర్ధరాత్రులు కూడా 30-40మంది రౌడీమూకలను పోగు చేసుకుని మా ఇంటిపైకి వస్తున్నారు. నన్ను, నా కుమారులను అసభ్య పదజాలంతో తిడుతూ శారీరకంగా దాడులకు తెగబడుతున్నారు. రోడ్డుపై నా కుమారులు కనిపిస్తే కొట్టడానికి వెంటాడుతున్నారు. దీంతో మేమంతా ప్రాణభయంతో బతుకుతున్నాము.

చిత్తూరు జిల్లా వి.కోటకు చెందిన స్వర్ణ అర్జీ... నా పెళ్లి సమయంలో నాకు పుట్టింటి వారు 300 గ్రాముల బంగారం పెట్టారు. మా అన్నయ్య బి.కుమార్‌స్వామి రెడ్డి అతడి స్వగ్రామంలో ఒక పెళ్లికి నగలు కావాలని, పని పూర్తికాగానే తిరిగి ఇచ్చేస్తానని చెప్పి నా వద్ద 300 గ్రాముల బంగారం తీసుకువెళ్లాడు. దాదాపు రెండున్నర సంవత్సరాలుగా బంగారం ఇవ్వకుండా తిప్పుతున్నాడు. గతేడాది మార్చిలో మా అమ్మను చూడటానికి ఊరికి వెళ్లినప్పుడు.. 'మార్చి 30, 2026న వచ్చి నీ బంగారం తీసుకెళ్లు' అని అన్నయ్య చెప్పాడు. ఆ నమ్మకంతో మార్చి 30న ఇంటికి వెళ్లి బంగారం అడిగాను. మా అన్న, వదిన రేణుక కలిసి 'నీ దిక్కున్నచోట చెప్పుకో పో' అంటూ నన్ను దారుణంగా కొట్టారు. ఈ అన్యాయంపై నిమ్మనపల్లి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాను. కానీ అక్కడి పోలీసులు మరుసటి రోజు రమ్మంటూ దాదాపు రెండు వారాల పాటు స్టేషన్ చుట్టూ తిప్పించారు. చివరకు అక్కడ ఏం జరిగిందో ఏమో తెలియదు కానీ.. 'మేము నీ బంగారం ఇప్పించలేము' అని పోలీసులు చేతులెత్తేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో నాకెలాంటి న్యాయం జరగలేదు.

కాకినాడ జిల్లా కాజులూరుకు చెందిన సత్యనారాయణమ్మ విజ్ఞప్తి... నా ఫోన్ హ్యాక్ చేశారు. నేనుండే గదిలో, చుట్టుపక్కల నిఘా కెమెరాలు పెట్టి కొందరు వ్యక్తులు నిరంతరం గమనిస్తున్నారు. ఉద్యోగ ఇంటర్వ్యూలకు వెళ్లినా, లేదా మరే ఇతర పనులకు వెళ్లినా శత్రువులు నాపై నిఘా ఉంచి ఆటంకాలు కలిగిస్తున్నారు. పని చేసే చోట కూడా కొందరు వ్యక్తుల ద్వారా నన్ను మానసికంగా హింసిస్తూ అసభ్యకరమైన మాటలతో న్యూసెన్స్ కలిగిస్తున్నారు. ఈ నిరంతర వేధింపులతో తీవ్రమైన భయభ్రాంతులకు, మానసిక ఒత్తిడికి లోనవుతున్నాను. నా ఫోన్, నివాస ప్రాంతాన్ని పరిశీలించి నాకు భద్రత కల్పించి వేధింపు లకు కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరింది.

కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం కంబాలపాలెం గ్రామానికి చెందిన మరిడిరాజు విన్నపం... నా తండ్రి దివంగత కాకరపల్లి అప్పలస్వామి సంపాదించిన స్థిరాస్తి సర్వే నెం.503లో గల 3.50 ఎకరాల భూమి (మెరక, పల్లం) ఏలేరు ప్రాజెక్ట్ భూసేకరణ కిందకు వెళ్లింది. ఈ సర్వే నెంబర్లో ఉన్న మొత్తం 7.11 ఎకరాల భూమిని ఏలేరు ప్రాజెక్ట్ కోసం ప్రభుత్వం సేకరించి, దానికి సంబంధించిన అవార్డును కూడా అధికారులు గతంలోనే పాస్ చేశారు. భూసేకరణ పరిధిలోకి వెళ్లడం వల్ల ఈ భూమికి కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయడానికి వీలుపడదని రెవెన్యూ అధికారులు చెప్తున్నారు. ఒకపక్క భూమికి పాస్ పుస్తకాలు రాక, మరోపక్క రావలసిన నష్టపరిహారం డబ్బులు అందక మేము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.


పల్నాడు జిల్లా దుర్గికి చెందిన రామావత్ శ్రీను నాయక్ వినతి... అల్లూరి జిల్లా చింతపల్లి మండలం మడిగుంటలోని సర్వే నెం.45/2 లో గల 1.95 ఎకరాల భూమిని ఉల్లి బంగారమ్మ అనే ఆమె వద్ద విక్రయ అగ్రిమెంట్ ద్వారా కొనుగోలు చేశాను. అయితే రిజిస్ట్రేషన్ జరిగే సమయానికి బంగారమ్మ అనారోగ్యంతో మరణించింది. ఆమె వారసులపై పాడేరు ఆర్డీవో కోర్టులో దావా (వీజ 1/2020) వేశాను. 23-01-2021న ఉభయుల అంగీకారంతో కోర్టులో రాజీ కుదిరింది. షరతుల ప్రకారం వారసులు రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో నేను అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్‌కు ఎగ్జిక్యూటివ్ పిటిషన్ దాఖలు చేశాను. దీనిపై స్పందించిన ఆయన విచారణకు ఆదేశించగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, చింతపల్లి మండల రెవెన్యూ అధికారి విచారణ జరిపి భూమికి సంబంధించిన అన్ని పత్రాలు సరిగ్గా ఉన్నాయని ధ్రువీకరించారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియకు అనుమతి ఇవ్వాల్సిందిగా చింతపల్లి తహసీల్దారు పాడేరు ఆర్డీవోకి లేఖ రాశారు. గత పది నెలలుగా అన్ని పత్రాలు, నివేదికలు సిద్ధంగా ఉన్నప్పటికీ... పాడేరు ఆర్డీవో కార్యాలయంలో ఫైల్ ముందుకు కదలట్లేదు.

ఏలూరు జిల్లా ఉంగుటూరుకు చెందిన సుబ్బరావు విన్నపం... మా కుమారుడు ప్రదీప్, కోడలు శిరీష పేర్ల మీద జంగారెడ్డిగూడెం మండలం నిమ్మలగూడెంలోని రిజిస్టర్డ్ సర్వే నెం.73లో విడివిడిగా (కుమారునికి 4 ఎకరాలు, కోడలికి 3 ఎకరాలు) మొత్తం 7 ఎకరాల భూమిని 05-07-2014న ఆళ్ల వెంకట శ్రీదేవి వగైరాల వద్ద క్రయదస్తావేజుల (రిజిస్ట్రేషన్) ద్వారా కొనుగోలు చేశాము. నాటి నుంచీ ఆ భూమి మా ఆధీనంలోనే ఉంది. ఇటీవల సర్వేయర్ మా భూమిని రీసర్వే చేయగా.. రికార్డుల్లో మాకున్న 7 ఎకరాల భూమి కేవలం 6.20 ఎకరాలు మాత్రమే ఉన్నట్టు చూపించారు. అభ్యంతరం ఉందని సర్వేయర్‌కి లిఖితపూర్వకంగా దరఖాస్తు ఇచ్చాము. కానీ ఆ సర్వేయర్ మా దరఖాస్తుపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా రీసర్వే పూర్తయిపోయిందంటూ ఫైలును పై అధికారులకు పంపించేశారు. జంగారెడ్డిగూడెం తహసీల్దారు కార్యాలయంలో ఈ విషయమై అర్జీ ఇవ్వగా మళ్లీ రీసర్వే కోసం దరఖాస్తు చేసుకోమన్నారు. దీంతో నేను 17-10-2022న ప్రభుత్వం నిర్వహించిన 'స్పందన'లో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాను. ఆ తర్వాత 19-10-2022న అధికారులు వచ్చి సర్వే చేశారు. సమస్య ఇంకా పరిష్కారం కాకుండానే.. మా వద్ద 'పరిష్కారం అయినట్లు' ఎండార్స్‌మెంట్ (సంతకం) తీసుకుని, మోసపూరితంగా స్పందన ఫిర్యాదును ముగించి వేశారు. ఇలా రెండు పర్యాయాలు స్పందన ద్వారా అర్జీలు పెట్టినా అధికారుల చుట్టూ తిరగడమే సరిపోయింది కానీ ఈ రోజు వరకు తమకు ఎలాంటి న్యాయం జరగలేదు. సౌ

పై వాటితో పాటు పలువురు పింఛన్, రేషన్, ఇళ్ల నిర్మాణాల సమస్యలపై అర్జీలు ఇచ్చి పరిష్కరించాలని కోరగా.. మరికొందరు ఉద్యోగాల కోసం రెస్యూమ్‌లు ఇచ్చారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బందిపడుతున్నాం ఆర్థిక తోడ్పాటు కల్పించాలని మరికొందరు అభ్యర్థనలు అందించారు.

# ఆర్టీసీ ఆధ్వర్యంలో టూరిజం అభివృద్ధి

- పర్యాటక ప్రదేశాల సందర్శనకు రూట్‌మ్యాప్
- త్వరలోనే తిరుపతి కేంద్రంగా అమలు




తిరుపతి(చైతన్యరథం): పర్యాటకాభివృద్ధి సంస్థ తరహాలో ఏపీ పీటీడీ టూరిజం త్వరలో అందుబాటులోకి రానుంది. రెండు రోజుల క్రితం ముఖ్యమంత్రి చంద్రబాబు ఆర్టీసీ ద్వారా టూరిజం అమలు చేయాలని ప్రకటించారు. ఆర్టీసీ బస్సుల్లో సురక్షిత ప్రయాణానికి భరోసా ఉంటుందని తెలియజేశారు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ ఉన్నతాధికారులు తిరుపతి జిల్లాతో పాటు పొరుగు జిల్లాలో ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రాలు, విశేష సందర్శక ప్రాంతాలు, కేంద్రాలను గుర్తించి రూట్‌మ్యాప్‌ను సిద్ధంచేశారు.

పర్యాటకులలో విస్తృతంగా అవగాహన కల్పించేందుకు ఆయా దేవాలయాల విశిష్టత, సందర్శక ప్రాంతాల ప్రాముఖ్యతను కూడా తెలియజేస్తూ పెద్ద పెద్ద సూచికబోర్డుల ఏర్పాటుకు ప్రతిపాదించారు. రిలీజియస్ అండ్ పిలిగ్రిమైజ్, ఎకో, హెరిటేజ్ టూరిజంగా విభజించారు. ఏ రకపు బస్సులను, ఏ సమయంలో నడపాలన్న అంశాలపై చర్చించారు. చార్జీలు, టిక్కెట్ బుకింగ్, సిబ్బంది కేటాయింపులపై కూడా ఒక నిర్ణయానికివచ్చారు. ఇలా తిరుపతి కేంద్రంగా నలుదిశలా ఆర్టీసీ ఆధ్వర్యంలో టూరిజం డెవెలప్‌మెంట్‌కు సన్నాహాలు జరుగుతున్నాయి.

### ఆర్టీసీ ప్రతిపాదనలు

- కడప జిల్లాలోని గండికోట, ఒంటిమిట్ట రామాలయం, నందలూరు సౌమ్యనాథ ఆలయం, పుష్పగిరి ఆలయాల సందర్శన
- తిరుపతిలోని కపిలతీర్థం, సైన్స్ సెంటర్, జూపార్కు, చుట్టు పక్కల ఉన్న శ్రీనివాసమంగాపురం, చంద్రగిరి కోట, వకుళమాత, ముక్కోటి, తిరుచానూరు ఆలయాల సందర్శన
- అప్పలాయగుంట, నారాయణవనం, నాగలాపురం, సురుటు పల్లె, కార్వేటినగరం ఆలయాల సందర్శన, గుడిమల్లం, తొండమ నాడు, శ్రీకాళహస్తి ఆలయాల సందర్శన
- వాకాడులోని తూపిలిపాళెం బీచ్, షార్, పులికాట్ సరస్సు సందర్శన, మాధవమాల, కలంకారి, శ్రీకాళహస్తి ఆలయ సందర్శన

## గత ప్రభుత్వం వ్యాపారస్తులను వేధిస్తే

# కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోంది

### ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్

మంగళగిరి (చైతన్యరథం): రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అన్ని వర్గాలు, అన్ని ప్రాంతాల ప్రజల ఆదరణ పొందుతూ బ్రహ్మాండమైన అభివృద్ధి పథంలో ముందుకు దూసుకుపోతోందని ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్ స్పష్టం చేశారు. ఈ రెండేళ్లలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఎంతో పారదర్శకంగా కృషి చేస్తోందని కొనియాడారు.

గత ప్రభుత్వం వ్యాపారస్తులను వేధిస్తే కూటమి ప్రభుత్వం వారికి అండగా నిలుస్తోందన్నారు. ప్రజా సమస్యలపై ఎవరైనా నిర్మాణాత్మకంగా, పారదర్శకంగా ప్రశ్నిస్తే సమాధానం చెప్పడానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సాధిస్తున్న ప్రగతిని చూసి ఓర్వలేక వైసీపీకి చెందిన కొందరు “పేటీఎం బ్యాచ్” నేతలు ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. విజయవాడకు చెందిన వైసీపీ నేత వెల్లంపల్లి శ్రీనివాస్ వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. గత ప్రభుత్వంలో నీ సొంత నియోజకవర్గ ప్రజలే నిన్ను చీదరించుకుంటే మంత్రి పదవి నుంచి తొలగించి, వేరే నియోజకవర్గానికి పంపారన్నారు. మీ పార్టీ అధినేత ఇంట్లో జరిగే కార్యక్రమాల్లో కనీసం గౌరవం లేని నీ స్థాయి ఏంటో తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. గుళ్ళు, గోపురాలు... చివరకు పెట్రోల్, డీజిల్ ధరల గురించి మాట్లాడే నైతిక హక్కు నీకు లేదని రాకేష్ మండిపడ్డారు. యుద్ధ పరిణామాలు, ఆర్థిక సంక్షోభాల వల్ల పెట్రోల్, డీజిల్ ధరల ఇబ్బందులు ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం ప్రజలపై ఎలాంటి భారం పడకుండా ఎంతో సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్తోందని వివరించారు. ఈ సందర్భంగా ఆయన గత ప్రభుత్వ వైఫల్యాలను, ప్రస్తుత ప్రభుత్వ నిజాయితీని గణాంకాలతో సహా వివరించారు.



#### ప్రజలపై భారం మోపట్లేదు...

‘గత వైసీపీ ప్రభుత్వంలో పెట్రోల్‌పై రూ.41, డీజిల్‌పై రూ. 31 పెంచారు. జగన్‌రెడ్డి, అండ్ కో లాభాల కోసం వ్యాట్, రోడ్ సెస్ పేరుతో అదనపు భారాలు వేశారు. పెట్రోల్ 76, డీజిల్ 68 గా ఉన్న ధరలను.. ఏకంగా పెట్రోల్ 107, డీజిల్ 99కి చేర్చారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం (గడిచిన రెండేళ్లు) రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా ఒక్క రూపాయి కూడా పెంచలేదు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో మాత్రమే స్వల్పంగా (కేవలం రూ.3) మార్పు వచ్చింది తప్ప రాష్ట్రం సొంతంగా భారం వేయలేదు. ఆర్థిక ఇబ్బందులున్నా ప్రజలపై భారం పడకుండా ఎంతో సమర్థవంతంగా మేనేజ్ చేస్తోంది. పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై లోకేష్‌పై కేసులు పెట్టాలనడం హాస్యాస్పదం. అసలు పెట్రోల్ ధరలపై అవగాహన లేని 420లు ఇలాంటి మాటలు మాట్లాడుతున్నారు. కూటమి ప్రభుత్వం సాధిస్తున్న విజయాలను, సంక్షేమాన్ని అడ్డుకోవాలని చూస్తే తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు, కూటమి శ్రేణులు చూస్తూ ఊరుకోర’ని హెచ్చరించారు.

#### వెల్లంపల్లి అవినీతి చిట్టా బయటకు తీస్తాం

‘ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న యుద్ధ పరిణామాలతో ఇంధన సంక్షోభం ఏర్పడింది. దీని ప్రభావం ఒక్క ఏపీపైనే కాదు యావత్ భూగోళంపై ఉంది. మేము ఈ రోజు యూఎస్, యూకే, కెనడా, ఆస్ట్రేలియా, దుబాయ్ వంటి వివిధ దేశాల్లో ఉన్న వారితో మాట్లాడాం. అక్కడ గతంలో లీటర్ పెట్రోల్ 1.2 డాలర్లు ఉంటే, ఈ రోజు యుద్ధాల కారణంగా 1.8 నుంచి 2.1 డాలర్లకు పెరిగింది. ఇది ప్రపంచవ్యాప్తంగా వచ్చిన కృత్రిమ సంక్షోభం. త్వరలోనే ఈ పరిస్థితులు సర్దుబాటవుతాయి. కూటమి ప్రభుత్వం కూడా దీనికి తగిన చర్యలు తీసుకుంటుంది. దేశ, దేశాల మధ్య కొట్లాట జరిగి రేట్లు పెరిగితే... దానికి, లోకేష్‌కి ఏం సంబంధం? ఆయనపై కేసు పెడతారా? ఈ 420 నేతలకు ఏమైనా బుద్ధి ఉందా? వెల్లంపల్లి శ్రీనివాస్ వెనుక పట్టుమని 30 మంది జనం కూడా లేరు. మేము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చేసిన ప్రజా పోరాటాల సంఖ్య అంత కూడా ఆయన వెనుక ఉన్న వాళ్ల సంఖ్య లేదు. మా ప్రభుత్వంపై గతంలో పెట్టిన అక్రమ కేసుల సంఖ్య అంత మంది కూడా ఈ రోజు ఆయన వెనుక నిలబడటం లేదు. విజయవాడలో ఈ ‘మాడిపోయిన పల్లి పకోడీ’ చేసిన అవినీతి చిట్టా ప్రకాశం బ్యారేజీ కన్నా పొడవుగా ఉంటుంది. మొగుడు-పెళ్లాల గొడవలు, అన్నదమ్ముల తగాదాలు, భూ గొడవలు.. ఇలా ప్రతి ఆస్తి తగాదాలో తలదూర్చి డబ్బులు వసూలు చేసిన ఘనత అతనిదే. చేసిన పాపాలు, అవినీతిని ఎవరూ పట్టించుకోవట్లేదనే భ్రమలో ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నాడు. కానీ త్వరలోనే అతని బాధితుల చిట్టా మొత్తాన్ని బయటకు తీస్తాం. చట్టపరమైన చర్యలు తీసుకునే వరకు వదిలిపెట్టే ప్రసక్తే లేదు.’

#### పథకాలు అమలు చేసేవారిపై కేసులా...

‘గత ప్రభుత్వం ‘అమ్మఒడి’ పేరుతో ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికీ ఇస్తామని చెప్పి చివరకు మొండిచేయి చూపి మోసం చేసింది. కానీ మా యువ నేత నారా లోకేష్ ఇచ్చిన మాట ప్రకారం.. ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికీ ‘తల్లికి వందనం’ పథకం ద్వారా న్యాయం చేకూరుస్తున్నారు. పిల్లల చదువుల కోసం బ్రహ్మాండంగా పథకాన్ని అమలు చేస్తున్నందుకా మీరు లోకేష్‌పై కేసులు పెట్టేది? రాష్ట్ర ఐటీ శాఖ మంత్రిగా ఎన్నో జాతీయ, అంతర్జాతీయ పరిశ్రమలను ఆంధ్రప్రదేశ్‌కు రప్పించి, రాష్ట్ర జీడీపీని అద్భుతంగా పెంచుతున్నందుకా లోకేష్‌పై కేసు పెట్టేది? నిరుద్యోగ యువతకు ఇచ్చిన మాట ప్రకారం 20 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా పనిచేస్తూ మెగా డీఎస్సీ, కానిస్టేబుల్ ఉద్యోగాలు, ఎక్కడెక్కడ ఖాళీలు ఉన్నాయో వాటన్నింటినీ భర్తీ చేస్తూ తల్లుల కళ్లల్లో ఆనందం చూస్తున్నందుకా కేసు పెట్టేది? పేద పిల్లలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలల్లో అత్యున్నతమైన విద్యా బోధన అందించి, విద్యార్థులు మంచి మార్కులు సాధించి స్టేట్ పేపర్లలో వాళ్ల ఫొటోలు వచ్చేలా తీర్చిదిద్దుతున్నందుకా మీరు కేసు పెడతారు? దేనికి పెడతారో సమాధానం చెప్పాలి. వైసీపీ నేతలు మాట్లాడుతున్న తలతిక్క మాటలు చూసి జనం నవ్వుకుంటున్నారు. ‘మా యువ నేత లోకేష్ పేరెత్తే స్థాయి కూడా మీకు లేదు. మీ వెనుక కనీసం 30 మంది జనం కూడా లేరు. మా మీద గతంలో మీరు పెట్టిన కేసుల సంఖ్య అంత మంది కూడా ఇప్పుడు మీ వెనుక నిలబడటం లేదు. ముందు నీ స్థాయి ఏంటో నువ్వు తెలుసుకుని మాట్లాడు’ అని హితవు పలికారు.

సొంత తల్లి కళ్లల్లో ఆనందాన్ని చూసి ఓర్చుకోలేని మీ లాంటి వాళ్లకు రాష్ట్రంలోని లక్షలాది మంది తల్లుల కళ్లల్లో ఆనందం చూడాలని తపించే లోకేష్ గొప్పతనం ఏం తెలుస్తుంది? రాష్ట్రంలో ప్రస్తుతం ప్రజల వైపు నుంచి ఎలాంటి సమస్యలూ లేవు కాబట్టే ఏమీ చేతకాక మా నాయకుడిపై బురదజల్లుతున్నారు. నిజంగా వైసీపీ నేతలకు చిత్తశుద్ధి ఉంటే వారి ఐదేళ్ల హయాంలో రాష్ట్రానికి చేసిన ఒక్క మంచి పని అయినా చెప్పాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం చేసిన మంచిపై, వైసీపీ చేసిన పనులపై ఎప్పుడైనా, ఎక్కడైనా చర్చించడానికి తాము ఎల్లవేళలా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. తమ నాయకుడిపై ఇంకోసారి అవాకులు చవాకులు పేలితే చూస్తూ ఊరుకోమని, ప్రజలే తగిన శాస్తి చేస్తారని రాకేష్ హెచ్చరించారు.

## బోధనాసుపత్రుల్లో

# బయోమెడికల్ వ్యర్థాలపై నివేదిక

- సూపరింటెండెంట్లకు డీఎంఈ ఆదేశం
- ఆర్ఎంవోకు షోకాజ్ నోటీసు జారీ




అమరావతి(చైతన్యరథం): మంత్రి సత్యకుమార్ సూచనల మేరకు బోధనాసుపత్రుల్లో ప్రస్తుత బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ వ్యవస్థ యథాస్థితిపై వెంటనే నివేదికలు పంపాలని సూపరింటెండెంట్లను వైద్య ఆరోగ్యశాఖ ఆదేశించింది. విజయ వాడ జీజీహెచ్‌లో తాజాగా చోటు చేసుకున్న ఘటన నేపథ్యంలో డీఎంఈ రాధికారెడ్డి బోధనాసుపత్రులు సూపరింటెండెంట్లకు పంపిన ఉత్తర్వుల్లో ప్రస్తుత బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ, తరలింపు, ఇతర వివరాలను సోమవారం నాటికి పంపాలని స్పష్టంచేశారు. ముఖ్యంగా బయోమెడికల్ వ్యర్థాల స్టోరేజ్ గది నిర్వహణ ఎలా ఉంది? ప్రవేశ మార్గాల వద్ద ముఖ్యంగా తలు పులను మూసివేయడంలో ఉపయోగిస్తున్న విధానాలు, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి నుంచి గుర్తింపు మంజూరు, దాని కాలపరిమితి ఎంతవరకు ఉందో తెలియపరచాలని డీఎంఈ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే స్టోరేజీ రూములను సీసీ కెమెరాల ద్వారా పరిశీలించేలా సూపరింటెండెంట్లు చర్యలు తీసుకోవాలన్నారు. వాహనాల ద్వారా వ్యర్థాల తరలింపు ఎలా జరుగుతుంది? ఆపరేషన్ థియేటర్లు, ల్యాబ్స్, ఇతరచోట్ల నుంచి వ్యర్థాలను స్టోరేజి రూముకు తీసుకువస్తున్న విధానం, ఇతర వివరాలను తగిన ఆధారాలతో నివేదికలో పొందుపరచాలని డీఎంఈ సూపరింటెండెంట్లకు పంపిన ఆదేశాల్లో స్పష్టంచేశారు. బయోమెడికల్ వెస్టేజ్ మేనేజ్‌మెంట్ రూల్స్, 2016, ఇతర నిబంధనలు అనుసరించి, ఆసుపత్రుల సూపరిటెండెంట్లు బయో మెడికల్ వ్యర్థాల తరలింపు విధానాన్ని వ్యక్తిగతంగా ప్రతిరోజూ నిశితంగా పరిశీలించాలని స్పష్టంచేశారు. బయోమెడికల్ వ్యర్థాలను స్టోరేజ్ రూముల నుంచి ఎప్పటికప్పుడు తొలగించాలని పేర్కొన్నారు. వైద్యులు, నర్సులు, శానిటేషన్ ఉద్యోగులు, ల్యాబ్స్, ఆపరేషన్ థియేటరు సెక్యూరిటీ, వైద్య విద్యార్థులకు బయో మెడికల్ వెస్టేజ్ నిర్వహణ విధానం, రంగుల బ్యాగుల్లో వాటిని భద్రపరచడం, తరలించడం, ఇతర ప్రమాణాల అను సరించడంపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని దిశా నిర్దేశం చేశారు. బోధన ఆసుపత్రుల నుంచి వచ్చే నివేదికలపై ఉన్నత స్థాయిలో సమీక్ష జరుగుతుందని తెలిపారు.

#### ఆర్ఎంవోకు షోకాజ్ నోటీసు జారీ

విజయవాడ ప్రభుత్వ బోధనాసుపత్రిలో శస్త్రచికిత్స అనంతరం రోగి నుంచి తొలగించిన కాలి భాగాన్ని శునకం నోట కరుచుకుని తిరగడాన్ని మంత్రి సీరియస్‌గా తీసుకున్నారు. ఈ నేపథ్యంలో పర్యవేక్షణా లోపం కింద ఆర్ఎంవోకు ఆసుపత్రి సూపరింటెండెంట్ షోకాజ్ నోటీసులు జారీచేశారు. అలాగే శానిటేషన్ ఉద్యోగిని విధుల నుంచి తప్పించారు. వ్యర్థాల తరలింపు నిర్వహణ ప్రైవేటు సంస్థకు నోటీసును కూడా జారీచేశారు.

## కేజీహెచ్‌లో

# మరో రెండు ఓపీ కౌంటర్లు



- అదనంగా ప్రారంభానికి ఏర్పాట్లు
- రోగుల రద్దీ దృష్ట్యా నిర్ణయం

విశాఖపట్నం(చైతన్యరథం): కేజీహెచ్‌లో మరో రెండు ఓపీ (అవుట్ పేషెంట్) కౌంటర్లు ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తు తం ఆస్పత్రిలో ఎనిమిది ఓపీ కౌంటర్లు ఉన్నాయి. అయితే రోగుల సంఖ్య గణనీ యంగా పెరగడంతో ఓపీ చీటీ తీసుకోవ డానికి కనీసం గంటకు పైగా క్యూలో నిరీక్షించాల్సి వస్తోంది. రోగుల ఇబ్బందు లను గుర్తించిన ఎంపీ శ్రీభరత్ మరిన్ని కౌంటర్లు ఏర్పాటు చేయాలని నాలుగు రోజులక్రితం ఆస్పత్రిని సందర్శించినప్పు డు అధికారులకు సూచించారు. ఎంపీ సూచనతో ఆస్పత్రి అధికారులు అదనంగా మరో రెండుకౌంటర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందుకు అవసరమైన కంప్యూటర్లు, ప్రింటర్లు సమ కూర్చారు. ఇద్దరు డేటాఎంట్రీ ఆపరేటర్లను కేటాయిం చారు. రెండు రోజుల్లో కొత్తగా ఏర్పాటు చేసిన ఓపీ కౌంటర్లలో సేవలు ప్రారంభిస్తామని ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్ బీవీ రమణ తెలిపారు.

#### గణనీయంగా పెరిగిన రోగులు

గతంలో రోజుకు 1,500 నుంచి 1,800 మంది వరకు ఓపీ సేవలు పొందేవారు. అయితే, గడిచిన కొద్ది నెలలుగా ఈ సంఖ్య భారీగా పెరిగింది. ప్రతిరోజూ 2000 మందికి పైగా ఓపీ సేవల కోసం వస్తున్నారు. ఈఏడాది జనవరిలో 57,949 మంది, ఫిబ్రవ రిలో 67,738 మంది, మార్చిలో 69,983 మంది, ఏప్రిల్‌లో 69,010 మంది ఓపీ సేవలు పొందారు. గతంలో నెలవారీ రోగుల సంఖ్య 40 వేలకు మించేది కాదు. కానీ, కొద్దినెలలు గా రోగుల సంఖ్య భారీగా పెరగడంతో ఉదయం 8 మధ్యాహ్నం 12 గంటల వరకు ఓపీ చీటీ ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొంది. దీనివల్ల రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో కౌంటర్లు పెంచాలని నిర్ణయించినట్టు ఆస్పత్రి అధికారులు వెల్లడించారు.

## పార్టీ బలోపేతానికి సమన్వయంతో పనిచేయాలి

**● శ్రేణులకు కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి సూచన**



కురుపాం (చైతన్యరథం): పార్వతీపురం మన్యం జిల్లా, గుమ్మలక్ష్మీపురంలో కురుపాం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం నాడు తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రభుత్వ విప్ మరియు కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గ్రామాల అభివృద్ధి, పార్టీ బలోపేతం, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రతి ఇంటికీ చేరవేయడం పార్టీ నాయకులు, కార్యకర్తల బాధ్యత అని అన్నారు. మండల, గ్రామ స్థాయి నాయకులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించే విధంగా కృషి చేయాలని సూచించారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కారం అయ్యేలా కార్యాచరణ రూపొందించుకోవాలని, ప్రజలతో నిరంతరం సంబంధాలు కొనసాగిస్తూ పార్టీకి మరింత బలం చేకూర్చాలని ఎమ్మెల్యే సూచించారు. పార్టీ అభివృద్ధి, ప్రజా పరిచయం, గ్రామ స్థాయి ఎన్నికల వ్యూహాలపై నాయకులకు, కార్యకర్తలకు ఎమ్మెల్యే దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ ఆంధ్ర... స్వర్ణాంధ్రను ఒక ఉద్యమంగా తీసుకెళ్తున్నాం : ప్రభుత్వ విప్ గణబాబు



విశాఖపట్నం (చైతన్యరథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశంతో స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యంతో ప్రతి మూడో శనివారం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛ ఆంధ్ర... స్వర్ణాంధ్ర కార్యక్రమం శ్రీహరిపురం కోరమాండల్ గ్రౌండ్‌లో ప్రభుత్వ విప్ గణబాబు ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ 'డెంగ్యూ అవగాహన ర్యాలీ'ని ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన స్వయంగా ఈ ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ఆధ్వర్యంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలందరూ కలిసి అధికారిక 'స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ' చేశారు. "నేను, నా పరిసరాల పరిశుభ్రత కొరకు ప్రతి రోజు కొంత సమయం కేటాయిస్తానని, నా వంతు కృషిగా స్వచ్ఛత కార్యక్రమాల కొరకు శ్రమదానం చేసి పరిశుభ్ర ఆంధ్రప్రదేశ్ సాధించే సంకల్పానికి కట్టుబడి ఉంటానని..." అంటూ గ్రౌండ్‌లో ఉన్నవారందరితో ఎమ్మెల్యే ప్రమాణం చేయించారు.

**ప్లాస్టిక్‌ను విడనాడండి – గుడ్డ సంచులను వాడండి:** సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల పర్యావరణం, భూగర్భ జలాలు ఎంతగానో దెబ్బతింటున్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాలను కాల్చడం వల్ల గాలి కాలుష్యమవడమే కాకుండా, క్యాన్సర్ లాంటి ప్రాణాంతక వ్యాధులు వస్తున్నాయి. వేడి టీని ప్లాస్టిక్ కవర్లలో పార్సిల్ కట్టించుకుని తాగడం అత్యంత ప్రమాదకరమని హెచ్చరించారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ పారేయకుండా తడి, పొడి మరియు హానికరమైన వ్యర్థాలను వేరు చేయడానికి '4 బిన్' విధానంపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఇంటి వద్దే వచ్చే కూరగాయల వ్యర్థాలతో సేంద్రీయ ఎరువుగా మార్చుకునే ప్రక్రియను ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలన్నారు.

**పారిశ్రామిక ప్రాంతంలో పచ్చదనం:** మన పశ్చిమ నియోజకవర్గ పరిధి పారిశ్రామిక ప్రాంతం కావడం వల్ల ఒకవైపు ఉపాధి ఉన్నప్పటికీ, మరోవైపు కాలుష్య సమస్య ఉంది. దీనిని అధిగమించడానికి పరిశ్రమల చుట్టూ, మైదానాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటి గ్రీన్ కవర్ పెంచాలని పిలుపునిచ్చారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం : ఎమ్మెల్యే ఆదిరెడ్డి

రాజమహేంద్రవరం (చైతన్యరథం): ప్రతి వారం నిర్వహిస్తున్నట్లుగానే రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గ పరిధిలోని 3 మరియు 4 డివిజన్ల ప్రజల సమస్యల పరిష్కారానికి రాజేంద్రనగర్ 16 కుళాయిల సెంటర్ సచివాలయం వద్ద ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏపీ శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నక్కా చిట్టిబాబు సంయుక్త ఆధ్వర్యంలో, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా దేవి వర ప్రసాద్ పర్యవేక్షణలో, టీడీపీ నగర అధ్యక్షులు మజ్జి రాంబాబు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పెన్షన్లు, రేషన్ కార్డులు, ప్రభుత్వ ఇళ్లు, ఇళ్ల స్థలాలు, వివిధ సంక్షేమ పథకాల అమలుకు సంబంధించిన సమస్యలపై ప్రజలు తమ వినతిపత్రాలను ఎమ్మెల్యే వాసుకు అందజేశారు. వాటిని సంబంధిత శాఖల అధికారులకు సిఫార్సు చేసి, త్వరితగతిన పరిష్కారాలు చూపించాలని సూచించారు.

## స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రతో నరసన్నపేటని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాం

నరసన్నపేట (చైతన్యరథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో నరసన్నపేటలో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర-–స్వర్ణాంధ్ర కార్యక్రమం రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచిందని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి గారు అన్నారు. ఈ కార్యక్రమం విజయవంతంగా జరగడం నరసన్నపేట నియోజకవర్గం ప్రజలకు గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ.. స్వచ్ఛమైన గ్రామాలు, పరిశుభ్రమైన నిర్మాణమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు మ.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధిని కేవలం మౌలిక సదుపాయాలకే పరిమితం చేయకుండా, ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన పెంచే దిశగా స్వచ్ఛాంధ్ర––స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని తీసుకొచ్చారని తెలిపారు. నరసన్నపేట నియోజకవర్గ ప్రజలు పరిశుభ్రత కార్యక్రమాలకు ఎప్పుడూ ముందుంటారని, అదే స్ఫూర్తితో ఈరోజు కార్యక్రమాన్ని విజయవంతం చేశారని అన్నారు. శ్రీకాకుళం జిల్లా రాష్ట్రంలోనే స్వచ్ఛతలో నంబర్ వన్ స్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం నిధులు ఇస్తే అభివృద్ధి జరుగుతుంది. కానీ ప్రజలు స్వచ్ఛతను అలవాటు చేసుకుంటే అదే నిజమైన సంపద అని ఆయన పేర్కొన్నారు.

## ఇండోర్ స్టేడియం ప్రారంభించిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



విశాఖపట్నం (చైతన్యరథం): జీవీఎంసీ 6వ వార్డు పరిధిలోని పీఎం పాలెం అశోక్‌నగర్ పార్కులో రూ.40 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన స్టేడియాన్ని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శనివారం ప్రారంభించారు. పీపీపీ మోడల్ లో ప్రతిపాదించిన స్టేడియానికి దిడ్ల అశోక్ కుమార్ రూ.25 లక్షలు సమకూర్చగా.. అశోక్ నగర్ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ రూ.15 లక్షలు అందజేసింది. కార్యక్రమంలో అశోక్ నగర్ ఎస్సీ,ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బత్తుల గౌతంబాబు ప్రతినిధులు కెవిఆర్ పట్నాయక్, గంటి మోహనరావు బి.ఎస్.ఎన్. మూర్తి, జోనల్ కమిషనర్ అయ్యప్ప నాయుడు ఏఎమ్ఓహెచ్ రవికుమార్, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, గరే గురునాథ్, లొడగల జానకి రామ్, దాసరి శ్రీనివాస్, మొల్లి లక్ష్మణరావు, పిల్లా వెంకట్రావు, లొడగల అప్పారావు, చెట్టుపల్లి గోపి, బోయి శ్రీనివాసు, నాగోతి వెంకట సత్యనారాయణ, కానూరు అచ్యుతరావు, నాగోతి సూర్యప్రకాష్, పిల్లా మోహన్ కృష్ణ, గొల్లంగి ఆనందబాబు, పోతిన ప్రసాద్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కోళ్ల చొరవతో కన్యకాపరమేశ్వరి ఆలయ అభివృద్ధికి రూ.20 లక్షల టీటీడీ నిధులు



ఎస్.కోట (చైతన్యరథం): ఎస్.కోట పట్టణంలోని అత్యంత పురాతన, మహిమాన్విత శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ అభివృద్ధి పనుల నిమిత్తం తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) 'శ్రీవాణి ట్రస్ట్' నుండి రూ. 20 లక్షల నిధులు మంజూరయ్యాయి. స్థానిక శాసనసభ్యురాలు కోళ్ల లలితకుమారి ప్రత్యేక చొరవ, కృషితో ఈ నిధులు మంజూరు కావడం పట్ల నియోజకవర్గ వ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఆలయ అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు సాధించినందుకు గాను శనివారం ఎల్.కోట మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వాసవి క్లబ్ ప్రతినిధులు, ఆర్యవైశ్య సంఘం ప్రముఖులు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు శాలువా కప్పి, పూలమాలలతో ఘనంగా సత్కరించి, ఆర్యవైశ్య సమాజం తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

**ఆధ్యాత్మిక క్షేత్రాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది : ఎమ్మెల్యే:**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి మాట్లాడుతూ.. మంజూరైన రూ. 20 లక్షల నిధులు అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి, ఇక్కడికి వచ్చే భక్తుల సౌకర్యార్థం మౌలిక వసతుల కల్పనకు ఎంతో దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని అన్ని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రాలను, పురాతన ఆలయాలను అభివృద్ధి పరిచేందుకు మరియు ప్రజా సంక్షేమానికి తమ కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. నియోజకవర్గ ప్రజలపై, ముఖ్యంగా ఎస్.కోట నివాసితులపై శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆశీస్సులు సదా ఉండాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ సభ్యులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు, ముఖ్య నేతలు మరియు స్థానిక ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ చాటిన ఎస్టీ విద్యార్థులకు ఎంపీ లావు అభినందనలు

**●600 పైబడి మార్కులు సాధించిన 287 మంది విద్యార్థులకు విజ్ఞాన్ యూనివర్సిటీలో ఉచిత విద్యావకాశం**



నరసరావుపేట (చైతన్యరథం): ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ ఒక్క ఎస్టీ విద్యార్థి కూడా ఉన్నత చదువులకు దూరం కాకూడదన్నదే తమ సంకల్పమని నరసరావుపేట పార్లమెంటు సభ్యులు శ్రీ లావు శ్రీకృష్ణదేవరాయలు స్పష్టం చేశారు. ఇంటర్మీడియట్ పరీక్షల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన పల్నాడు జిల్లా ఎస్టీ విద్యార్థులకు నరసరావుపేటలోని ఎస్.ఎస్.ఎన్ కళాశాలలో ఘనంగా అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంపీ... జిల్లా వ్యాప్తంగా వివిధ గ్రూపుల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన ఎస్టీ ప్రతిభావంతులను ప్రత్యేకంగా అభినందించి, సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ.. పల్నాడు జిల్లా వ్యాప్తంగా ఇంటర్‌లో 600 పైబడి మార్కులు సాధించిన 287 మంది షెడ్యూల్డ్ తెగలకు చెందిన విద్యార్థులకు విజ్ఞాన్ యూనివర్సిటీలో ఉచితంగా సీటు కల్పించి, ఉచిత విద్యనందిస్తామని హామీ ఇచ్చారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని తల్లిదండ్రులు పిల్లల చదువులను మధ్యలోనే ఆపేసే పరిస్థితి రాకూడదని, ధైర్యంగా పైచదువులకు పంపాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా 346 మంది ఎస్టీ విద్యార్థులు ఉత్తీర్ణులు అవ్వగా.. అందులో ఏకంగా 287 మంది (83% పైగా) ఫస్ట్ క్లాస్‌లో ఉత్తీర్ణత సాధించడం జిల్లాకే గర్వకారణమని ఎంపీ గారు కొనియాడారు. ఇంతటి ఘన విజయానికి కారకులైన విద్యార్థులకు, రాత్రింబవళ్లు కష్టపడి వారికి మార్గదర్శకత్వం వహించిన ఉపాధ్యాయులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

**కనీసం డిగ్రీ వరకు చదివించాలి..**

ఎస్టీ కుటుంబాల నుంచి ఒక్కో గ్రామానికి కనీసం నలుగురు చొప్పున చదువుకొని ఉన్నత స్థాయిల్లో స్థిరపడాలన్నదే తమ కోరికని ఎంపీ ఆకాంక్షించారు. వారిని చూసి గ్రామంలోని మరో పది మంది స్ఫూర్తి పొంది చదువుకుంటారని చెప్పారు. ఎస్టీ విద్యార్థులు కనీసం డిగ్రీ వరకైనా పూర్తి చేస్తే ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం చాలా సులువవుతుందని, కాబట్టి తల్లిదండ్రులు పిల్లలను డిగ్రీ పూర్తయ్యే వరకు ఖచ్చితంగా ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ఇదే వేదికపై నరసరావుపేట పరిసర ప్రాంతాల విద్యార్థుల సౌకర్యార్థం ఒక కొత్త ప్రభుత్వ జూనియర్ కాలేజీని ఏర్పాటు చేయాలని స్థానిక ఉపాధ్యాయులు.. ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎంపీ... నరసరావుపేటలో జూనియర్ కాలేజీ ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని మాటిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అనారోగ్యంతో బాధపడుతున్న యువతికి ఎంపీ సహాయం

**●ఆమె పరిస్థితిని చూసి చలించి, ఆర్థిక సహాయం అందించడంతో పాటు, మెరుగైన వైద్యం అందించే ఏర్పాటు చేయించిన ఎంపీ పుట్టా మహేష్**



ఏలూరు (చైతన్యరథం): ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ మరోసారి తన మానవత్వాన్ని చాటుకున్నారు. నూజివీడు మండలం 'పొలసానిపల్లి' గ్రామానికి చెందిన 25 సంవత్సరాల స్వాతి అనే యువతి తీవ్రమైన ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతోంది. గత కొంతకాలంగా విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకుంటున్నప్పటికీ ఆరోగ్యం మెరుగుపడలేదు. ఈ పరిస్థితుల్లో తల్లీ తండ్రి లేని ఆమె, తన పెదనాన్నను తోడుగా తీసుకుని శుక్రవారం రాత్రి ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌ను ఆయన నివాసంలో కలిసి తన ఆరోగ్య, ఆర్థిక పరిస్థితులను వివరించింది. తీవ్ర ఆయాసంతో, మాట్లాడటానికి కూడా ఇబ్బంది పడుతూ తన సమస్యను చెబుతున్న ఆమె పరిస్థితిని చూసి ఎంపీ చలించారు. 25 ఏళ్ల వయసున్న ఆమె ఊపిరితిత్తుల వ్యాధితో శరీరం ఎముకల గూడులా మారడంతో 10 ఏళ్ల బాలిక స్థాయికి శరీరం కృశించిపోయింది. ఆమె పరిస్థితిని చూసి చలించిపోయిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్ వెంటనే అప్పటికప్పుడు తక్షణ ఆర్థిక సహాయంగా 20 వేల రూపాయలు అందించడమే కాకుండా ఆమెకి మెరుగైన వైద్యం అందించే ఏర్పాట్లు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కొద్ది సమయం కూడా నిలబడలేకపోతున్న స్వాతి పరిస్థితిని గమనించి, ఒక మూడు చక్రాల వాహనాన్ని కూడా అందిస్తానని హామీ ఇచ్చిన ఎంపీ, ప్రభుత్వంతో మాట్లాడి ప్రత్యేక కేటగిరీ కింద పెన్షన్ ఇప్పించే ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. ధైర్యంగా ఉంటూ మెరుగైన వైద్యం చేయించుకోవాలని ఆమెకు సూచించారు. పేదరికం కారణంగా వైద్యం చేయించుకోలేని పరిస్థితి రాష్ట్రంలో ఎవరికీ రాకూడదనే ధ్యేయంతో కూటమి ప్రభుత్వం వైద్య రంగంపై దృష్టి పెట్టి ప్రభుత్వ ఆసుపత్రులను అభివృద్ధి చేయడంతో పాటు ప్రజలకు అనేక ఉచిత వైద్య పథకాలు తీసుకువచ్చిందన్నారు ఎంపీ పుట్టా మహేష్ కుమార్. సహాయం కోసం ఇప్పటి వరకూ ఎంతోమంది నాయకుల వద్దకు వెళ్లినప్పటికీ ఈ విధమైన సహాయం, భరోసా ఎక్కడా లభించలేదని చెబుతూ ఆ యువతి, ఆమె పెదనాన్న ఇద్దరూ ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌కు కన్నీటితో కృతజ్ఞతలు తెలిపారు.

# జీవనశైలినుంచి ప్లాస్టిక్ భూతాన్ని తరిమేద్దాం

**●స్వచ్ఛాంధ్రతోనే స్వర్ణాంధ్ర : ఎమ్మెల్యే వేగుళ్ళ**



మండపేట (చైతన్యరథం): పర్యావరణాన్ని పరిరక్షించాలంటే ప్లాస్టిక్ భూతాన్ని తరిమేయాలని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ ఎక్కువగా వినియోగిస్తే ప్రజలు క్యాన్సర్ బారిన పడే ప్రమాదముందని హెచ్చరించారు. స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే వేగుళ్ళ మండపేట పట్టణంలోని 20వ వార్డులో పర్యటించారు. ఈ సంధర్భంగా పారిశుధ్య సిబ్బందితో కలిసి పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... స్వర్ణాంధ్ర సాధించాలంటే ముందు స్వచ్ఛాంధ్ర సాధించాలన్నారు. స్వచ్ఛాంధ్ర లక్ష్య సాధనలో ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. పర్యావరణాన్ని మనం కాపాడుకుంటే ఆరోగ్యంగా ఉంటామని అందుకు చెట్లు విరివిగా నాటండని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. అనంతరం సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మెప్మా ఆర్.పి.లు, మున్సిపల్ సిబ్బంది ఈ ర్యాలీలో పాల్గొని ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ గడి సత్యవతి, మేడింటి సూర్యప్రకాష్, మేడింటి కమలకుమారి, పట్టణ టీడీపీ మాజీ అధ్యక్షులు ఉంగరాల రాంబాబు, బిజెపి సీనియర్ నాయకులు కోన సత్యనారాయణ, గోడవర్తి రామచంద్రరావు, అమలాపురం పార్లమెంట్ అధికార ప్రతినిధి దేవు శ్రీను, కాశిన కాశీ విశ్వనాధం, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

# టిడ్కో ఇళ్ల కోసం డీడీలు చెల్లించిన వారికి వడ్డీతో సహా నగదు వెనక్కి

**●లబ్ధిదారులకు ఇళ్ళు నిర్మించి ఇస్తాం : ఎమ్మెల్యే బడేటి చంటి**



ఏలూరు (చైతన్యరథం): అసెంబ్లీ నియోజకవర్గంలో టిడ్కో ఇళ్ల కోసం గతంలో డీడీలు చెల్లించి, ఇళ్లు పొందని లబ్ధిదారులకు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్యే బడేటి చంటి శుభవార్త చెప్పారు. లబ్ధిదారులు డీడీల రూపంలో చెల్లించిన దరఖాస్తు సొమ్మును తిరిగి వారి బ్యాంక్ ఖాతాలకు జమచేసే ప్రక్రియను ఈ నెల 20వ తేదీ బుధవారం నుండి ఏలూరులో ప్రారంభించనున్నట్లు ఆయన వెల్లడించారు. శనివారం స్థానికంగా నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న ఎమ్మెల్యే బడేటి చంటి... ఆ వేదికపై నుండి ఇదేఅంశంపై టిడ్కో ఇళ్ళ లబ్దిదారులకు కీలక సందేశాన్నిచ్చారు. గతంలో టిడ్కో ఇళ్ళ నిమిత్తం 35వేల రూపాయలు డీడీల రూపంలో చెల్లించిన వారిలో కొందరికి ఆ మొత్తాలను తిరిగి వారి బ్యాంక్ ఖాతాలకు జమయ్యేలా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. అప్పటి కాంట్రాక్టర్ కొందరి వద్ద నుండి 35వేల రూపాయలు తీసుకున్నాడని, వాళ్ళందరికీ కూడా ఇళ్ళు నిర్మించి ఇస్తామని, వారి బ్యాంక్ ఖాతాలకు ప్రభుత్వం నుండి 50వేల రూపాయలు జమకానున్నాయన్న ఆయన... ఆ మొత్తం నుండి 35వేల రూపాయలను లబ్దిదారులు డీడీ సొమ్ముల స్థానే తీసుకుని మిగిలిన 15వేల రూపాయలను తిరిగి కాంట్రాక్టర్‌కు చెల్లించాలని సూచించారు. అదేసమయంలో సచివాలయాల్లో కూడా లబ్దిదారులు సొమ్ములు చెల్లించారన్న ఎమ్మెల్యే బడేటి చంటి... వాటిపై వచ్చే వడ్డీతో అవి కూడా తిరిగి చెల్లించనున్నట్లు తెలిపారు. కాగా ఈ బుధవారం లోపుగా సంబంధిత లబ్దిదారులంతా తమ దగ్గర్లోని సచివాలయాలకు వెళ్ళి సంబంధిత పత్రాలు సరిగా ఉన్నదీ, లేనిదీ సరిచూసుకోవాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి టిడ్కో ఇళ్ళ లబ్దిదారులకు సూచించారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యం



భీమడోలు (చైతన్యరథం): ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, వైసీపీ పాలనలో అస్తవ్యస్తమైన పరిపాలనను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చక్కదిద్ది ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారని అందులో భాగంగా ప్రతి శనివారం ప్రజల నుంచి నియోజకవర్గాల్లో అర్జీలు స్వీకరిస్తున్నామని రాష్ట్ర ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు వ్యాఖ్యానించారు. శనివారం భీమడోలు క్యాంపు కార్యాలయంలో జరిగిన కేడర్ సమావేశంలో పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం మరికొన్ని సమస్యలను నేరుగా అధికారులతో చరవాణిలో మాట్లాడి పరిష్కారానికి కృషి చేశారు. ప్రధానంగా భీమడోలు రైతులు రైల్వే ట్రాక్ ఆనుకుని పంట పొలాలు వరదలు వచ్చినపుడు మునిగిపోతున్నాయని, రైల్వేస్టేషన్ నుంచి అయ్యప్పస్వామి గుడి వద్ద ఉన్న టన్నల్ వరకు పూడిక తీయించి రైతులను ఆదుకోవాలని వినతి పత్రం అందజేశారు. ఈ సంధర్భంగా గన్ని మాట్లాడుతూ... ఇది రైల్వే డిపార్ట్‌మెంట్‌కు సంబందించిన భూమి కావున ఎంపి పుట్టా మహేష్ దృష్టికి తీస్కువెళ్ళి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు మరియు మండల నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

# గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడం పంచాయతీ కార్యదర్శుల బాధ్యత

**●దుగ్గిరాలలో స్ఫూర్తినిచ్చిన 'స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర'... స్వయంగా ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించిన దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్**



దెందులూరు (చైతన్యరథం): రాష్ట్ర ప్రభుత్వం ప్రతి శనివారం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణ ఆంధ్ర" కార్యక్రమంలో భాగంగా పెదవేగి మండలం దుగ్గిరాల గ్రామంలో శనివారం ఉదయం ముమ్మర పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. ఈ శ్రమదాన కార్యక్రమంలో దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొని స్వయంగా క్షేత్రస్థాయిలోకి దిగారు.

**పారిశుద్ధ్య శ్రామికులతో కలిసి ఎమ్మెల్యే శ్రమదానం:**

ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కేవలం ప్రసంగాలకో, ఫోటో ఫోజులకే పరిమితం కాకుండా, స్వయంగా పారిశుద్ధ్య శ్రామికులతో కలిసి నడిచారు. బహిరంగ ప్రదేశాలలో, రోడ్ల పక్కన పడేసి ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలు, కవర్లను ఆయన స్వహస్తాలతో సేకరించారు. అనంతరం ఆ చెత్తను పంచాయతీ ట్రాక్టర్లు, వ్యర్థాల తరలింపు వాహనాల ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలించేలా పర్యవేక్షించారు. ఎమ్మెల్యే గారే స్వయంగా రోడ్లు ఊడుస్తూ, చెత్త ఏరుతుండటం చూసి స్థానికులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో శ్రమదానంలో భాగస్వాములయ్యారు.

**అధికారులకు స్పష్టమైన ఆదేశాలు:**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్థానిక అధికారులతో సమీక్షించారు. గ్రామాల్లో ఎక్కడికక్కడ బహిరంగంగా ప్లాస్టిక్ వ్యర్థాలు పడకుండా చూడాల్సిన పూర్తి బాధ్యత స్థానిక పంచాయతీ కార్యదర్శులదేనని స్పష్టం చేశారు. గ్రామాలను పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణంతో ఉంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రజల్లో విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

**ఉత్తమ పౌరులుగా ముందుకు సాగాలి:**

అనంతరం ప్రజలను ఉద్దేశించి ఎమ్మెల్యే చింతమనేని మాట్లాడుతూ.. "పరిశుభ్రత అనేది కేవలం ప్రభుత్వం లేదా పారిశుద్ధ్య కార్మికుల బాధ్యత మాత్రమే కాదు, అది ప్రతి ఒక్కరి స్వీయ బాధ్యత. ప్రజలు ఇళ్లలోని చెత్తను బహిరంగ ప్రదేశాల్లో, కాల్వల్లో పడేయడం మానుకోవాలి. ప్రతి ఒక్కరూ సామాజిక స్పృహ కలిగి ఉన్నప్పుడే స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్, స్వర్ణ ఆంధ్రప్రదేశ్‌గా మారుతుందని, సమాజంలో ఉత్తమ పౌరులుగా మన వంతు పాత్ర పోషించాలని" పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, పంచాయతీ సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

# పెట్టుబడులపై వైసీపీ దమ్ముంటే చర్చకు రావాలని సవాల్

**●ఆంధ్రప్రదేశ్లో పెట్టుబడుల వెల్లువ : దాసరి శ్యామ్ చంద్ర శేషు**



జంగారెడ్డిగూడెం (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ పెట్టుబడుల గమ్యస్థానంగా మారిందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్ర శేషు అన్నారు. జంగారెడ్డిగూడెంలోని పట్టణ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో నారా లోకేష్ చొరవతో కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ అంటే అభివృద్ధికి చిరునామగా మారుస్తుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఒకపక్క సూపర్ సిక్స్‌తో సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తూనే మరొకపక్క అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని ఆయన తెలియజేశారు. భారతదేశానికి 100 రూపాయల పెట్టుబడి వస్తే దానిలో 26 రూపాయలు వాటా ఆంధ్ర రాష్ట్రానికి వస్తుందంటే చంద్రబాబు నాయుడు తాలూకా విజన్ నారా లోకేష్ చొరవ సుస్పష్టంగా కనిపిస్తుందని అన్నారు. విదేశీ పెట్టుబడులు ఆకర్షణలో ఆంధ్ర రాష్ట్రం అగ్రస్థానంలో ఉందని దానికి ఉదాహరణ గూగుల్ డేటా సెంటర్ ఆర్సెల్లార్ మీత్తల్ స్టీల్ ప్లాంట్, క్యారియర్ ఏసి మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్, కాగ్నిజెంట్, టి సి ఎస్ నిన్న పుట్టపర్తిలో శంకుస్థాపన చేసిన అడ్వాన్సుడ్ కాంబట్ ఎయిర్ క్రాఫ్ట్ యూనిట్ అదే విధంగా హీరో ఫ్యూచర్స్ కాకినాడలో ఏ ఎమ్ గ్రీన్ అమోనియం అదే విధంగా అనకాపల్లిలో 5400 కోట్లతో రెన్యూ ఎనర్జీ, శ్రీసిటీలో ఐదువేల కోట్లతో ఎల్జి, సెమీ కండక్టర్స్ ఇలా అనేక కంపెనీలు పరిశ్రమలు ఆంధ్ర రాష్ట్రానికి క్యూ కడుతున్నాయని తెలియజేశారు.

# ప్రజల భాగస్వామ్యంతోనే పరిశుభ్ర గుంటూరు సాధ్యం

**● స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి**



గుంటూరు (చైతన్యరథం): గుంటూరు నగర ప్రజల భాగస్వామ్యంతోనే పరిశుభ్ర గుంటూరు సాధ్యమని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. శనివారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 20వ డివిజన్ కొబ్బరితోటలో ఉన్న జీఎంసీ ప్లాంట్స్ డబ్ల్యూ.హెచ్.ఈ, శానిటరీ వేస్ట్ షెడ్ మరియు ఘన వ్యర్థాల శుద్ధి కేంద్రాన్ని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి సందర్శించారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా తడి చెత్త, పొడి చెత్త, ఈ-వేస్ట్ నిర్వహణ, కంపోస్టింగ్ విధానాలు, పారిశుద్ధ్య మౌలిక సదుపాయాలు మరియు వ్యర్థాల శుద్ధి ప్రక్రియలను పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రంలో జరుగుతున్న పనుల పురోగతి, చెత్త వర్గీకరణ ప్రక్రియ, పారిశుద్ధ్య నిర్వహణలో ఎదురవుతున్న సవాళ్లు, సిబ్బంది పనితీరు తదితర అంశాలపై అధికారులతో మరియు పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. పారిశుద్ధ్య కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటున్న కార్మికులను ఎమ్మెల్యే సత్కరించారు. అనంతరం నాయకులు, కార్మికులు, ప్రజలతో కలిసి స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు.

# డివిజన్లో ప్రతి సమస్యను పరిష్కరిస్తాం

**●విజయవాడ ప్రజా దర్బార్‌కు పోటెత్తిన ప్రజా సమస్యలు**



విజయవాడ (చైతన్యరథం): విజయవాడ పశ్చిమ నియోజకవర్గం 55వ డివిజన్లో ఎంపీ కేశినేని చిన్ని ఆదేశాల మేరకు ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నూర్ బాషా కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మేరా, గ్రంథాలయ చైర్మన్ ఎం.ఎస్ బేగ్ పాల్గొని ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారిరువురు మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల దగ్గర నుండి లేరుగా సమస్యలు తెలుసుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్ లాంటి కార్యక్రమాలను విజయవాడ పార్లమెంట్లో అమలు చేస్తున్న ఎంపీ కేశినేని చిన్నికి ముందుగా కృతజ్ఞతలు తెలియజేశారు సమస్యలతో ఇబ్బంది పడుతున్న ప్రజానీకానికి ఎక్కడికి వెళ్లాలో తెలియక అధికారులు చుట్టూ తిరగలేక ఇబ్బందులు పడుతున్న క్రమంలో ప్రజాదర్బార్ లాంటి కార్యక్రమం ప్రతి డివిజన్లో ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉండడంతో పాటు నాయకులు స్థానిక అధికారులు ఒకే చోట ఉండడంతో ప్రజల సమస్యలు త్వరగా పరిష్కారం అవ్వడానికి దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో నూర్ భాషా కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మీరా గ్రంథాలయా చైర్మన్ ఎంఎస్ బేగ్ జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు కొట్టేటి హనుమంతరావు జిల్లా అధికార ప్రతినిధి రేగళ్ల లక్ష్మణరావు క్లస్టర్ ఇంచార్జ్ ధనేకుల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# ఇంధన భద్రతతో పర్యావరణంతో పాటు..

## ప్రజారోగ్యానికి మేలు : ఎమ్మెల్యే ప్రత్తిపాటి



చిలకలూరిపేట (చైతన్యరథం): దేశ ఆర్థిక భద్రత.. ప్రజల శ్రేయస్సు కోసమే ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు సహా ప్రధాన నాయకులందరూ పొదుపు చర్యల్లో భాగస్వాములు అవుతున్నారని, వారి ఆలోచనల గొప్పతనం, ఇప్పుడు తెలియకపోయినా భవిష్యత్‌లో ఊహించని ఉత్తమ ఫలితాలు అందిస్తుందని శాసనసభ్యులు, టీడీపీ జోనల్ కో ఆర్డినేటర్ ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. శనివారం ఆయన పట్టణంలో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంధన భద్రతలో భాగంగా తన నివాసం నుంచి ఎలక్ట్రికల్ స్కూటీపై కార్యక్రమానికి బయలుదేరిన ప్రత్తిపాటి.. దాదాపు 20 కి.మీ.లకు పైగా ప్రయాణించి, పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్ని స్వయంగా పరిశీలించారు.అనంతరం స్థానిక రైతుబజార్లో నిర్వహించిన స్వచ్ఛాంధ్రలో పాల్గొని, ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలు, వ్యాపారులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం యావత్ దేశం ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న వేళ.. టీడీపీకి ప్రతిష్ఠాత్మక కార్యక్రమం.. గొప్ప పసుపు పండుగ అయిన మహానాడు నిర్వహణ విషయంలో అధినాయకత్వం సమయోచిత నిర్ణయం తీసుకుందని ప్రత్తిపాటి చెప్పారు. హైబ్రిడ్ మోడల్ మహానాడు నిర్వహణతో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవడానికి మంచి అవకాశం దొరుకుతుందన్నారు.

# జగ్గయ్యపేట 'ఎర్ర కాలువ' ప్రక్షాళనకు రూ.5.60 కోట్లు భారీ కేటాయింపు

జగ్గయ్యపేట (చైతన్యరథం): పట్టణ నడిబొడ్డున ఎన్నో ఏళ్లుగా ప్రజలను పీడిస్తున్న 'ఎర్ర కాలువ' సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. ఎర్ర కాలువ ఆధునికీకరణ, ప్రక్షాళన మరియు ఇరువైపులా పటిష్టమైన రక్షణ గోడల నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మున్సిపాలిటీ ద్వారా రూ.5 కోట్ల 60 లక్షల భారీ నిధులను కేటాయించింది. శనివారం జగ్గయ్యపేట మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర ఈ నిధుల విడుదలకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ చారిత్రాత్మక నిర్ణయంపై పట్టణ ప్రజలు, ముఖ్యంగా కాలువ చుట్టుపక్కల నివసించే ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. "ఎర్ర కాలువ పక్కన నివసించే ప్రజలు పడుతున్న నరకయాతన నాకు బాగా తెలుసు. దశాబ్దాలుగా ఈ కాలువలోని మురికి నీరు, పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల తీవ్రమైన దుర్వాసన వస్తోంది. దోమల బెడదతో చిన్న పిల్లలు, వృద్ధులు తరచూ డెంగ్యూ, మలేరియా వంటి ప్రాణాంతక వ్యాధుల బారిన పడుతున్నారు. వర్షాకాలం వస్తే కాలువ ఉప్పొంగి ఇళ్లలోకి మురికి నీరు చేరి ప్రజలు రాత్రంతా నిద్రలేని గడుపుతున్నారు. ఈ దయనీయ స్థితిని మార్చాలని నేను గట్టిగా సంకల్పించాను. అని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య వ్యాఖ్యానించారు.

# పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత : వేగేశన నరేంద్ర వర్మ




బాపట్ల (చైతన్యరథం): పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, పరిశుభ్రమైన వాతావరణంతోనే ఆరోగ్యకరమైన సమాజం సాధ్యమవుతుందని బాపట్ల నియోజకవర్గ శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమంలో భాగంగా, బాపట్ల పట్టణంలోని 19వ వార్డు మార్కెట్ బజారులో శనివారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు స్వయంగా చేత్తో ఊడ్చి, చెత్తను తొలగించి స్థానికుల్లో స్ఫూర్తి నింపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... బాపట్ల నియోజకవర్గాన్ని పచ్చదనం, పరిశుభ్రతలో ఆదర్శంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు. మార్కెట్ బజారు వంటి వ్యాపార ప్రాంతాల్లో చెత్తాచెదారం రోడ్లపై వేయకుండా, మున్సిపల్ వాహనాలకు మాత్రమే అందించాలని వ్యాపారస్తులకు, ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్లాస్టిక్ రహిత బాపట్ల కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. వార్డుల్లో డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదలకు, నిరంతర పారిశు ధ్య పనుల పర్యవేక్షణకు మున్సిపల్ అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజల భాగస్వామ్యం లేనిదే ఏ కార్యక్రమమూ విజయవంతం కాదు. 'స్వచ్ఛ ఆంధ్ర' కేవలం ఒక ప్రభుత్వ కార్యక్రమం కాదు, అది మన ఇంటి బాధ్యతగా ప్రతి ఒక్కరూ భావించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ, ప్రజలు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దేందుకు చర్యలు : ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు



వేమూరు (చైతన్యరథం): రాష్ట్రాన్ని ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అందులో భాగంగానే నెలలో మూడో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు వ్యాఖ్యానించారు. నియోజకవర్గంలోని భట్టిప్రోలు మండలం భట్టిప్రోలు గ్రామంలో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. భట్టిప్రోలు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే... పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ మరియు ప్రజల్లో అవగాహన పెంపుపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. అధికారులు, సిబ్బందితో కలిసి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. అనంతరం భట్టిప్రోలు మండలం మార్కెట్ యార్డ్‌లోని పీఏసీఎస్ సొసైటీ వద్ద నిర్వహించిన "మీకోసం - ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (PGRS)" కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుండి వచ్చిన ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకొని, సంబంధిత అధికారులతో చర్చించి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమానికి కూటమి నాయకులు, రైతులు, పార్టీ కార్యకర్తలు, గ్రామ మరియు మండల స్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అనంతరం భట్టిప్రోలులోని అన్నా క్యాంటీన్‌ను పరిశీలించిన నక్కా ఆనందబాబు అక్కడ అందిస్తున్న భోజన నాణ్యత, పరిశుభ్రత మరియు ప్రజలకు అందుతున్న సేవలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అన్నా క్యాంటీన్‌లో ప్రజలతో కలిసి భోజనం చేశారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.

# ఇంధన పొదుపుతో మహానాడు.. రాజకీయాల్లో టీడీపీ కొత్త ట్రెండ్!

**●"సంక్షేమం- అభివృద్ధి" ద్విచక్రంతో ప్రజల్లోకి వెళ్లాలి : దేవినేని ఉమా**



గుంటూరు (చైతన్యరథం): ఇంధన పొదుపు చర్యలకు ప్రాధాన్యత ఇస్తూ తెలుగుదేశం పార్టీ మహానాడును ఈసారి హైబ్రిడ్ మోడ్‌లో నిర్వహించడం భారత రాజకీయాల్లో కొత్త ట్రెండ్‌కు నాంది పలుకుతోందని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావు పేర్కొన్నారు. ప్రధాని నరేంద్రమోదీ సూచించిన ఇంధన పొదుపు, ఖర్చుల నియంత్రణ చర్యలను ఆచరణలో అమలు చేస్తూ టీడీపీ వినూత్న నిర్ణయం తీసుకుందని ఆయన అన్నారు. శనివారం మంగళగిరి కేంద్ర టీడీపీ కార్యాలయంలో జరిగిన యూనిట్, క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌ల శిక్షణా తరగతుల్లో పాల్గొన్న దేవినేని ఉమామహేశ్వరరావు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను గ్రామ స్థాయిలో మరింత బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా కార్యకర్తలు పనిచేయాలని సూచించారు. "ప్రజల విశ్వాసమే పార్టీకి అసలైన బలం" అని పేర్కొంటూ, ప్రతి ఇంటికీ ప్రభుత్వం చేసిన మేలు చేరేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. సూపర్ సిక్స్ హామీలతో పాటు ప్రజల అవసరాలకు అనుగుణంగా అంతకంటే ఎక్కువ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని దేవినేని ఉమా వివరించారు. మహిళలు, యువత, రైతులు, ఉద్యోగులు, పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రయోజనాలను స్పష్టంగా ప్రజలకు వివరించాలని సూచించారు. పార్టీ కార్యకర్తలు సోషల్ మీడియా, డిజిటల్ వేదికలను సమర్థంగా వినియోగించుకోవాలని, ప్రభుత్వ పనితీరును వాస్తవాలతో ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. మహానాడు కేవలం పార్టీ కార్యక్రమం మాత్రమే కాదని, భవిష్యత్ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి దిశను నిర్దేశించే వేదికగా నిలవబోతుందని పేర్కొన్నారు. ఇంధన పొదుపు, సమయ నిర్వహణ, సాంకేతిక వినియోగం కలగలిపిన హైబ్రిడ్ మహానాడు నిర్వహణతో దేశ రాజకీయాల్లో టీడీపీ మరోసారి ఆదర్శంగా నిలుస్తోందని పార్టీ శ్రేణులు అభిప్రాయపడుతున్నాయి.

# చురుగ్గా సీఎం చంద్రబాబు పర్యటన ఏర్పాట్లు

## వివిధ శాఖల అధికారులతో సమీక్షించిన ఎమ్మెల్యే కావ్య, కలెక్టర్ శుక్లా



తుమ్మలపెంట (చైతన్యరథం): కావలి మండలం తుమ్మలపెంట గ్రామంలో ఈనెల 19న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన నేపథ్యంలో జరుగుతున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల గారు, కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి గారు శనివారం అన్ని శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ముఖ్యమంత్రి పాల్గొనే "మత్స్యకార సేవలో" కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి చేపడుతున్న ఏర్పాట్లపై వారు అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా సభా ప్రాంగణం, హెలిప్యాడ్, పార్కింగ్ స్థలాలు, వీఐపీ మార్గాలు, ప్రజల రాకపోకలకు సంబంధించిన మార్గాలు,తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, వైద్య సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. సభకు భారీగా ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి శాఖ సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.సీఎం పర్యటనను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని, ముఖ్యంగా మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజల్లో మరింత విశ్వాసం పెరిగేలా కార్యక్రమం ఉండాలని కలెక్టర్ హిమాన్షు శుక్ల తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, తాగునీటి పంపిణీ, నీడ ఏర్పాట్లు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు మత్స్యకారుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. "మత్స్యకార సేవలో " కార్యక్రమం ద్వారా వేలాది మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. సీఎం సభను కావలి నియోజకవర్గ ప్రజలు పండుగలా నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారని అన్నారు. అధికారులు,ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సభా ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న వేదిక పనులు, మీడియా గ్యాలరీ, కంట్రోల్ రూమ్, పోలీస్ భద్రతా ఏర్పాట్లు, అత్యవసర సేవల అందుబాటు తదితర అంశాలను కూడా కలెక్టర్, ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు..




# పరిశుభ్రమైన సమాజం కోసం నడుం కట్టాలి

## ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పిలుపు

వింజమూరు (చైతన్యరథం): వింజమూరు మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన "స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర" కార్యక్రమంలో ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ పాల్గొన్నారు. పరిశుభ్రమైన సమాజ నిర్మాణమే ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు పునాది అని పేర్కొంటూ ప్రజల్లో అవగాహన కల్పించే దిశగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి తన పరిసరాల పరిశుభ్రతపై కనీస బాధ్యత అవగాహన కలిగి ఉండాలని అన్నారు. మన ఇల్లు, వీధి, గ్రామం, పట్టణం పరిశుభ్రంగా ఉండేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. వ్యక్తిగత స్థాయిలో మార్పు ప్రారంభమైనప్పుడే సమాజంలో సానుకూల మార్పు సాధ్యమవుతుందని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రగా తీర్చిదిద్దే లక్ష్యంతో గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి సారించారని, ప్రతి మూడవ శనివారం రాష్ట్రంలోని ఏదో ఒక నియోజకవర్గంలో పర్యటిస్తూ ప్రజల్లో పరిశుభ్రతపై చైతన్యం కల్పిస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి చూపిస్తున్న మార్గాన్ని ఆదర్శంగా తీసుకుని ప్రజలంతా తమ గ్రామాలు, పట్టణాలను పరిశుభ్రంగా ఉంచేందుకు బాధ్యతాయుతంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "స్వచ్ఛాంధ్ర" కార్యక్రమాన్ని ప్రజలందరూ విజయవంతం చేయాలని, ఆరోగ్యవంతమైన మరియు పరిశుభ్రమైన సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే గారు ఆకాంక్షించారు. పరిశుభ్రత అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాకుండా ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ప్లాస్టిక్ భూతాన్ని తరిమేద్దాం

## ఒంగోలు శాసనసభ్యుడు దామచర్ల జనార్దన్ రావు పిలుపు




ఒంగోలు (చైతన్యరథం): మన ఇంటి నుంచి, మన నగరం నుంచి ప్లాస్టిక్ భూతాన్ని తరిమేద్దామని, కాలుష్యాన్ని నివారించి, భావితరాలకు ఆస్తులే కాదు ఆరోగ్యాన్ని కూడా ఇద్దామని శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, ప్లాస్టిక్ కవర్లను, వస్తువుల వాడకానికి దూరంగా ఉండాలని తెలిపారు. ఒంగోలు నగరంలోని కొత్త మార్కెట్ లో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో జనార్దన్ పాల్గొని ప్రసంగించారు. ప్రజల ఆరోగ్యానికి మరియు పరిశుభ్రతకు సీఎం చంద్రబాబు ప్రాధాన్యమిస్తూ స్వచ్ఛంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ప్లాస్టిక్ వినియోగంతో అటు ఆరోగ్యం, ఇటు పర్యావరణం తీవ్రంగా దెబ్బతింటోందన్నారు. ప్లాస్టిక్ కవర్లు, ఇతర వస్తువులు రాకుండా చేయడంలో మహిళలే కీలకమన్నారు.గత పాలకులు చెత్త మీద పన్ను వేసి, ప్రజలపై ఆర్థిక భారంగా మోపారన్నారు. సీఎం చంద్రబాబునాయుడు అధికారంలోకి రాగానే చెత్త పన్ను రద్దు చేసి, అదే చెత్త ద్వారా సంపద సృష్టిస్తున్నారన్నారు. చెత్తతో వర్మీ కంపోస్ట్, ఇతర సేంద్రీయ ఎరువులను తయారు చేస్తున్నారన్నారు. స్వచ్ఛ రథాల ద్వారా ప్లాస్టిక్, ఇనుము, ఇతర వ్యర్థాలు సేకరించి, ప్రజలకు నిత్యావసర సరుకులు అందజేస్తున్నారన్నారని జనార్దన్ తెలిపారు. ప్రజలంతా ప్లాస్టిక్ నివారణకు సహకరించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కనిగిరి శాసనసభ్యులు ఉగ్ర నరసింహారెడ్డి, గోపాలపురం శాసనసభ్యుడు వెంకట రాజు, కమిషనర్ వెంకట కృష్ణయ్య, కూటమి పార్టీ నాయకులు అధికారులు పాల్గొన్నారు.

# పార్టీ కోసం మరింత కష్టపడాలి

## టీడీపీ ఒంగోలు, నెల్లూరు పార్లమెంటు కోఆర్డీనేటర్ మద్దిపాటి పిలుపు

ఒంగోలు (చైతన్యరథం): రాష్ట్ర తెలుగుదేశం పార్టీ నూతనంగా నియమించిన ఒంగోలు, నెల్లూరు పార్లమెంట్‌ల జోనల్ కో-ఆర్డినేటర్ గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు శనివారం ఒంగోలు నగరం, రామ్ నగర్ 2వ లైన్‌లోని ఒంగోలు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి మొదటిసారిగా విచ్చేసిన సందర్భంగా ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షు కనిగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పార్లమెంట్ కమిటీ సభ్యులతో కలిసి ఘన స్వాగతం పలికారు.ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు కనిగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే డా.ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి కొఠారి నాగేశ్వరరావు, పూల బొకేతో శాలువాతో జోనల్ కో ఆర్డినేటర్ మద్దిపాటి వెంకట రాజుని ఘనంగా సత్కరించారు. కమిటీ సభ్యులు అందరూ జోనల్ కో ఆర్డినేటర్ మద్దిపాటి వెంకట రాజుకి శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం జోనల్ కో ఆర్డినేటర్ మద్దిపాటి వెంకటరాజు ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు, డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డిఅధ్యక్షతన పార్లమెంట్ కమిటీ సభ్యులతో కలిసి జిల్లా రాజకీయ అంశాల గురించి, పార్టీ కోసం కష్టపడిన పార్టీ నాయకులు కార్యకర్తల గురించి మాట్లాడటం జరిగింది. కమిటీ సభ్యులు అందరూ ఉగ్ర నరసింహారెడ్డి నాయకత్వంలో బాగా పని చేసి ఒంగోలు పార్లమెంట్‌ని మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి కొఠారి నాగేశ్వరరావు, పార్లమెంట్ అధికార ప్రతినిధులు దాసరి వెంకటేశ్వర్లు, బీరం అరుణా రెడ్డి, కార్యనిర్వాహ కార్యదర్శి గార్లపాటి శ్రీనివాసరావు, కార్యదర్శులు కసుకుర్తి అంకరాజు, తంజావూరి శ్రీనివాసమూర్తి, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# సీఎం చంద్రబాబు బాటలోనే చదువులకు ప్రోత్సాహం

## పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన అబ్దుల్ అజీజ్



నెల్లూరు (చైతన్యరథం): ఏపీ వక్ఫ్ బోర్డ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న తాలీం ఏ హునర్ టాలెంట్ టెస్ట్ నేపథ్యంలో నెల్లూరు నగరంలోని పీఎన్ఎం స్కూల్ లో ఏర్పాట్లను ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ పరిశీలించారు. సందర్భంగా అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 10 జిల్లాల్లో మధ్యాహ్నం రెండు గంటల నుండి ఐదు గంటల వరకు టాలెంట్ టెస్ట్ జరగనుందని తెలిపారు. నెల్లూరులో వి ఆర్ సి హై స్కూల్, పిఎన్ఎం గర్ల్స్ హై స్కూల్, సెయింట్ జోసెఫ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ లలో పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏర్పాట్లను పరిశీలించామని పరీక్షను చాలా పకడ్బందీగా నిర్వహించనున్నారని చేపట్టవలసిన విధి విధానాలు అన్ని అమలు చేస్తున్నారని అన్నారు. విద్యార్థులకు ఇచ్చిన హాల్ టికెట్ మనకు కాగితంలా కనపడుతుందని వారికి మాత్రం వారి భవిష్యత్తుకు ఒక వీసా లా కనపడుతుందని అన్నారు. విద్యకు పేదరికం అడ్డు కాకూడదనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచనతో కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళుతున్నామని అన్నారు. విద్యార్థులను ప్రోత్సహిస్తే ఆకాశమే హద్దుగా ఎదుగుతారని వివరించారు. విద్యార్థులు ఎవరూ భయభ్రాంతులకు గురికాకుండా ధైర్యంగా పరీక్ష రాయాలని కోరారు. అన్ని జిల్లాల్లో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న జిల్లా కలెక్టర్లకు ఎస్పీలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం

## బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత

పెనుకొండ (చైతన్యరథం): పెనుకొండ క్యాంపు కార్యాలయంలో మంత్రి సవిత ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. పెనుకొండ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత ప్రజల నుండి నేరుగా ఫిర్యాదులు స్వీకరించారు. వివిధ గ్రామాల నుండి వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత, భూ, పెన్షన్, రేషన్, గృహ నిర్మాణం, విద్యుత్, తదితర సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి ఒక్కరి సమస్యను విన్న మంత్రి సవిత సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, ప్రజల సమస్యలను తెలుసుకుని వెంటనే స్పందించడం కూటమి ప్రభుత్వ ప్రధాన



లక్ష్యమని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. క్యాంపు కార్యాలయానికి వచ్చిన ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ప్రజా దర్బార్‌లో వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే కోట్ల

డోన్ (చైతన్యరథం): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) కార్యక్రమంలో భాగంగా ప్యాపిలి పట్టణంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో ప్రజల నుండి ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా, ప్రజలు నీటి సరఫరా, రోడ్లు, పింఛన్లు, విద్యుత్, ఆరోగ్య సదుపాయాలు వంటి ప్రధాన సమస్యలను ఎమ్మెల్యేకి వివరించారు. ఎమ్మెల్యే ప్రతి వినతిని శ్రద్ధగా పరిశీలించి, సంబంధిత శాఖాధికారులతో సమన్వయం చేసి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రజా సంక్షేమమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ, అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. ప్రజలు ఎప్పుడైనా తమ సమస్యలను తెలియజేయవచ్చని సూచిస్తూ, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని భరోసా ఇచ్చారు.

# ప్లాస్టిక్ రహిత నగరంగా అనంతపురం

## స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ప్రతిజ్ఞ




అనంతపురం (చైతన్యరథం): ఈ వారం ప్లాస్టిక్ రహిత ఆంధ్రప్రదేశ్ అనే థీమ్ తో కార్యక్రమం జరిగింది. మున్సిపల్, సచివాలయ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు, టీడీపీ నేతలు పాల్గొన్నారు. ప్లాస్టిక్ నిర్మూలన అవగాహన కల్పిస్తూ నగరంలో ర్యాలీ నిర్వహించారు. టవర్ క్లాక్ వద్ద ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రతిజ్ఞ చేయించారు. అధికారులు ఫైన్లు వేస్తారన్న భావనతో ప్రజలు ఉండ కూడదని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ వలన కలిగే నష్టాన్ని గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. ఎక్కడా ప్లాస్టిక్ కవర్లు, సింగల్ యూజ్ వస్తువులు వాడొద్దన్నారు. వాటి స్థానంలో పేపర్, క్లాత్ బ్యాగ్స్ వినియోగించాలని కోరారు. దీనిపై ఇప్పటికే అనేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పిస్తామన్నారు. వందశాతం ప్లాస్టిక్ రహిత నగరమే లక్ష్యంగా ఉద్యమిస్తామన్నారు.

# మంత్రి లోకేష్ పర్యటనతో టీడీపీ కార్యకర్తల్లో జోష్

అనంతపురం (చైతన్యరథం): అర్బన్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీలో ఎలాంటి విబేధాలు లేవు, ఉండబోవని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ గారు స్పష్టం చేశారు. ఇందుకు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ గారి పర్యటనే నిదర్శనమన్నారు. అనంతపురం నగరంలో ఈనెల 14న జరిగిన జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ పర్యటనను విజయవంతం చేసిన పార్టీ శ్రేణులకు ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. అందరం సమిష్టిగా కష్టపడి ఈ పర్యటన ఏర్పాట్లు చేశామన్నారు. ఈ పర్యటనలో కార్యకర్తల జోష్ చూసి నారా లోకేష్ గారు కూడా ఎంతో సంతోషం వ్యక్తం చేశారన్నారు. అలాగే ఆయన చెప్పిన మాటలు కార్యకర్తలకు ఉత్సాహాన్ని, స్ఫూర్తిని ఇచ్చాయన్నారు. రాత్రి 11.30గంటల వరకు ఎంతో ఓపికగా ఉండి.. ప్రతి ఒక్కర్నీ పలుకరిస్తూ ఫోటో సెషన్ నిర్వహించారన్నారు. ఎక్కడా చిన్న ఆటంకం కల్గకుండా, ఎలాంటి వివాదాలకు తావు లేకుండా కార్యకర్తల సమావేశం జరిగిందన్నారు. కార్యకర్తలు ఎంతో క్రమశిక్షణగా ఉండి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారన్నారు. అర్బన్ నియోజకవర్గంలో విబేధాలు ఉన్నాయని ప్రచారం చేసే వారికి ఈ పర్యటన ఒక సమాధానం అన్నారు. మరోవైపు నారా లోకేష్ గారు ఇచ్చిన స్ఫూర్తితో స్థానిక సంస్థల ఎన్నికల్లో పని చేస్తామన్నారు. గతంలో అర్బన్ నియోజకవర్గంలో గెలిచి ముఖ్యమంత్రి చంద్రబాబుకు కానుకగా ఇస్తామని చెప్పి.. మాట నిలబెట్టుకున్నామన్నారు. ఈసారి 62డివిజన్లు, 4పంచాయతీల్లో గెలిచి నారా లోకేష్‌కి కానుకగా ఇస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు.




# ప్లాస్టిక్ వాడకాన్ని నివారించి పర్యావరణాన్ని కాపాడుదాం

## కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పిలుపు




కదిరి (చైతన్యరథం): ప్లాస్టిక్ వద్దు పేపర్ బ్యాగ్‌లు ముద్దు, ప్లాస్టిక్ నివారిద్దాం పర్యావరణం కాపాడుదాం అని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పట్టణంలో మెప్మా సిబ్బంది, నాయకులు కార్యకర్తలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. పర్యావరణాన్ని పరిరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరు పాటుపడాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ కవర్, వస్తువుల వాడకాన్ని ప్రతి ఒక్కరు నిషేధించాలని, పేపర్ సంచులు వాడి పర్యావరణాన్ని కాపాడాలని స్థానిక వ్యాపారులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. స్వచ్చంద్ర కమిషన్ డైరెక్టర్ పర్వీన్ బాను,పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, మున్సిపల్ ఇంచార్జ్ కమిషనర్ సందీప్,మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# ఇందనం పొదుపు చేద్దాం : ఎమ్మెల్యే అమిలినేని

కళ్యాణదుర్గం (చైతన్యరథం): దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దేశ, రాష్ట్ర ప్రయోజనాల కోసం ఇందన పొదుపు చర్యలు చేపట్టి తమ వాహన శ్రేణిని పూర్తిగా తగ్గించుకోగా వారి అడుగుజాడల్లో నడుస్తూ నేడు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు తన వాహనాలను పక్కన పెట్టి ఎలక్ట్రికల్ స్కూటీ మీద అనంతపురంలోని తన స్వగృహం బృందావనం నుంచి వ్యక్తిగత కార్యాలయానికి వెళ్లడం జరిగింది. ప్రతి ఒక్కరు బాధ్యతగా ఇందన పొదుపు చేపట్టాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

# సమస్యల సత్వర పరిష్కారం కోసమే ప్రజాదర్బార్ : ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం వెల్లడి



గుంతకల్లు (చైతన్యరథం): గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఆయన సోదరుడు గుంతకల్లు మండల ఇంచార్జ్ నారాయణస్వామితో కలిసి స్థానిక గుంతకల్లు పట్టణం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఆవరణలో ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజలనుండి అర్జీలను స్వీకరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రజలకు అందుబాటులో ఉండేందుకు ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు తమకు ఏదైనా సమస్య ఉంటే అర్జీ రూపంలో తనకు తెలియజేస్తే మీ సమస్య పరిస్కారం చేస్తామని ఇక్కడే తీరే సమస్య అయితే వెంటనే సంబంధిత అధికారితో మాట్లాడి పరిష్కారం చేస్తామని తెలిపారు, దీర్ఘ కాలిక సమస్యలను పార్టీ ఆఫీస్ కి పంపడం జరుగుతుంది అని తెలిపారు. ఈ కార్యక్రమం లో గుంతకల్లు పట్టణ మండల పట్టణ, మండల కూటమి నాయకులు, కార్యకర్తలు అధికార సిబ్బంది పాల్గొన్నారు.







# కన్నుల పండుగలా కువైట్ మినీ మహానాడు

**కువైట్:** కువైట్‌లో మినీ మహానాడు 2026, ఎన్టీఆర్ 104వ జయంతి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఎన్ఆర్ఐ టీడీపీ కువైట్ ఆధ్వర్యాన అబ్బాసియాలోని సెంట్రల్ స్కూల్లో మినీ మహానాడును కన్నుల పండుగగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి, పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్‌రెడ్డి, శాప్ చైర్మన్ రవినాయుడు, రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు సుగవాసి ప్రసాద్ బాబు, సుండుపల్లి మండల పార్టీ అధ్యక్షుడు చప్పిడి రమేష్‌నాయుడు విచ్చేశారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ... స్వర్గీయ ఎన్టీఆర్ ప్రపంచ దేశాల్లో తెలుగు ప్రజల ఆత్మ గౌరవాన్ని సగర్వంగా నిలిపారన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు



టీడీపీ చేసిన పోరాటం అద్వితీయమన్నారు. కుటుంబాలను వదిలి తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన మీరు పార్టీపై చూపుతున్న అభిమానం మాకు స్ఫూర్తి నిస్తోందని కొనియాడారు. భవిష్యత్తులో కూడా ఇదే ఒరవడి కొనసాగించాలని, మీకు అన్ని విధాల సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను దేశంలో నెం.1గా నిలిపేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, యువ నేత లోకేష్ అహర్నిశలు కష్టపడుతున్నారని, వారికి మనమంతా అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఐ టీడీపీ గల్ఫ్ కౌన్సిల్ సభ్యుడు వెంకట్ కోడూరి, ఉదయ్‌ప్రకాష్, దివాకర్, ముస్తాక్ ఖాన్, రెడ్డయ్య చౌదరి, రెడ్డి శేఖర్, బాలా రెడ్డయ్య, బాబు మాలేపాటి, దేవిచౌదరి, మురళి దుగ్గినేని, మస్తాన్, పృథ్వీరాజ్ ఖాదురున్, వేణురాజు, సలీంబాషా, సౌదీకి చెందిన ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.





# గ్యాస్ స్టేషన్ ఓనర్ టు సిటీ కౌన్సిలర్

**అమెరికాలో భారత సంతతికి చెందిన వారు రాజకీయాల్లో దూసుకుపోతున్నారు. తాజాగా తూర్పు టెక్సాస్‌లోని ఓ చిన్న పట్టణంలో భారతీయ వలసదారుడు, స్థానిక వ్యాపారవేత్త అయిన యశ్ అసర్నా సరికొత్త చరిత్ర సృష్టించారు. రస్క్ (Rusk) నగర మండలి (సిటీ కౌన్సిల్)కి ఎన్నికైన మొట్టమొదటి భారతీయ-అమెరికన్‌గా ఆయన రికార్డుకెక్కారు.**



## టెక్సాస్ చిన్న పట్టణం ఎన్నికల్లో భారతీయ వ్యాపారవేత్త హవా

## ఏకగ్రీవంగా ఎన్నికై రికార్డు సృష్టించిన యశ్ అసర్నా

**రస్క్ (టెక్సాస్):** రెండు దశాబ్దాల క్రితం మెరుగైన అవకాశాల కోసం యశ్ అసర్నా భారతదేశాన్ని విడిచిపెట్టి అమెరికాలో అడుగుపెట్టారు. మొదట్లో టెక్సాస్ పాశ్చాత్య సంస్కృతి, కౌబాయ్ ఇమేజ్‌కు ఆకర్షితుడైనప్పటికీ.. రస్క్ పట్టణ ప్రజలు చూపించిన ప్రేమ ఆయన్ను అక్కడే స్థిరపడేలా చేసింది. 15 సంవత్సరాలుగా 'ట్రక్కర్జ్' (Truckerz) అనే గ్యాస్ స్టేషన్‌ను విజయవంతంగా నడుపుతున్నారు. కౌంటర్ వెనుక ఉంటూ అన్ని వర్గాల ప్రజలతో మమేకం కావడం వల్ల స్థానిక సమాజంలో ఆయన ఒక సుపరిచితమైన, నమ్మకమైన వ్యక్తిగా గుర్తింపు తెచ్చుకున్నారు.

**ఏకగ్రీవంగా ఎన్నిక... ప్రమాణస్వీకారం**

డల్లాస్‌కు ఆగ్నేయంగా సుమారు 130 మైళ్ల దూరంలో ఉన్న రస్క్... కేవలం 5వేల మంది జనాభా ఉన్న ఒక చిన్న కమ్యూనిటీ. చారిత్రాత్మకంగా వలసదారుల ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉన్న ఈ ప్రాంతంలో.. యశ్ అసర్నా డిస్ట్రిక్ట్-3 కౌన్సిల్ సీటుకు ఏకగ్రీవంగా ఎన్నిక కావడం విశేషం. ఈ నెల 14న రస్క్ సిటీ హాల్లో ఆయన కౌన్సిలర్‌గా ప్రమాణస్వీకారం చేశారు. ఈ విజయాన్ని స్థానిక ప్రముఖ టెలివిజన్ ఛానెల్ CBS19 నగర చరిత్రలోనే 'చారిత్రాత్మక తొలి విజయం'గా అభివర్ణించింది.

**నా రకమైన రాజకీయం: "రెండు చెవులు.. ఒక నోరు"**

సమాజంలో ఉన్న విభేదాలను తొలగించి ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతోనే తాను ఎన్నికల బరిలోకి దిగానని అసర్నా తెలిపారు. తన విజయ రహస్యాన్ని వివరిస్తూ..

"దేవుడు మనకు రెండు చెవులు, ఒక నోరు ఇచ్చాడు. అంటే రెండుసార్లు విని, ఒక్కసారే మాట్లాడాలి. నేను అందరి సమస్యలను ఓపికగా వినగలను. అదే నన్ను ఇతరుల కంటే భిన్నంగా నిలబెట్టింది" అని పేర్కొన్నారు.

**నేను కేవలం 950 డాలర్లతో (ప్రస్తుత భారత కరెన్సీలో దాదాపు రూ.80వేలు) ఈ అద్భుతమైన దేశానికి వచ్చాను. అప్పట్లో నా దగ్గర ఉన్నదంతా అంతే... అసర్నా**

కొత్తగా ఎన్నికైన కౌన్సిల్ సభ్యుడిగా నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఆయన కొన్ని కీలక లక్ష్యాలను పెట్టుకున్నారు.

- రోడ్లు, మౌలిక సదుపాయాల మెరుగుదల.
- నగర బడ్జెట్ లోటును పరిష్కరించడం.
- కొత్త పోలీస్ చీఫ్‌ను నియమించడం.
- రస్క్ డౌన్‌టౌన్‌ను పునరుజ్జీవింపజేయడం.

**భారతదేశానికి రాయబారిని...**

అమెరికాలో ఎంత ఎదిగినా తన మూలాలను మర్చిపోనని అసర్నా గర్వంగా చెప్పారు. "నేను ఇక్కడ కేవలం కౌన్సిలర్‌ని మాత్రమే కాదు.. భారతదేశానికి ఒక ప్రతినిధిని, భారత రాయబారిని అని భావిస్తున్నాను" అని ఎమోషనల్ అయ్యారు. కేవలం ఒక చిన్న కలతో టెక్సాస్‌కు వచ్చి... ఈరోజు ఆ నగరానికే నాయకత్వం వహించే స్థాయికి ఎదగడం 'అమెరికన్ డ్రీమ్'కు నిజమైన నిదర్శనమని, కష్టపడే తత్వం ఉంటే ఏదైనా సాధ్యమేనని ఆయన నిరూపించారు.

# 30న టాంపాలో భద్రాద్రి రామయ్య కల్యాణం

**ఫ్లోరిడా:** మన అమెరికా తెలుగు అసోసియేషన్ (MATA), హిందూ టెంపుల్ ఆఫ్ ఫ్లోరిడా ఆధ్వర్యంలో ఈ నెల 30న "భద్రాచల శ్రీసీతారామ కల్యాణ మహోత్సవం" జరగనుంది. ఈ పవిత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు మాటా (MATA) కార్యవర్గ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

తేదీ: మే 30 (శనివారం)

సమయం: ఉదయం పది గంటలకు (EST)

వేదిక: హిందూ టెంపుల్ ఆఫ్ ఫ్లోరిడా, టాంపా.

ఈ కార్యక్రమాన్ని మాలిని రెడ్డి (330-962-4200), జేబీ అవుల (813-503-5985) సమన్వయం చేస్తున్నారు. స్పాన్సర్‌షిప్ అవకాశాల కోసం కూడా జేబీ ఆవులను సంప్రదించవచ్చు. ఈ ఉత్సవానికి మేటా ప్రెసిడెంట్ రమణ కిరణ్ దుడ్డాగి నేతృత్వం వహిస్తుండగా కన్వీనర్ శ్రీధర్ గుడాల, కో-కన్వీనర్లుగా టోనీ జన్ను, దాము గేదెల వ్యవహరిస్తున్నారు.

భక్తులు $101 (సేవార్థి) లేదా $501 (మహా సేవార్థి) చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. మరిన్ని వివరాలకు www.mata-us.org వెబ్‌సైట్‌ను సందర్శించాలి.

# స్నేహానికి ది హేగ్ సజీవ చిహ్నం

## నెదర్లాండ్స్ పర్యటనలో ప్రధాని నరేంద్ర మోదీ



భారతదేశం అభివృద్ధిలో దూసుకెళ్తోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. డిజిటల్ చెల్లింపుల్లో ప్రపంచంలోనే భారత్ అగ్రస్థానంలో ఉందని చెప్పారు. దేశంలో ప్రస్తుతం నెలకు 20 బిలియన్ డాలర్ల డిజిటల్ ట్రాన్సాక్షన్లు జరుగుతున్నాయని తెలిపారు. భారత్‌లో ఒకప్పుడు కేవలం 4 యూనికార్న్ సంస్థలే ఉండేవని.. ప్రస్తుతం అవి 100కు చేరాయన్నారు. సెమీకండక్టర్ల అంశంలోనూ భారత్ ముందడుగు వేసిందని.. ఆ దిశగా పనులు కూడా జరుగుతున్నాయని పేర్కొన్నారు. నెదర్లాండ్స్ పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ, ది హేగ్ నగరంలో ప్రవాస భారతీయులను కలిశారు. వారితో మాటామంతీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఐలపై ప్రశంసలు కురిపించారు. లక్ష్యాలను అధిగమించి వారు పని చేస్తున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మాట్లాడుతూ.. 'ఇంతటి ప్రేమ, ఉత్సాహాన్ని చూసి నెదర్లాండ్స్‌లో ఉన్నానన్న సంగతి ఒక్క క్షణం మర్చిపోయాను. భారతదేశంలోనే ఓ ఉత్సవానికి హాజరైనట్లు అనిపించింది. భారత స్నేహానికి ది హేగ్ సజీవ చిహ్నంగా మారిందని అనిపిస్తోంది. నేను నెదర్లాండ్స్ నాయకత్వంతో మాట్లాడిన ప్రతిసారీ వారు ప్రవాస భారతీయులను ప్రశంసిస్తూనే ఉంటారు. నెదర్లాండ్స్ సమాజానికి, ఆర్థిక వ్యవస్థకు మీరు చేసిన సేవకు ప్రతి భారతీయుడు గర్వపడుతున్నాడు. మీ పూర్వీకులు ఇక్కడికి వచ్చినప్పుడు ఎన్నో విషయాలను వదిలేశారు. కానీ కొన్ని విషయాలు ఎల్లప్పుడూ మీతోనే ఉండిపోయాయి. భారతదేశ మట్టి పరిమళం, పండుగల జ్ఞాపకాలు, భక్తి గీతాల రాగాలు, పూర్వీకులు అందించిన విలువలు మీతో ఉన్నాయి. కాలక్రమేణా ఎన్నో సంస్కృతులు కనుమరుగయ్యాయనే వాస్తవానికి మానవ చరిత్రే సాక్ష్యం. కానీ భారతదేశ విభిన్న సంస్కృతి ఇప్పటికీ మన ప్రజల హృదయాల్లో బలంగా ఉంది. తరాలు మారాయి, దేశాలు మారాయి, పరిసరాలు మారాయి, కానీ కుటుంబ విలువలు, మనం ఒక సమూహానికి చెందినవారమనే భావన ఎన్నడూ మారలేదు. సరిగ్గా 12 ఏళ్ల క్రితం ఇదే రోజున, 2014 మే 16న లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. దశాబ్దాల తర్వాత భారతదేశంలో సంపూర్ణ మెజారిటీతో స్థిరమైన ప్రభుత్వం ఏర్పడింది. అప్పటి నుంచి కోట్లాది మంది భారతీయుల నమ్మకం నన్ను ఆగనివ్వదు, అలసిపోనివ్వదు' అని చెప్పుకొచ్చారు.




# నీట్ లీకుల నీడలో ఎన్టీఏ విలవిల

## సంస్థ రద్దు కోరుతూ సుప్రీం కోర్టులో యునైటెడ్ డాక్టర్స్ ఫ్రంట్ పిటిషన్

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ దేశంలోని ప్రముఖ విద్యా సంస్థలలో ప్రవేశాలు, ఫెలోషిప్‌ల కోసం అర్హత పరీక్షలను నిర్వహించేందుకు భారత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఓ స్వతంత్ర, స్వయంప్రతిపత్తి కలిగిన పరీక్షా సంస్థ. అయితే 2026లో నీట్ పేపర్ సహా గతంలోనూ పలు ప్రశ్నపత్రాలు లీక్ కావడంతో.. ఇప్పుడు ఆ సంస్థ ఉనికి ప్రమాదంలో పడేలా ఉంది. ఎన్టీఏను రద్దు చేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలవడమే ఇందుకు కారణం. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్-యూజీ 2026 ప్రశ్నపత్రం లీక్ వ్యవహారం మరింత తీవ్రరూపం దాల్చింది. ఎన్టీఏను పూర్తిగా రద్దుచేయాలని కోరుతూ యునైటెడ్ డాక్టర్స్ ఫ్రంట్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ప్రస్తుతం సొసైటీస్ రిజిస్ట్రేషన్ చట్టం, 1860 కింద సేవలందిస్తున్న ఎన్టీఏ స్థానంలో పార్లమెంట్ చట్టం ద్వారా పారదర్శకత, జవాబుదారీతనం కలిగిన స్వతంత్ర జాతీయ పరీక్షా సంస్థను ఏర్పాటుచేయాలని పిటిషన్‌లో కోరింది. ఆర్టికల్-32 కింద దాఖలైన ఈ పిటిషన్‌లో నీట్-యూజీ 2026 నిర్వహణలో వ్యవస్థాగత లోపాలు చోటుచేసుకున్నాయని డాక్టర్స్ ఫ్రంట్ ఆరోపించింది. ప్రశ్నపత్రం లీక్ ఘటనతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అనిశ్చితిలో పడిందని, దేశవ్యాప్తంగా పోటీ పరీక్షల నిష్పక్షపాతంపై నమ్మకం దెబ్బతిందని పేర్కొంది. ఇప్పటికే ఈ పరీక్ష రద్దుకావడం, మళ్లీ పరీక్ష నిర్వహించేందుకు కేంద్రం నిర్ణయించడంతో ఎన్టీఏ తీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఈ కేసు దర్యాప్తులో సీబీఐ ఇప్పటికే కీలక పురోగతి సాధించింది. పుణెకు చెందిన కెమిస్ట్రీ ప్రొఫెసర్ పీవీ.కులకర్ణిని ప్రధాన సూత్రధారిగా గుర్తించి శుక్రవారం అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఎన్టీఏ తరపున పరీక్షా ప్రక్రియలో భాగస్వామిగా పనిచేసిన కులకర్ణికి ప్రశ్నపత్రాలపై మంచి అవగాహన ఉందని సీబీఐ తెలిపింది. ఈ అవకాశాన్ని దుర్వినియోగం చేసి, ఏప్రిల్ చివరి వారంలో తన ఇంట్లో ప్రత్యేక కోచింగ్ తరగతులు నిర్వహించి విద్యార్థులకు ప్రశ్నలు, జవాబులు చెప్పినట్లు ఆరోపించింది. ఈ తరగతులకు హాజరైన విద్యార్థులు లక్షల రూపాయలు చెల్లించినట్లు దర్యాప్తులో బయటపడింది. వారు నోటుబుక్స్‌లో రాసుకున్న ప్రశ్నలు, నీట్ పరీక్షల్లో వచ్చిన ప్రశ్నలతో పూర్తిగా సరిపోలాయని సీబీఐ తేల్చింది. ఇప్పటికే మధ్యవర్తులుగా వ్యవహరించిన పలువురిని అదుపులోకి తీసుకున్న అధికారులు.. దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహించి ఎలక్ట్రానిక్ పరికరాలు, కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన దేశంలోని అత్యంత కీలక ప్రవేశ పరీక్షల భద్రతను ప్రశ్నార్థకం చేసింది. ఎన్టీఏ వ్యవస్థపై ప్రజల విశ్వాసం దెబ్బతిన్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందన్నది ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

### తాజాగా బోటనీ టీచర్ మనీషా మందారే అరెస్ట్

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ పేపర్ లీక్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో మరో కీలక సూత్రధారి, పుణెకు చెందిన బోటనీ



టీచర్ మనీషా మందారేను సీబీఐ అరెస్ట్ చేసింది. ఆమె నీట్ బయాలజీ ప్రశ్నాపత్రం లీక్ కావడంలో కీలక పాత్ర పోషించినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. పుణెకు చెందిన మనీషా బోటనీ విభాగంలో సీనియర్ అధ్యాపకురాలుగా పని చేస్తున్నారు. మనీషాను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నీట్ ప్రక్రియలో సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్‌గా నియమించింది. ఏప్రిల్ నుంచి ఆమె కొందరు నీట్ అభ్యర్థులకు తన ఇంటి వద్దే శిక్షణా తరగతులను నిర్వహించారు. ఆ సమయంలోనే ఆమె వారికి నీట్ పరీక్షకు సంబంధించిన బోటనీ, జువాలజీ పేపర్లలోని ప్రశ్నలను లీక్ చేశారు.

# ఎస్పీ సీనియర్ నేత అజాం ఖాన్‌కు కోర్టులో మళ్లీ చుక్కెదురు



సమాజ్‌వాదీ పార్టీ సీనియర్ నేత అజాం ఖాన్ తిరిగి లీగల్ చిక్కుల్లో పడ్డారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో చేసిన వివాదాస్పద వ్యాఖ్యలకు సంబంధించి ఆయనకు ఎంపీ ఎమ్మెల్యే కోర్టు రెండేళ్ల జైలు శిక్ష విధించింది. దీనితో పాటు రూ.5,000 జరిమానా కూడా విధించింది. గత కొన్నేళ్లుగా వరుసగా పలు లీగల్ చిక్కులు ఎదుర్కొంటున్న అజాంఖాన్‌కు మరోసారి ఈ తీర్పుతో ఎదురుదెబ్బ తగిలింది. అజాంఖాన్ 2019 లోక్‌సభ ఎన్నికల్లో జిల్లా యంత్రాంగం అధికారులపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అప్పట్లో ఆయన వ్యాఖ్యలు సంచలనం కాగా, ఇందుకు సంబంధించిన వీడియోలు వైరల్ అయ్యాయి. 'స్థిరంగా నిలబడండి. ఈ కలెక్టర్లు, అధికారులకు భయపడవద్దు. వాళ్ల జీతం తీసుకునే ఉద్యోగులు. వాళ్లకు మనం భయపడాల్సిన పనిలేదు. మీరు మాయావతి ఫొటోలు చూసే ఉంటారు. సీనియర్ అధికారులు ఆమె బూట్లను చేతిరుమాళ్లతో తుడిచారు. మనం ఆమెతో పొత్తు పెట్టుకున్నాం. అల్లా తలిస్తే ఈ ఆఫీసర్లతో కూడా ఆమె బూట్లు పాలిష్ చేయిస్తా' అని ఎన్నికల ర్యాలీలో అజాంఖాన్ వ్యాఖ్యానించారు. ఆయన వ్యాఖ్యలు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించేలా ఉన్నాయంటూ ఫిర్యాదు నమోదైంది. దానిపై ఎంపీ ఎమ్మెల్యే కోర్టు విచారణ జరిపి తాజాగా తీర్పునిచ్చింది. అజాంఖాన్ ప్రస్తుతం రాంపూర్ జైలులో ఉన్నారు.

### ఎన్నికల్లో వివాదాస్పద వ్యాఖ్యల పర్యవసానం

అజాంఖాన్‌కు లీగల్‌గా దెబ్బతగలడం ఇదే మొదటిసారి కాదు. 2026 ఏప్రిల్‌లో అజాంఖాన్, ఆయన కుమార్ అబ్దుల్లా అజాంఖాన్ దాఖలు చేసిన అప్పీల్‌ను రాంపూర్ సెషన్స్ కోర్టు కొట్టివేసింది. 2019లో తండ్రీకొడుకులు రెండు వేర్వేరు పాన్ కార్డులు కలిగి ఉన్నారనే కేసులో వారిని దోషులుగా ఎంపీ, ఎమ్మెల్యే కోర్టు నిర్ధారించింది. 2025లో తీర్పు ప్రకటిస్తూ ఇద్దరికీ చెరో ఏడేళ్ల జైలుశిక్ష విధించింది. జరిమానా కూడా వేసింది.

### మళ్లీ టీఎంసీని నిర్మిస్తా : మమతా బెనర్జీ

పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ ఓటమిని చవిచూడటంతో పార్టీని కొత్తగా నిర్మించాలని ఆ పార్టీ అధినేత్రి మమత బెనర్జీ నిర్ణయించుకున్నారు. పార్టీలో ఉండాలనుకునే వాళ్లు ఉండవచ్చని, వద్దనుకునే వాళ్లు నిరభ్యంతరంగా వెళ్లిపోవచ్చని స్పష్టం చేశారు. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులతో కాళీఘాట్ నివాసంలో మమతా బెనర్జీ సమావేశమయ్యారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ సైతం హాజరయ్యారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమి చవిచూసినా తిరిగి పుంజుకుంటుందని మమతా బెనర్జీ ఈ సమావేశంలో ఆశాభావం వ్యక్తం చేసారు. నేను పార్టీని కొత్తగా నిర్మిస్తాను. పార్టీతోనే ఉండాలనుకునే వారు దెబ్బతిన్న పార్టీ కార్యాలయాలను పునర్నిర్మించండి. రంగులు వేసి తిరిగి ప్రారంభించండి. తృణమూల్ కాంగ్రెస్ ఎన్నటికీ తలవంచేది లేదు. ప్రజాతీర్పును దొంగిలించారు' అని మమతా బెనర్జీ ఈ సమావేశంలో పేర్కొన్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి.



# సీబీఎస్ఈలో కీలకమార్పులు

దేశవ్యాప్తంగా ఉన్న సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ స్కూళ్లలో లాంగ్వేజ్ విధానంలో సరికొత్త విప్లవాత్మక మార్పులు రానున్నాయి. రాబోయే జూలై 1, 2026 నుండి 9, 10 తరగతుల విద్యార్థులకు 'మూడు భాషల విధానాన్ని' తప్పనిసరి చేస్తూ సీబీఎస్ఈ మే 15న అధికారికంగా సరికొత్త సర్క్యులర్ జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వ జాతీయ విద్యా విధానం, నేషనల్ కరికులం ఫ్రేమ్‌వర్క్ సూచనలకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు బోర్డు వెల్లడించింది. 2026-27 విద్యాసంవత్సరానికి గాను ఎన్సీఈఆర్టీ విడుదల చేసిన నూతన సిలబస్‌ను సమీక్షించిన తర్వాతే ఈ మార్పులు చేసినట్లు బోర్డు స్పష్టం చేసింది. ఏప్రిల్‌లోనే విద్యాసంవత్సరం ప్రారంభమైనప్పటికీ, విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా జూలై నుండి ఒక పరివర్తన ప్రక్రియ ద్వారా దీనిని అమలు చేయనున్నారు. **కచ్చితంగా రెండు భారతీయ భాషలు:** కొత్త నిబంధన ప్రకారం విద్యార్థులు అభ్యసించే మూడు భాషల్లో కనీసం రెండు భాషలు కచ్చితంగా స్థానిక భారతీయ భాషలై ఉండాలి. **ఫారిన్ ల్యాంగ్వేజ్ ఆప్షన్:** ఒకవేళ విద్యార్థులు ఫ్రెంచ్, జర్మన్ వంటి విదేశీ భాషలను చదవాలనుకుంటే, మిగిలిన రెండు భాషలు భారతీయ భాషలైనప్పుడు మాత్రమే దానికి అనుమతి ఉంటుంది. లేదా విదేశీ భాషను 4వ అదనపు భాషగా కూడా

### 9, 10 తరగతుల్లో మూడు భాషల విధానం

చదువుకోవచ్చు.బోర్డు పరీక్షల నుంచి మినహాయింపు: విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకు గాను, ఈ నూతన విధానంలోని మూడవ భాషకు 10వ తరగతిలో బోర్డు పరీక్ష ఉండదు. స్కూల్ స్థాయిలోనే ఇంటర్నల్ అసెస్‌మెంట్ ద్వారా దీనికి మార్కులు లేదా గ్రేడులు ఇస్తారు. అయితే ఇందులో పాస్ కావడం మాత్రం తప్పనిసరి. మిడిల్ స్టేజ్ (మిడిల్ స్కూల్), సెకండరీ స్టేజ్ చదువుల మధ్య లాంగ్వేజ్ స్కిల్స్, గ్రామర్, రీడింగ్ కాంప్రహెన్షన్ వంటి అంశాలలో 75 నుంచి 80 శాతం వరకు పోలికలు ఉంటాయని బోర్డు పేర్కొంది. అందువల్ల ప్రస్తుతానికి 9వ తరగతి విద్యార్థుల కోసం ఎన్సీఇఆర్టీ రూపొందించిన 6వ తరగతి స్థాయి పాఠ్యపుస్తకాలనే ఉపయోగించనున్నారు. ఈ పుస్తకాలతో పాటు స్థానిక, రాష్ట్ర స్థాయి సాహిత్యానికి సంబంధించిన కథలు, కవితలను కూడా సిలబస్‌కు అదనంగా చేర్చాలని స్కూళ్లను ఆదేశించింది. దీనికి సంబంధించిన పూర్తి గైడ్‌లైన్స్‌ను జూన్ 15, 2026 నాటికి సీబీఎస్ఈ విడుదల చేయనుంది. జూలై 1 లోపు 19 అధికారిక భారతీయ భాషలకు సంబంధించిన 6వ తరగతి పాఠ్యపుస్తకాలను బోర్డు అందుబాటులోకి తీసుకురానుంది.

# ఇరాన్‌పై మళ్లీ యుద్ధం తప్పదా!

## ‘ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ 2.0’ సిద్ధమవుతోన్న ట్రంప్?



అమెరికా మరోసారి ఇరాన్‌పై సైనిక చర్యకు సిద్ధపడుతోందా? తాజా పరిణామాలు చూస్తే ఆ అనుమానం బలపడుతోంది. రెండు దేశాలమధ్య గత ఏప్రిల్ 7నుంచి కాల్పుల విరమణ కొనసాగుతున్నప్పటికీ, శాశ్వత శాంతి ఒప్పందం మాత్రం కుదరడం లేదు. చర్చలు చాలా రోజులుగా ప్రతిష్టంభనలో కూరుకుపోయాయి. అమెరికా, ఇరాన్ రెండూ మొండిగా తమ వైఖరులను వీడటం లేదు. ఈ నేపథ్యంలో సమస్య పరిష్కారానికి సైనిక చర్య ఒక్కటే సరైన మార్గమని అమెరికా భావిస్తోందన్న ప్రచారం మొదలైంది. ఈ కొత్త సైనిక చర్యకు ‘ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ 2.0’ అని పేరు పెట్టినట్టు తెలుస్తోంది. ఇదే సమయంలో అధ్యక్షుడు ట్రంప్ చైనా పర్యటన చేపట్టడం ఈ ప్రచారానికి మరింత బలం చేకూర్చింది. ఆ చర్చల్లో ఇరాన్ అణ్వాయుధ దేశంగా మారడాన్ని అమెరికాతోపాటు చైనా కూడా వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు. ఇరాన్‌పై సంభావ్య దాడులకు చైనా మద్దతు కోరినట్టు కూడా ప్రచారం జరుగుతోంది. చర్చల్లో అణ్వాయుధ తయారీ, హర్మూజ్ జలసంధివంటి కీలక అంశాలు కూడా ప్రస్తావనకు వచ్చాయి.

అణ్వాయుధ అంశంలో అంగీకారం కుదరడం లేదు. ఇరాన్ శాంతి ప్రతిపాదనలను అమెరికా, అమెరికా ప్రతిపాదనలను ఇరాన్ తిరస్కరిస్తున్నాయి. మరోవైపు ఇజ్రాయెల్ కూడా కొత్త దాడులకు సిద్ధంగా ఉందని అమెరికా ప్రతినిధులు వెల్లడించారు. అవసరమైతే తిరిగి యుద్ధానికి దిగుతామని ఇరాన్ కూడా స్పష్టం చేసింది. అయితే, తుది నిర్ణయం అధ్యక్షుడు ట్రంప్‌దే. ఈ ఏడాది నవంబర్‌లో అమెరికాలో మిడ్‌టర్మ్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఇరాన్‌పై యుద్ధం ట్రంప్‌కు రాజకీయంగా ఎంత మేలు చేస్తుందో, ఎంత ఇబ్బంది తెస్తుందో వేచి చూడాల్సిందే.

## ఐసిస్ టాప్ కమాండర్ మట్టి కరిచాడు

### ప్రకటించిన డొనాల్డ్ ట్రంప్



ఐసిస్ అగ్రశ్రేణి కమాండర్ అబు–బిలాల్ అల్–మినూకిని హత మార్చినట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. అమెరికా, నైజీరియా ప్రత్యేక బలగాలు సంయుక్తంగా ఈ ఆపరేషన్ నిర్వహించాయని తెలిపారు. తన సొంత సోషల్ మీడియా వేదిక ‘ట్రూత్ సోషల్’లో ట్రంప్ ఈ విషయాన్ని ప్రకటించారు. “నా ఆదేశాలమేరకు అమెరికా బలగాలు, నైజీరియా భద్రతా బలగాలు సంయుక్తంగా ఐసిస్ అగ్ర కమాండర్ అబు–బిలాల్ అల్–మినూకిని మట్టుబెట్టాయి. ఐసిస్‌లో రెండో అత్యున్నత హోదాలో ఉన్న మినూకి ఆఫ్రికాలో దాక్కో గలనని భావించాడు. కానీ మా గూఢచార వర్గాలు అక్కడా ఉన్నాయని అతడు గ్రహించలేకపోయాడు. ఇకపై అతడు ఆఫ్రికా ప్రజలను భయభ్రాంతులకు గురి చేయలేడు. అమెరికన్ల ను లక్ష్యంగాచేసుకుని ఆపరేషన్లు పన్నలేడు.నాతో కలిసి పనిచేసిన నైజీరియా ప్రభుత్వానికి నా కృతజ్ఞతలు” అని ట్రంప్ పేర్కొన్నారు. నైజీరియాలో జన్మించిన మినూకి ఇస్లామిక్ స్టేట్ వెస్ట్ ఆఫ్రికా ప్రావిన్స్‌లో సీనియర్ కమాండర్‌గా వ్యవహరించేవాడు. టెర్రర్ సెల్స్‌కు మార్గ దర్శకత్వం వహించడం, అంతర్జాతీయ నిధులను మళ్లించడం వంటి కార్యకలాపాల్లో పాల్గొన్నందుకు 2023లో అమెరికా అతడిని అధికారికంగా ఉగ్రవాది గా గుర్తించింది. మినూకి మృతితో ప్రపంచవ్యాప్తంగా ఐసిస్ కార్యకలాపాలు మరింత బలహీనమవుతాయని ట్రంప్ ధీమా వ్యక్తం చేశారు.

## భారత్ నాలుగు మహత్తర లక్ష్యాలివే

### నెదర్లాండ్స్‌లో ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగం

భారత్‌కు నాలుగు అతి పెద్ద ఆకాంక్షలు ఉన్నాయని ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. శనివారం నెదర్లాండ్స్‌లోని హేగ్‌లో భారతీయులతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఒలింపిక్స్ నిర్వహించడం, అంతర్జాతీయ తయారీ కేంద్రంగా మారడం, గ్రీన్ ఎనర్జీ హబ్‌గా ఎదగడం, ప్రపంచ ఆర్థిక శక్తిగా నిలవడం–ఇవే ఆనాలుగు మహత్తర లక్ష్యాలని మోదీ ప్రకటించారు. “భారతీయ ఆకాంక్షలు అనంతమైనవి. మన ప్రయత్నమూ అపరిమితం. ఇండియా కీలక తయారీ కేంద్రంగా ఎదుగుతోంది. దేశాన్ని ఆధునిక టెక్ స్టార్టప్ వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు దేశ యువత నిరం తరం శ్రమిస్తోంది. డ్రోన్లు, కృత్రిమ మేధ సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేస్తున్న యువతకు ధన్యవాదాలు. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా ఇండియా నిలిచింది. సెమీకండక్టర్ల తయారీ హబ్‌గా మారడానికి సిద్ధమవుతున్నాం. ఇటీవలే అతిపెద్ద ఏఐ సదస్సు ఇండియాలో జరిగింది. దేశంలో 12 సెమీకండక్టర్ తయారీ యూనిట్లు నిర్మాణ దశలో ఉన్నాయి. వాటిలో రెండింటిలో పని ఇప్పటికే మొదలైంది” అని మోదీ వివరించారు.



2014 మే 16న బీజేపీ మెజారిటీ సాధించిన రాజకీయ ప్రయాణానికి ఈ రోజు పన్నెండేళ్లు పూర్తయిన సంగతి ప్రస్తావిస్తూ, బీజేపీకి, దేశ ప్రజలకు మధ్య అనుబంధం మరింత బలపడుతోందని చెప్పారు. ఇటీవలి ఎన్నికల్లో 80–90 శాతం ఓటర్లు తమ హక్కు వినియోగించుకోవడాన్ని పెరుగుతున్న ప్రజాస్వామ్య స్ఫూర్తికి నిదర్శనంగా పేర్కొన్నారు. “భారత్ అభివృద్ధి చెందితే అది యావత్ ప్రపంచానికి మేలు చేస్తుంది” అని మోదీ ముగించారు.

## తైవాన్‌పై ట్రంప్ కీలక వ్యాఖ్యలు

### అమెరికా వైఖరిలో మార్పు వస్తోందా?



తైవాన్ అంశంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. “తైవాన్‌అంశం మాకు క్లిష్టమైన సమస్యే. ఈ ద్వీపం చైనాకు కేవలం 95 కిలోమీటర్ల దూరంలో ఉంటే, అమెరికాకు 15 వేల కిలోమీటర్లకు పైగా దూరాన ఉంది. ఇంతదూరంగా ఉన్నందున మేం వేగంగాస్పందించడం కష్టమే.చైనా చాలా శక్తిమంతమైన, పెద్ద దేశం. ఉద్రిక్తతల విషయంలో చైనా, తైవాన్ రెండూ సంయమనం పాటించాలి. వారి స్వాతంత్ర్య ఆకాంక్షల కోసం అంతదూరం ప్రయాణించి యుద్ధం చేయాలని మేం అనుకోవడం లేదు” అని ఓ వార్తాసంస్థతో ట్రంప్ చెప్పారు.

చైనా పర్యటన అనంతరం ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాముఖ్యం సంతరించుకుంది. తైవాన్ సమస్య సరిగ్గా పరిష్కారం కాకపోతే అమెరికా – చైనా మధ్య ఘర్షణ తప్పదని జిన్‌పింగ్ స్పష్టం చేసినట్టు వార్తలు వచ్చిన నేపథ్యంలో ఈవ్యాఖ్యలు మరింత ప్రాధాన్యత సంతరించుకున్నాయి. అమెరికా–చైనాలు భాగస్వాములుగా ఉండాలే తప్ప.. ప్రత్యర్థులుగా కాదని జిన్‌పింగ్ అన్న మాటలు గమనార్హం. తైవాన్‌ను తనలో విలీనంచేసుకోవాలని చైనా కోరుకుంటోంది. తైవాన్ స్వాతంత్ర్యాన్ని అమెరికా బహిరంగంగా వ్యతిరేకించాలన్నది చైనా వాదన. “తైవాన్ విషయంలో చైనా ఏకపక్ష చర్యలకు దిగరాదు” అని ఇప్పటివరకూ అమెరికా స్పష్టం చేస్తూ వచ్చింది. కానీ ట్రంప్ ఇప్పుడు దానికి భిన్నంగా మాట్లాడటం, తైవాన్‌కు ఆయుధాలు విక్రయించే అంశంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని చెప్పడం –అమెరికా విధానంలో పెను మార్పులకు సూచికగా కనిపిస్తోంది.

## ఇన్‌స్టాపై మస్క్ రచ్చ!

### మండిపడుతున్న నెటిజన్లు

సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్ ఇన్‌స్టాగ్రామ్‌పై ప్రముఖ బిలియనీర్ ఎలాన్ మస్క్ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఇన్‌స్టాగ్రామ్ కేవలం అమ్మాయిల కోసమేనంటూ సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌కి తెరతీశారు. ఫొటోలు పెట్టడం, రీల్స్ చేయడం, వంట ఫొటోలు షేర్ చేయడంవంటి అంశాలపై ఒక వైరల్ థ్రెడ్ నడుస్తున్న సందర్భం గా మస్క్ అందులోకి దూకారు. ఇన్‌స్టాగ్రామ్ అమ్మాయిల కోసమేనంటూ వ్యాఖ్యానించారు.




అందులో ఆగకుండా “కొంతమంది మగవాళ్లు తమ ఇన్‌స్టా ప్రొఫైల్స్ నాకు పంపుతుంటారు. అప్పుడు వాళ్లు లింగమార్పిడి చేయించుకుంటున్నా రా? అని అనిపిస్తుంది” అని వివాదాస్పద వ్యాఖ్య చేశారు. దాంతో నెటిజన్లు తీవ్ర స్థాయిలో మస్క్‌పై మండిపడ్డారు. ఇలాంటి వ్యాఖ్యలు చేయడం మస్క్‌కు కొత్తేమీ కాదని, ఉద్దేశపూర్వకంగా వినియోగదారులను రెచ్చగొట్టే ‘రేజ్ బైటింగ్’ మస్క్‌కు అలవాటైపోయిందని యూజర్లు అంటున్నారు. లింగ మార్పిడి అంశంపై ఆయనకు స్పష్టమైన వ్యతిరేక అభి ప్రాయాలున్నాయని తెలిపారు.తన ‘ఎక్స్’ ప్లాట్‌ఫామ్‌ను ప్రమోట్ చేసుకునే వ్యూహంలో భాగంగానే మస్క్ ఇన్‌స్టాగ్రామ్‌పై పిచ్చి విమర్శలు చేస్తుంటారన్న వ్యాఖ్యలూ వినిపిస్తున్నాయి.

# మాల్దీవుల్లో విషాదం

- సముద్రగర్భ గుహలో చిక్కుకుని
- ఐదుగురు స్కూబా డైవర్ల దుర్మరణం

పర్యాటక స్వర్గంగా పేరొందిన మాల్దీవుల్లో ఘోర విషాదం చోటుచేసుకుంది. సముద్రగర్భంలోని ఒక గుహలోకి స్కూబా డైవింగ్ చేసిన ఐదుగురు అన్వేషకులు ప్రాణాలు కోల్పోయారు.దేశ చరిత్రలోనే అతిపెద్ద స్కూబా డైవింగ్ ప్రమాదమని మాల్దీవ్స్ ప్రభుత్వం తెలిపింది. స్థానిక మీడియా, అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం –ఇటలీకి చెందిన మోనికా మాంటెఫాల్కన్, జార్జియా సోమాకల్, ఫెడెరికో గ్వాల్టెరి, మ్యురియెల్ ఒడెనినో, జియాన్లుకా బెనెడెట్టి అనే ఐదుగురు డైవర్లు వావు అటోల్‌లోని సుమారు 50మీటర్ల లోతైన సముద్రగర్భ గుహలోకి గురువారం అన్వేషణకు దిగారు. కానీ వారు పైకి రాలేదు. సమాచారం అందిన వెంటనే అధికారులు, రక్షక దళాలు సహాయక చర్యలు ప్రారంభించాయి. వారిలో జియాన్లుకా బెనెడెట్టి మృతదేహం మాత్రమే గుహ ముఖద్వారం వద్ద లభించింది. మిగతా నలుగురి కోసం శుక్రవారంనుంచి సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోంది. ఎనిమిదిమంది డైవర్లు సెర్చ్‌లో పాల్గొంటున్నారు. ఇటలీనుంచి మరో ఇద్దరు డైవర్లు కూడా సహకరించే అవకాశం ఉందని, ఇటలీ ప్రభుత్వం మొత్తం సహకారం అందిస్తోందని అధికారులు తెలిపారు. మరణానికిగల ఖచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు. అయితే, గుహ లోపల వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా ఉండటమే కారణమని అనుమానిస్తున్నారు.



# చెలరేగిన ఫిన్ అలెన్

- గుజరాత్‌పై కోల్‌కతా నైట్ రైడర్స్ ఘనవిజయం
- రాణించిన రఘువంశీ, కామెరూన్ గ్రీన్
- చివరి వరకూ పోరాడిన ఓడిన టైటాన్స్

ఐపీఎల్ 2026లో మరో భారీ స్కోర్ నమోదైంది. ఈడెన్ గార్డెన్స్ వేదికగా గుజరాత్ టైటాన్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో కేకేఆర్ ఘన విజయం సాధించింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కేకేఆర్.. నిర్ణీత 20 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి ఏకంగా 247 పరుగులు చేసింది. గుజరాత్‌కు 248 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. కేకేఆర్ ఓపెనర్ ఫిన్ అలెన్ జీటీ బౌలర్లపై విరుచుపడ్డాడు. 35 బంతుల్లో నాలుగు ఫోర్లు, 10 సిక్సర్లతో ఏకంగా 93 పరుగులు చేశాడు.






తృటిలో సెంచరీ మిస్ చేసుకున్నాడు. అంగ్‌క్రిష్ రఘువంశీ(82; 44 బంతుల్లో 4 ఫోర్లు, 7 సిక్స్‌లు), కామెరూన్ గ్రీన్(52; 28 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) హాఫ్ సెంచరీలతో చెలరేగారు. రఘువంశీకి ఈ సీజన్‌లో ఇది ఐదో హాఫ్ సెంచరీ కావడం విశేషం. ఓపెనర్, కెప్టెన్ అజింక్య రహానె(14) మరోసారి విఫలమయ్యాడు. గుజరాత్ బౌలర్లలో సిరాజ్, సాయి కిషోర్ తలోక వికెట్ పడగొట్టారు.

**పోరాడి ఓడిన గుజరాత్**

అనంతరం 248 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన గుజరాత్ చివరివరకూ పోరాడింది. శుభమన్‌గిల్ 49 బంతుల్లో 85, జోస్ బట్లర్ 35 బంతుల్లో 55, సాయిసుదర్శన్ 28 బంతుల్లో 53 పరుగులు చేశారు. 20 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 218 పరుగులు చేసి ఓటమి చవిచూసింది. ఈ ఓటమితో గుజరాత్ టైటాన్ ప్లేఆఫ్‌కు అవకాశాలు మూసుకుపోయాయి.




## టీ20ల్లో పాక్ మహిళా క్రికెటర్ రికార్డ్

పాకిస్థాన్ మహిళా క్రికెట్ జట్టు కెప్టెన్ ఫాతిమా సనా టీ20 క్రికెట్‌లో ప్రపంచ రికార్డు నెలకొల్పింది. శుక్రవారం జింబాబ్వేతో జరిగిన మ్యాచ్‌లో 15 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసింది. తద్వారా అంతర్జాతీయ మహిళల టీ20 క్రికెట్‌లో అత్యంత వేగవంతమైన హాఫ్ సెంచరీ నమోదు చేసిన ప్లేయర్‌గా సనా రికార్డు సృష్టించింది. గతంలో ఈ రికార్డు సోఫీ డివైన్ (న్యూజి లాండ్), ఫోబ్ లిచ్‌ఫీల్డ్(ఆస్ట్రేలియా), రిచా ఘోష్(భారత్) పేరిట సంయుక్తంగా ఉండేది. ఈ ముగ్గురు 18 బంతుల్లో హాఫ్ సెంచరీలు పూర్తి చేశారు. తాజాగా ఫాతిమా సనా వీరి రికార్డును బద్దలు కొట్టి సింగిల్ ప్లేయర్‌గా ప్రపంచ రికార్డు నమోదు చేసింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా జింబాబ్వేతో కరాచీ వేదికగా జరిగిన మూడో టీ20లో పాకిస్థాన్ 133 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. దీంతో 3–0తో సిరీస్‌ను పాక్ క్లీన్ స్వీప్ చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన పాక్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 223 పరుగులు చేసింది. ఫాతిమా సనా 19 బంతుల్లో 62 పరుగులు చేసి పాక్ భారీ స్కోర్ చేయడంలో కీలక పాత్ర పోషించింది.




## పంత్‌కు భారీ జరిమానా

ఐపీఎల్ 2026లో భాగంగా శుక్రవారం చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో లఖ్‌నవూ అద్భుత విజయాన్ని సాధించింది. సీఎస్కేపై 7 వికెట్ల తేడాతో లఖ్ నవూ విజయం సాధించింది. గెలుపు జోష్‌లో ఉన్న లఖ్‌నవూ జట్టుకు భారీ షాక్ తగిలింది. ఆ జట్టు కెప్టెన్ రిషబ్ పంత్‌కు ఐపీఎల్ నిర్వాహకులు భారీ జరిమానా విధించారు. స్లో ఓవర్ రేట్ కారణంగా ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ రిషబ్ పంత్‌కు రూ.12 లక్షల జరిమానా విధించింది. ఐపీఎల్ ప్రవర్తన నియమావలిలోని ఆర్టికల్ 2.22 ప్రకారం జరిమానా విధించారు. లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ జట్టుకు ఈ సీజన్లో ఇది తొలి తప్పిదం కావడంతో ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ కేవలం కెప్టెన్‌కు మాత్రమే రూ.12 లక్షల జరిమానా విధించింది. ఒకవేళ ఇదే తప్పు మళ్లీ పునరావృతమైతే..అప్పుడు కెప్లెన్ పంత్‌కు 24 లక్షలతో పాటు జట్టులోని మిగిలిన ఆటగాళ్లకు మ్యాచ్ ఫీజులో 25 శాతం లేదా 6 లక్షలు.. రెండింటిలో ఏదీ తక్కువ అయితే అది జరిమానాగా విధిస్తారని క్రీడా నిపుణులు చెబుతున్నారు.

## ఫైనల్‌కు సాత్విక్-చిరాగ్ జోడీ

### థాయ్‌లాండ్ ఓపెన్




థాయ్‌లాండ్ ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్–500 టోర్నీలో భారత స్టార్ పురుషుల డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్–చిరాగ్‌శెట్టి అద్భుత ప్రదర్శనలు కనబరుస్తోంది. శనివారం ఉత్కంఠ భరితంగా సాగిన సెమీ ఫైనల్ పోరులో మలేషియా జోడీ గో జెఫీ–నూర్ ఇజ్జుద్దీన్‌పై 19–21, 22–20, 21–16 తేడాతో సాత్విక్–చిరాగ్ విజయం సాధించి ఫైనల్‌కు దూసుకెళ్లారు. ఈ సీజన్‌లో తొలి ఫైనల్ బెర్త్‌ను ఖాయం చేసుకున్న జోడీగా నిలిచారు. ప్రపంచ నెంబర్ 4 ర్యాంక్‌లో ఉన్న భారత జోడీ 19–21, 22–20, 21–16 తేడాతో మలేషియాపై గెలుపొందింది. గంటా 22 నిమిషాల పాటు సాగిన ఈ పోరులో సాత్విక్–చిరాగ్ జోడీ అద్భుత పోరాట పటిమ కనబర్చింది. ఈ విజయంతో మలేషియా జోడీపై తమ హెడ్–టు–హెడ్ రికార్డును 8–2కు మెరుగుపరుచుకుంది. పీవీ సింధు, లక్ష్యసేన్ ఇప్పటికే ఈ టోర్నీ నుంచి నిష్క్రమించడంతో భారత్ ఆశలన్నీ ఈ జోడీపైనే ఉన్నాయి. తొలి సెట్‌ను మలేషియా ప్లేయర్లు గో జెఫీ- నూర్ ఇజ్జుద్దీన్ 20–19 తేడాతో సొంతం చేసుకున్నారు. ఆ తర్వాత అద్భుతంగా పుంజుకున్న భారత జోడీ రెండో సెట్‌ను 22–20తో కైవసం చేసుకుంది. మ్యాచ్‌ను తేల్చే మూడో సెట్‌లో విజయం కోసం ఇరు జట్లూ తీవ్రంగా శ్రమించాయి. అయితే సాత్విక్–చిరాగ్ జోడీ దూకుడు ప్రదర్శించి 21–16తో సెట్‌ను గెలిచి ఫైనల్‌కు దూసుకెళ్లింది.




## మహిళా టీ20 ప్రపంచకప్ పాక్ జట్టు

ఇంగ్లండ్ అండ్ వేల్స్ వేదికగా జూన్ 12 నుంచి జూలై 5 వరకు మహిళల టీ20 ప్రపంచకప్ 2026 జరగనున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వరల్డ్ కప్‌లో పాల్గొనే వివిధ దేశాలు తమ జట్లను ప్రకటిస్తున్నాయి. ఇటీవలే ఆస్ట్రేలియా తమ జట్టును ప్రకటించింది. ఇవాళ 15 సభ్యులతో కూడిన జట్టును పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ప్రకటించింది. ఈ జట్టుకు కెప్టెన్‌గా ఫాతిమా సనా ను నియమించారు. వరుసగా రెండోసారి సనానే టీ20 ప్రపంచ కప్‌లో పాక్ జట్టును ముందుండి నడిపించనుంది.

**పాకిస్థాన్ జట్టు:** ఫాతిమా సనా (కెప్టెన్), అలియా రియాజ్, అయేషా జాఫర్, డయానా బేగ్, ఈమాన్ ఫాతిమా, గుల్ ఫిరోజా, ఇరామ్ జావేద్, మునీబా అలీ (వికెట్ కీపర్), నష్రా సంధు, నటాలియా పర్వైజ్, రమీన్ షమీ, సాదియా ఇక్బాల్, సైరా జబీన్, తస్మియా రుబాబ్, తస్మియా రుబాబ్

**రిజర్వ్‌డ్:** అంబర్ కైనాట్, మోమినా రియాసత్, సదాఫ్ షమాస్, సిద్రా అమీన్, సయ్యదా అరూబ్ షా, ఉమ్–ఎ–హని

## 21న అహ్మదాబాద్‌లో ఐసీసీ సమావేశం

ఐపీఎల్ 2026 ఫైనల్‌కు అహ్మదాబాద్ సిద్ధమవుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఐసీసీ ఓ కీలక సమావేశం కూడా అక్కడే జరగనుంది. రాబోయే ఐసీసీ త్రైమాసిక సమావేశాలు భారత్‌లో జరగనున్నాయి. దీనికి అహ్మదాబాద్ వేదిక కానుంది. మే 21న చీఫ్ ఎగ్జిక్యూటివ్స్ కమిటీ వర్చువల్ సమావేశం నిర్వహించనున్నారు. ఆ తర్వాత మే 30–31 తేదీల్లో ఐసీసీ బోర్డు ప్రత్యక్ష సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి ప్రపంచ క్రికెట్ బోర్డుల ఉన్నతాధికారులు హాజరుకానున్నారు. అయితే పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఛైర్మన్ మొహ్సిన్ నఖ్వీ హాజరుపై మాత్రం సందిగ్ధత నెలకొంది. వాస్తవానికి ఈ సమావేశాలను మార్చి లేదా ఏప్రిల్‌లో ఖతార్‌లో నిర్వహించాలని భావించారు. కానీ పశ్చిమాసియా ఉద్రిక్తతల కారణంగా వాయిదా వేశారు. అనంతరం దీనిని అహ్మదాబాద్‌కు మార్చారు. భారత్–పాకిస్థాన్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలు దెబ్బతినండతో నఖ్వీ అహ్మదాబాద్‌కు రాకపోవచ్చనే వార్తలు వస్తున్నాయి. మరోవైపు, అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా జరగనున్న ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్‌కు కూడా నఖ్వీకి

### - పీసీబీ ఛైర్మన్ నఖ్వీ వస్తాడా?

ఆహ్వానం అందినట్లు పాకిస్థాన్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. అయితే దీనిపై బీసీసీఐ నుంచి ఎలాంటి ప్రకటన రాలేదు. పీసీబీ ఛైర్మన్‌గా నఖ్వీ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి బీసీసీఐతో మంచి సంబంధాలు లేవు. ఆసియా కప్ నాటి నుంచి బీసీసీఐ, పీసీబీ మధ్య పలు అంశాల్లో విభేదాలు తలెత్తిన సంగతి తెలిసిందే. ఈ పరిణామాల నేపథ్యంలో హాజరవుతాడా? లేదా? అనేది ఆసక్తికరంగా మారింది.



చైతన్య రథం
సినిమా
ఆదివారం 17 మే 2026 X

# ఇక 3-డీలో హను మాన్!




మొత్తం ఇండియన్ సినిమా దగ్గర రేర్‌గా టచ్ చేసిన సూపర్ హీరో జానర్‌లో హిట్స్ చాలా తక్కువ. అలాంటి సూపర్ జానర్‌లో యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో తేజ సజ్జ హీరోగా దర్శకుడు ప్రశాంత్ వర్మ తెరకెక్కించిన సూపర్ హీరో చిత్రం 'హను మాన్' కొత్త ట్రెండ్‌ని సెట్ చేసింది. పాన్ ఇండియా లెవెల్లో ఊహించని బ్లాకబస్టర్‌గా నిలిచి తెలుగు సినిమా నుంచి వచ్చిన మొదటి సూపర్ హీరో సినిమానే ఒక బ్లాస్ట్‌గా నిలిచింది. అలా గత 2024 సంక్రాంతి బరిలో వచ్చిన ఈ సినిమా 350 కోట్లకి పైగా గ్రాస్‌ని నమోదు చేయడమే కాకుండా ఈరోజుల్లో కూడా భారీ లాంగ్ రన్‌ని అందుకొని సంచలనం సెట్ చేసింది. మరి అలాంటి ఈ సినిమా మళ్లీ థియేటర్స్‌లో విధ్వంసం చేసేందుకు రాబోతుంది. అయితే ఇది మామూలు రీలీజ్ కాదు.. ఈసారి హను మాన్ 3డి వెర్షన్‌లో జూన్ 25న గ్రాండ్‌గా రీరిలీజ్ చేస్తున్నట్టుగా మేకర్స్ ఖరారు చేశారు. తెలుగు సహా హిందీ రెండు భాషల్లో ప్రస్తుతానికి మేకర్స్ కన్ఫర్మ్ చేయగా.. ఇది మాత్రం హను మాన్ సినిమా లవర్స్‌కి ఒకింత బిగ్ అండ్ సర్ప్రైజింగ్ అప్డేట్ అనే చెప్పొచ్చు. మరి ఈసారి రీరిలీజ్‌లో ఎలాంటి రెస్పాన్స్‌ని ఈ చిత్రం అందుకుంటుందో చూడాలి. ఇక ఈ చిత్రంలో అమృత అయ్యర్ హీరోయిన్‌గా నటించగా గౌర హరి సంగీతం అందించారు. అలాగే ప్రైమ్ షో ఎంటర్టైన్మెంట్స్ నిర్మించింది.

## నా బకెట్ లిస్ట్‌లో ఒకటి నెరవేరింది!



మలయాళ సినిమా దగ్గర ఉన్నటువంటి సీనియర్ అండ్ స్టార్ నటుల్లో మమ్ముట్టి ఒకరు. తనదైన ఈజ్ నటనతో ఇప్పటికీ ఛార్మ్ లుక్‌ని మెయిటెన్ చేస్తూ బాక్సాఫీస్ దగ్గర సక్సెస్ ఫుల్‌గా దూసుకెళ్తున్నారు. అయితే లేటెస్ట్‌గా ప్రముఖ నటి రేణుదేశాయ్ మమ్ముట్టితో కలిసి దిగిన పిక్‌ని షేర్ చేసుకొని తన ఆనందాన్ని వ్యక్తం చేశారు ఆమె. మమ్ముట్టితో దిగిన సెల్ఫీ షేర్ చేసుకొని ఇది నాకొక క్రేజీ ఫ్యాన్ మూమెంట్ అంటూ ఆమె ఎగ్జైట్‌మెంట్ కనబరిచారు. "సర్‌తో కొన్ని నిమిషాలు సమయం గడపడం నా బకెట్ లిస్ట్ మూమెంట్స్‌లో ఒకటి. ఫైనల్‌గా నెరవేరింది" అని రేణు దేశాయ్ తెలిపారు. అలానే తాను కలిసిన అతి కొద్దిమంది మంచి మనుషులు, ఇంటెలిజెంట్ వ్యక్తుల్లో ఆయన కూడా ఒకరని ఆమె తెలిపారు. దీనితో ఈ పిక్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అయితే ఈ ఇద్దరి కలయిక మామూలుగా జరిగిందేనా లేక ఏదన్నా సినిమాకి వర్క్ చేస్తున్నారా? అనేది వేచి చూడాలి.

## 'ఈ పరిస్థితిలో నటించలేను'



తాను ఎన్నో రోజులుగా సహనంతో ఉంటున్నానని.. వ్యక్తిగత విషయాల ఎక్కడా మాట్లాడలేదని నటుడు జయం రవి అన్నారు. ఇప్పుడు మాట్లాడాల్సిన సమయం వచ్చిందన్నారు. తాజా పరిణామాలపై ఆయన మీడియా మీట్ నిర్వహించారు. తన పిల్లలకు కూడా తనని దూరం చేశారని కన్నీరు పెట్టుకున్నారు. "ఈ ప్రెస్‌మీట్‌లో కొన్ని విషయాలు ప్రత్యక్షంగా నా అభిమానులతో చెప్పాలనుకుంటున్నాను. ఇంతకాలం నా వ్యక్తిగత జీవితాన్ని మీతో పంచుకోనందుకు క్షమించండి. ముందుగా మీకు ఒక విషయం చెప్పాలనుకుంటున్నాను. విడాకులు వచ్చేవరకూ నా సినిమాలు ఏవీ విడుదల కావు. అప్పటి వరకూ నేను కూడా నటించలేను. నాకు జరిగిన అవమానాలు ఇక భరించడం నా వల్లకాదు. నన్ను ఇబ్బంది పెట్టాలని చూసేవారు ఆపేవరకూ నేను నటించలేను. ఆఫీసులోనే ఉంటాను. రండి.. ఎంతగా ఇబ్బందిపెడతారో పెట్టండి. ఇకపై నేను మౌనంగా ఉండాలని అనుకోవడం లేదు".

"నాకు విడాకులు వస్తాయా.. రావా అనేది పక్కన పెడితే నాపై జరుగుతోన్న ట్రోలింగ్ నన్ను బాధిస్తోంది. నా కెరీర్లో 95శాతం చిత్రాలు హిట్. ఎంతో కష్టపడి ఈ స్థాయికి వచ్చా. మహిళల హక్కుల కోసం ఎన్నో పోరాటాలు చేశా. అలాంటి నాపై ఎన్ని నిందలు వేస్తున్నారు. నా పిల్లలకు మంచి భవిష్యత్ ఉండాలని నేను లక్షలు పెట్టివాళ్లను చదివించాను. వాళ్లపై నాకున్న ప్రేమ గురించి ఎవరికీ ఏమీ తెలియదు. నాకు ప్రేమలేదని రాసేస్తున్నారు. అవి ఎంత బాధిస్తాయో మీకేం తెలుసు" అని బాధపడ్డారు. కేవలం ట్రోలింగ్ కారణంగానే తన స్నేహితురాలు కెనీషాను కోల్పోయానని అన్నారు. ఆమె ఎన్నో వేధింపులు ఎదుర్కొందన్నారు. ఇక తన వ్యక్తిగత జీవితంలో అడ్డంకులు అన్నీ తొలగిపోయిన తర్వాత కచ్చితంగా నటిస్తానని జయం రవి స్పష్టం చేశారు. దానికి ఎంత సమయం పడుతుందో తెలియదని.. కానీ, అంతా మంచే జరుగుతుందని అన్నారు.

## 'ట్రైలర్ చూశాక కంట్రోల్ తప్పా'



ఎంత ఊహించుకున్నా.. దాన్ని మించి 'పెద్ది' ట్రైలర్ ఉంటుందని అంటున్నారు చిరంజీవి.రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో రూపొందిన రూరల్ స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది'. జాన్వీకపూర్ కథానాయిక. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. చిత్ర ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఈనెల 18న ట్రైలర్‌ను విడుదల చేయనున్నారు. ఇప్పటికే 'పెద్ది' ట్రైలర్ వీక్షించిన చిరు తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. అంతేకాదు, ఒక డైలాగ్‌ను కూడా లీక్ చేశారు. "పెద్ది ట్రైలర్ చూశా. వావ్..! 3 నిమిషాలు.. ఫైర్ పవర్ ప్యాక్ ట్రైలర్. చరణ్, బుచ్చి, రెహమాన్.. ఒక్కొక్కరూ తమ బెస్ట్ ఇచ్చారు. కలిసి మాత్రం రప్ఫాడించేశారు! ఎంత ఊహించుకున్నా దాన్ని మించి ఉంటుంది ఈ ట్రైలర్, ఎమోషన్.. ఎలివేషన్, మ్యాడ్నెస్, అన్నీ నెక్స్ట్ లెవల్లో ఉన్నాయి. అన్నట్టు చాలా రోజులైంది మీకు చిరు లీక్స్ ఇచ్చి.. 'మీరందరూ నేను ఆడానని అనుకుంటున్నారు... నేను పోరాడాను సారు..'. సారీ బుచ్చిబాబు.. ట్రైలర్ చూశాక కంట్రోల్ తప్పా..' అని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. క్రీడా నేపథ్య అంశాలతో ముడిపడిన పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా 'పెద్ది'ని బుచ్చిబాబు తీర్చిదిద్దారు. పూర్తిగా ఉత్తరాంధ్ర నేపథ్యంలో సాగనుంది. శివరాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఇప్పటికే విడుదల చేసిన 'చికిరి' పాట, గ్లింప్స్ సినిమాపై అంచనాలను పెంచాయి.

## వ్యూస్ కోసం దిగజారొద్దు

ఇటీవల జరిగిన ఒక కార్యక్రమంలో తమిళనాడు మీడియా ప్రతినిధులు అడిగిన కొన్ని ప్రశ్నలపై ప్రముఖ నటి మాళవిక మోహనన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈమేరకు ఆమె ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. నిన్న తాను ఒక కార్యక్రమానికి హాజరయ్యానని, తమిళనాడు మీడియా జర్నలిస్టుల పట్ల తనకు ఎంతో గౌరవం ఉన్నప్పటికీ, అక్కడ జరిగిన సంఘటన తనను బాధించిందని ఆమె పేర్కొన్నారు. నిన్నటి ఈవెంట్‌లో ఒకరిద్దరు రిపోర్టర్లు పదే పదే చాలా అసభ్యకరమైన, అనవసరమైన ప్రశ్నలు అడిగారని, కేవలం వ్యూస్, పాపులారిటీ కోసమే వారు అలా ప్రవర్తించారని ఆమె మండిపడ్డారు. దళపతి విజయ్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ, ఆయనతో తనకు గత ఏడేళ్లుగా మంచి పరిచయం ఉందని, ఆయనపై తనకు ఎంతో గౌరవం ఉందని తెలిపారు. విజయ్‌ని తన మంచి స్నేహితుడిగా భావించడానికి తాను ఎప్పుడూ గర్వపడతానని, ఒక నటుడిగా, వ్యక్తిగా ఆయన సాధించిన ఎదుగుదలను, అద్భుతమైన ప్రయాణాన్ని పక్కనుండి చూడటం ఒక గొప్ప అనుభూతి అని ఆమె వివరించారు. భవిష్యత్తులో జరిగే ప్రెస్‌మీట్‌లలో లేదా మీడియా సమావేశాలలో సెలబ్రిటీలను గౌరవిస్తూ, మర్యాదపూర్వకంగా ప్రశ్నలు అడగాలని, అది అందరికీ మంచిదని ఆమె కోరారు.



## భారీ ఆఫర్‌కు నో చెప్పిన త్రిష!



వరుస సినిమాలతో సందడి చేస్తున్నారు నటి త్రిష. ఇప్పుడు ఆమెకు సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అగ్ర కథానాయకులు కమల్‌హాసన్ రజనీకాంత్ కలిసి నటిస్తోన్న చిత్రంలో ఆమెను ఎంపిక చేసినట్టు గతంలో వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో రానున్న ఈ చిత్రం కోసం ఆమె భారీగా పారితోషికం తీసుకోనున్నట్టు కూడా ఎన్నో వార్తలు చక్కర్లు కొట్టాయి. అయితే, తమిళనాడు ఎన్నికల ఫలితాల అనంతరం త్రిష సినిమా ఎంపికల్లోనూ ఎన్నో విషయాలు ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటున్నట్టు తెలుస్తోంది. అందులోభాగంగానే ఈ సినిమా కోసం ఏకంగా రూ.12 కోట్లు ఆఫర్ చేసినప్పటికీ ఇందులో నటించేందుకు ఆమె సుముఖత చూపించడం లేదని ఆంగ్ల మీడియాలో కథనాలు వస్తున్నాయి. కమల్ హాసన్ -రజనీకాంత్ 46 ఏళ్ల తర్వాత కలిసి నటిస్తుండడంతో ఈ ప్రాజెక్ట్‌పై అందరిలో ఆసక్తి నెలకొంది. వీరి స్థాయికి తగినట్టే అగ్రకథానాయికను ఎంపిక చేయాలని టీమ్ త్రిషను తీసుకోనుందని గతంలో వార్తలు వచ్చాయి. భారీ పారితోషికం ఆఫర్ చేసినప్పటికీ ఆమె దీన్ని రిజెక్ట్ చేయడం వెనక బలమైన కారణం ఉందని టాక్. ఈ సినిమాను ఉదయనిధి స్టాలిన్‌కు చెందిన రెడ్ జెయింట్ నిర్మాణసంస్థ తెరకెక్కించడంతో ఆమె తిరస్కరించినట్టు ఆంగ్ల మీడియా పేర్కొంది. అసలు త్రిష ఈ ప్రాజెక్ట్‌లో నటిస్తున్నారా? లేదా అనే దానిపై అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. ఇక తాజాగా 'వీరభద్రుడు'లో లాయర్ ప్రీతిగా మెప్పించారు త్రిష. ప్రస్తుతం చిరంజీవికి జోడీగా 'విశ్వంభర'లో నటిస్తున్నారు. వశిష్ఠ దర్శకత్వంలో సోషియో ఫాంటసీ ఫిల్మ్‌గా రూపొందుతోంది. భారీస్థాయిలో రానున్న ఈ సినిమా కోసం ప్రపంచంలోనే టాప్ వీఎఫ్ఎక్స్ కంపెనీలు పనిచేస్తున్నాయి.